ఆంధ్రపత్రిక

సచిత్ర వార పత్రిక



4 అణాలు
22-7-'53.

ANDHRA PATRIKA ILLUSTRATED WEEKLY



వెన్నెల నావలు

సంవత్సర చందా
రు. 12-0-0
విడిప్రతిక 4 అ.


ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక

Founder : K. NAGESWARA RAO

సంపుటము 45
సంచిక 47
22-7-53

విజయ ఆషాఢ శుద్ధ ఏకాదశి; బుధవారం



శ్రావణబెళ్గొలా గోమతేశ్వరుని పాదాలు

ఫొటో: కె. యస్. జమాల్ సాహెబ్, కొత్తపేట.

విషయానుక్రమణిక

ముఖచిత్రం:—రత్నదీప్ పిక్చర్స వారి "నౌలఖాహార్" హిందీ చిత్రంలో మీనాకుమారి.

సంధి విగ్రహం

సంధివిగ్రహం (పంచతంత్రం) బొమ్మల సీరియల్ ఈవారం కారణాంతరాలవల్ల ప్రచురించ లేక పోయినందుకుచింతిస్తున్నాము. తిరిగి త్వరలోనే ప్రచురించగలమని పాఠకులకు మనవి.

— సంపాదకుడు.

కాలక్షేపం

ధరణిధేనువు బిదుకంగ దలచితేని,
జనులబోషింపు, మహిప! వత్సములమాడ్కి;
జనులుపోషింపబడుచుండ, - జగతి కల్ప
లత తెఱంగున సకల ఫలంబు లొసగు.

తా॥ భూమియను గోవునుండి ధనమును పితుకదలచితి వేని, ఓ ప్రభువా! ఆవుదూడలను పోషించిన విధముగా జనులను పోషించు - జనులు పోషింపబడినట్లయితే, భూమి కల్పలతలాగున సకల ఫలములను యివ్వగలదు.

"పాడిపంటల మహాలక్ష్మి భరతమాత!" అని సంకీర్తనంచేశాము మన మాతృదేశాన్ని గురించి - ఈ మాతృ దేశస్తవం కేవలం అభిమానంచేతనే చేసినామని అన్యదేశవాసులు అనుకోవచ్చు. ఎందుచేతనంటే ఎవరిదేశాన్ని గురించి వారు గొప్పగా చెప్పకొనడం సహజం - కాకిపిల్ల కాకికిముద్దు- అమాట త్రోసివేయడానికి వీలులేదు. "సుజలాం సుఫలాం మలయజ శీతలాం సస్య శ్యామలాం వందేమాతరం!" అని చిరకాలం నుంచీ మనం సంకీర్తనచేశాం. ఇప్పుడు "జనగణమన" అనే జాతీయకీర్తన అమలులోకి వచ్చింది.

"వందేమాతరం!" కీర్తనను కుంటపెట్టి గణగణమని గంటవాయించినట్లుగా "జనగణమన" కీర్తనకు అగ్రస్థానం వచ్చిన తర్వాత, "వందే మాతరం!" వెనుకబడింది. "వందే మాతరం!" అంటే ఏమిటి? "ఓతల్లీ! "ఓ జన్మభూమీ! ఓభారతమాతా! నీకు నమస్కరిస్తున్నాను" అని, అర్థం—

"జనగణమన అధినాయక జయహే! జయహే! అంటే ఏమిటి? జనసమూహము యొక్క మనస్సు నాకరించిన అధినాయకునకు-జయము! జయము!" ప్రజాహృదయాధిపతియైన ప్రభుత్వాధిపతికి జయము కలుగుగాక! యని మనమిప్పుడు జాతీయకీర్తన పాడుతున్నాము. ప్రజాస్వామ్యప్రభుత్వ ధర్మసూత్రముల ప్రకారంగా, ప్రభుత్వాధిపతికూడా ఒక భారతీయ పౌరుడే- ఇండియా పార్లమెంటుసభకుగాని, రాష్ట్రశాసన సభలకు గాని ఎన్నికలు జరిగినప్పుడు ఇండియా ప్రెసిడెంటుకూడా యితరవోటర్లవలెనే వోట్లపెట్టెలో తన వోటును వెయ్యాలి. కనుక, అధ్యక్షుడుకూడా మనపౌరసోదరుడే- ఈ జనగణమన అధినాయకునకు జయము కలుగవలెనని మనము సంకీర్తన చెయ్యాలి. అంటే ఏమిటి? అతని అధికారము సక్రమముగా జయప్రదంగా చలామణీ కావలెనని మనకోరిక

"వందే మాతరం!" అనే సంకీర్తనలో "ఓ భారతమాతా! నీకుజయముకలుగుగాక!" అనే జయవాదము ఏమిన్నీ లేదు. "తల్లీ! నీకు నమస్కారం చేస్తున్నాను" అనే అర్థం తప్ప మరొకటి ఏమీలేదు. "మాతృదేవో భవ" అనే భావం ఆ కీర్తనలో ఉంది. తల్లిఅంటే దేవీ సమానురాలు. కనుక ఆమెసన్నిధిలో మనము తలవంచి నమస్కరించడమే మన కర్తవ్యం. అప్పుడు ఆ తల్లియొక్క ఆశీర్వాదప్రసాదమును మనం స్వీకరించాలి. "నాబిడ్డలగు భారతీయులకు జయమగుగాక! నాబిడ్డలు యశఃకాములై వర్ధిల్లెదరుగాక!" అని ఆతల్లి మనకు జయవాదము ఆశీర్వాదము యివ్వవలెనని మన సంకల్పం - మన అభీష్టం - కనుక, మన ప్రభుత్వఅధిపతికి కూడా జయము కలుగుగాక యని ఆశీర్వదించవలసినది భారతమాతయేగాని యీ అధినాయకునియొక్క సాటి పౌరసోదరులమైన మనము కాదు.

బ్రిటిష్‌వారి జాతీయగీతంలో "*God save the king*! (గాడ్ - సేవ్ - ది- కింగ్") (దేవ దేవ! బ్రోవుమయ్య మా రాజునూ!) లేదా, "*God Save the Queen* (గాడ్-సేవ్ - ది- క్వీన్) దేవదేవ బ్రోవుమయ్య మా రాణినీ! అనిగాని భగవంతుణ్ని ఆంగ్లేయ ప్రజలు ప్రార్థిస్తూ తమ జాతీయ గీతం పాడు

దాసు వామనరావు

తున్నారు. తమ రాజునుగాని, రాణినిగాని రక్షించవలసిన భారము భగవంతునకు ఒప్పజెప్పుతున్నారు. కాని, యీవిధంగా భగవంతుణ్ని సంబోధించడంగాని, భగవన్నామస్మరణ చేయడంగాని మనజాతీయగీతంలో అనగా "జనగణ మన అధినాయకజయహే!" అనే కీర్తనలో కన్పించదు.

మనదేశంలో యిప్పుడు మనం ఏర్పాటు చేసిన ప్రభుత్వానికి ప్రత్యేక మతవాసన ఏదిన్నీ లేదన్నారు. ఈప్రభుత్వమునకు ప్రత్యేకించి హిందూమతంగాని మహమ్మదీయ మతంగాని అధిష్ఠానమతంగా లేదు. అందువల్ల యీనాటి మన భారతప్రభుత్వమునకు ఏమతముమీదను ప్రత్యేకమైన మమత లేదు. మన భారతప్రభుత్వము "మత మమత రహిత ప్రభుత్వం" *Secular State*) అన్నారు. కాని, అన్ని మతాలకూ సంబంధించిన సామాన్య లక్షణం ఏదంటే భగవంతునియందు నమ్మకం-భగవంతుడొకడు ఉన్నాడు అనే నమ్మకం అన్ని మతాలకూ ఉంది. ఒక్క నాస్తికమతానికి మాత్రము "భగవంతుడు లేడు" అనే నమ్మకం ఉంది. అందువల్ల నాస్తికమతస్థులనుకూడా, నేటి మనభారత ప్రభుత్వం బాధించకూడదనే యోచల, "దేవుడు" అనే ప్రస్తావనకూడా మన ప్రభుత్వానికి అపథ్యమైన పదార్థంగా విసర్జించవలసినదై ఉంటుంది.

కాని, కోర్టులలో సత్యవాక్య ప్రమాణం చేయించేటప్పుడు "దేవునియెదుట, నాకు తెలిసినంతవరకు నే నెఱింగినంత వరకు ప్రమాణపూర్తిగా నిజమునే చెప్పుతాను. అబద్ధమును చెప్పను" అని ప్రతి సాక్షియును భగవంతుని సాక్షిగా ప్రమాణముచేయాలి. శాసనసభ్యులు తమ సభ్యత్వం స్వీకరించేటప్పుడు "భగవంతుని సాక్షిగా" అని ప్రమాణవచనం చెప్పాలి. కనుక, నేటి మన భారతప్రభుత్వము "మత మమత రహిత రాజ్యం" అయినప్పటికీ, ఆస్తికమత మమత రాజ్యమేగాని, నాస్తిక మతమమత రాజ్యం కాదు. ఈ విధంగా విమర్శించి వితర్కించినందువల్ల తేలిన పర్యవసానం ఏమిటంటే, భగవన్నామస్మరణకూడా ప్రభుత్వాధికార రీత్యా మనంచేయవచ్చు - అయితే ఆ భగవంతుణ్ని ఏదైనా ఒక ప్రత్యేకమైన పేరుతో, విష్ణువు అనిగాని, శివుడు అనిగాని, అల్లా అనిగాని భారతప్రభుత్వాధికారికంగా ప్రత్యేకంగా నిర్వచింపదు. మన ప్రభుత్వం స్వీకరించి అనుసరించిన జాతీయ గీతంలో "దేవా!" అనే సంబోధన కన్పించదు. "ఓదేవా! మా అధినాయకుని రక్షించు!" అనే ధోరణిలో మన జాతీయ గీతం లేదు. "అధినాయకునకు జయము కలుగుగాక!" అని మనమే గొంతెత్తి అంటున్నాము. మనమాటప్రకారంగా జరిగి తీరవలెనంటే, "మీమాటలు మంత్రంబులు" అన్నంత మహిమమనవాక్కులో ఉండాలి. అటువంటివాక్శుద్ధి మనకు ఉన్నదా? అదే మనకు సందేహం.

మనకు వాక్శుద్ధి ముందుగా ఏర్పడితేనే తప్ప, మన జయవాదాలు తడిలేని పొడివాదాలై సుడిగాలికి ఎండుటాకులు ఎగిరినట్లుగా ఎగిరిపోతాయి.

ప్రజలు వాక్శుద్ధిగా అన్నమాట జరిగి తీరుతుంది. అదే ప్రజాప్రభుత్వ తత్త్వ సిద్ధాంతసారసంగ్రహం. అయితే ఈ వాక్శుద్ధి ఎట్లా వస్తుంది? అదే అసలైన సమస్య అన్నారు సమస్తరాజవైద్యులూ, సమస్త రాజకీయవైద్యులూ కూడా. వేపపుల్లతో ఎడతెగకుండా ఆరుమాసాలు ఎవరైతే పళ్ళుతోముకుంటారో అటువంటివారి నోటితో ఏమాట అంటే ఆమాటప్రకారం జరుగుతుందనిన్నీ, అటువంటివారికి వాక్శుద్ధి, వాక్సిద్ధి కలుగుతుందనిన్నీ పూర్వకాలపు పెద్దవాళ్ళుఅంటారు. వేములవాడ భీమకవికి అటువంటి సిద్ధిఉండేది. "అప్పాలన్నీ కప్పాలు" అనగానే అప్పములన్నీ కప్పలైనాయి. కాని రాజకీయవేత్తలు యింతా నమ్మరు -

ప్రజలు త్రికరణశుద్ధిగా "జనగణ మన అధినాయక జయహే!" అనేమాట అనవలెనంటే, ప్రజలకు అన్నవస్త్రాలకు లోటులేకుండా చేయాలన్నారు. అప్పుడు ప్రజలు సంతుష్టాంతరంగులై "అన్నదాతా! సుఖీ భవ!" అన్నట్లుగా "జనగణ మన అధినాయక జయహే!" అని కడుపునిండా అంటారు. అందుకనే పంచవర్ష ప్రణాళికలు తయారు చేయాలన్నారు. నదులకు ఆనకట్టలు నిర్మించాలి. కాల్వలు త్రవ్వించాలి - పొలాలకు నీళ్ళు ప్రవహింపజెయ్యాలి. పంటలు పండించడానికి చెరువులుత్రవ్వి ఎరువులుతయారుచేసి సప్లయిచేయాలి. ట్రాక్టర్లు సప్లయిచేయాలి. గ్రామాలలో పంటసరకుల రవాణాలకు రోడ్లువగైరా సౌకర్యాలు వృద్ధిచేయాలి; ఇతరప్రాంతాలకు రవాణాలు అయ్యే పంటలనే ప్రోత్సహించి ప్రజలకు చేతినిండా ద్రవ్యము దవ్యంగా లభించేటట్లు చెయ్యాలి; నదులకు ఆనకట్టలుకట్టి అక్కడ విద్యుచ్ఛక్తి ఉత్పత్తిచెయ్యాలి; ఆ విద్యుచ్ఛక్తితో ఫ్యాక్టరీలు పనిచేసేటట్లు చెయ్యాలి; ఫ్యాక్టరీలలో పనిచేసే జనానికి ఫ్యాక్టరీలవల్ల ప్రమాదం లేకుండా కట్టుదిట్టాలు చెయ్యాలి. ఈ పనులన్నీ చేయవలెనంటే, ప్రభుత్వానికి పుష్కలంగా, ద్రవ్యం కావాలి. ప్రజలు యీ ద్రవ్యాన్ని

★ కాలక్షేపం ★

యివ్వాలి. ప్రజలు యిచ్చిన ద్రవ్యాన్ని ప్రభుత్వం సద్వినియోగంచేసి, ప్రాజెక్టుల కోసం ఖర్చుచేస్తే, ఆ ద్రవ్యానికి పదిరెట్లుగా ప్రజల అయిశ్వర్యం వృద్ధి అవుతుంది. నిజమే. ఇదంతా నువ్వుగింజ సామెతగా ఆరు పువ్వులూ ఏడుకాయలూ అన్నట్లుగా అరచేతి వైకుంఠంగాఉంది.

భారతదేశంలో పూర్వం కంటె యిప్పుడు పంట ఫలసాయం హెచ్చిందన్నారు ధాన్యం ధరలుకూడా హెచ్చుతూనే ఉన్నాయి. జనసంఖ్యకూడా హెచ్చుతూనే ఉంది. అన్నీ హెచ్చుగానే ఉన్నాయి. కాని, ఆయుఃప్రమాణాలూ, ఆరోగ్యదార్ఢ్యములూ తగ్గుతున్నాయి. మనబిడ్డలను మనం దీవించేటప్పుడు "ఆయురారోగ్య అయిశ్వర్యాభివృద్ధిరస్తు!" అని దీవిస్తాము. "శతమానం భవతి" అని శిష్టాచార సంపన్నులు ఆశీర్వదిస్తారు. మున్ముందుగా పెద్దల ఆశీర్వచనం ఏవిషయంలో అంటే, ఆయుఃప్రమాణ విషయంలో - ఆటుతర్వాత ఆరోగ్యవిషయంలో - ఆటుతర్వాత, చిట్టచివరకు అయిశ్వర్యాభివృద్ధి విషయంలో - ఆర్థికాభివృద్ధిఅంటే అర్థం వృద్ధికావడమే అని ప్రప్రథమంగా ప్రప్రధానంగా అన్వయిస్తున్నాము. దేశంలో అర్థాభివృద్ధి అయిన కొలదీ అర్థాయుష్కులు వృద్ధి అవుతున్నారు. కాని, అర్థాయుష్కులు వృద్ధికావడం అర్థవృద్ధి కాదు. అది ఆర్థికాభ్యుదయం కాదు.

దీనికంతటికీ మూలకారణం ఎక్కడ ఉన్నదంటే తల్లిపాలలో ఉన్న పుష్టి, పోతపాలలో ఉండదు. "ధరణీ ధేనువు" అన్నాడు. భూమి అనేది ఒక చక్కని పాడియావు-"వత్సముల మాడ్కి జనులు"- ఆ చక్కని పాడియావుకు జనులు దూడలవంటివారు. ఆవిధంగా ప్రభువైనవాడు ప్రజలను పరిగణించాలి. భూమిని నమ్ముకొని జీవించేప్రజలు ఆ భూమికి నిజమైన దూడలవంటివారు. కనుక భూసారంబాగా ఉండాలి. ఆ భూసారంలోని బలం సహజమైన ఆహార విహారాల మూలంగా, వృత్తి వ్యాపారాలమూలంగా ప్రజలకు రక్తగతం, శల్యగతం కావాలి. ప్రజలకు తమ జన్మభూమియందు గాఢమైన ప్రేమానురాగాలూ, స్వదేశాభిమానం ఉండాలి. విదేశీవస్తువులన ఆశ్రయించడం మానివేయాలి. తమ ధాన్యం తాము పండించుకోవాలి. తమపత్తిని తాము పండించుకోవాలి. తమ ధాన్యం తాము దంచుకొని, తమబట్టతాము తయారుచేసికొని, సమాజ సిద్ధంగా జీవించాలి. ఏ గ్రామంలోని ప్రజలు ఆ గ్రామంలో స్వయం సమృద్ధముగా జీవించాలి. అటువంటి గ్రామ జీవితం ఏర్పడాలి. అటువంటి గ్రామ జీవితంలో ప్రజలు పుష్టిపెరగాలి. గ్రామంలో ఉన్నవాళ్లు తమ గ్రామాన్ని స్వర్గతుల్యంగా చూచుకోవాలి. స్వర్గతుల్యంగా చేసికోవాలి. తమ జన్మభూమి తమ స్వగ్రామము "స్వర్గాదపి గరీయసి" అనేటట్లు, స్వారాజ్యపదవికి మించిన ఆత్మానందం స్వగ్రామ స్వరాజ్యంలో ప్రజలు పొందాలి. ఇదంతా మహాత్ముని ఊహాగానం అని ఊహించి "ఉష్" అని ఊదివేశారు, మన స్వరాజ్య ప్రభుత్వ మంత్రివర్గ చాణక్య తంత్రజ్ఞులు.

ఒక్క విషయం చూడండి. చేమగ్గాల వారికి చేతినిండా పని కల్పించవలెననిన్నీ బొంబాయి అహమ్మదాబాదు వగైరా నగరాలలోని బట్టలమిల్లులు యీ చేమగ్గాల వారికి ధోవతుల నేతవిషయంలోను, చీరెల నేతవిషయంలోను పోటీకి రాకూడదనిన్నీ, ఆ రెండింటియొక్క ఉత్పత్తినీ చేమగ్గాల వారికే విడిచిపెట్టవలెననిన్నీ ఒక మహాజరును ఢిల్లీ ప్రభుత్వానికి పంపించారు. కాని, ఢిల్లీ ప్రభుత్వమువారు వెంటనే జవాబు చెప్పగలరా? అహమ్మదాబాదు బొంబాయి వగైరా నగరములలోని బట్టలమిల్లుల ఖామందులతో సంప్రతించకుండా జవాబు చెప్పలేరు. చిట్టచివరకు పర్యవసానం ఏమిటంటే, ఆవిధంగా ఆ రెండురకాల వస్త్రముల నేతను బట్టలమిల్లులలో తగ్గించుటకున్నూ, అందుమూలంగా చేమగ్గాల వారికెక్కువ పని కల్పించుటకున్నూ సాధ్యపడదని నిర్ణయించారు.

బట్టలమిల్లులలోని యంత్రాలు తక్కువ కాలంలో ఎక్కువవస్తుజాలం ఉత్పత్తిచేయగలవు-వందమంది చేమగ్గాలమీదఉత్పత్తిచేసే సరకును పదిమంది సహాయంతో ఫ్యాక్టరీ తయారుచేస్తుంది. అందువల్లనే యంత్రమును *Labour - Saving Machine* (లేబర్ - సేవింగ్ - మెషీన్) "కాయకష్టం తగ్గించే యంత్రం" అన్నారు. "శ్రమ తక్కువ ఫల మెక్కువ"-ఇదే యంత్రముల లాభప్రయోజనం. యంత్రాగారాల మూలంగా వందమంది చేసేపనికి స్వస్తిచెప్పి పదిమందిచేతనే ఆపనిని చేయిస్తున్నారు. అందువల్ల 90 మందికి పనిపాటులు లేవు. వడ్లు దంచడంవల్ల దేహానికిచెమటపట్టి రక్తంబాగా ప్రవహించి, వడ్లు దంచేడి ఆడవాళ్లకు కండపుష్టి కలుగుతుంది. వాళ్లకు పుట్టిన బిడ్డలకు పిండపుష్టి కలుగుతుంది. బియ్యంఫ్యాక్టరీలోని కూలీలకు ఆ కాయకష్టంలేదు. మిల్లులలో తయారైన తెల్లని బియ్యంలో సారంలేదు. దంపుడు బియ్యంలో ఉన్నది దార్ఢ్యం - మిల్లు బియ్యంవల్ల ఒళ్లుగుల్ల - జొన్నన్నం తిన్నకాలంలో మినపపిండి ఉండలను మిఠాయిలాగున ఫలహారంచేశారు. వరి అన్నం సరిగా జీర్ణంకాని స్థితిలో బిస్కట్లు తిని హార్లిక్సు త్రాగుతున్నారు. డబ్బాలతో బిస్కట్లు, డబ్బాలతో పాలు అబ్బాయిలకిచ్చి, సీసాలతో అరఖులుపోసి, సూదులతో మందులెక్కించి, ప్రకృతితో సంబంధంలేని కృత్రిమ సంతానాన్ని యీ యంత్రప్రపంచం ప్రశస్తమైన ప్లాస్టిక్కుబొమ్మలలాగున తయారుచేస్తోంది.

(55 వ పేజీ చూడండి)

ఒకనికి పార్లమెంటు మెంబరువల్ల పనికావలసి ఉంటుంది. అతను తనమిత్రుని అడుగుతాడు.

"నాకు పార్లమెంటులో ఒక మెంబరుతో పనిఉంది. ఎలాగ?"

"పార్లమెంటు మెంబరు దగ్గరనుంచి ప్రధానమంత్రి దాకా నేను ఎరుగుదును"

"అట్లాగా! అయితే ఇన్నాళ్లదాకా చెప్పలేదేం?

"నేను వాళ్లను ఎరుగుదును గాని, వాళ్లు నన్ను ఎరగరు"

శ్రీనివాసుల లక్ష్మణాచార్యులు,
వేజండ్ల.

దసరా సంచిక

పిల్లలకు ప్రత్యేకాకర్షణ

కథలు, గేయాలు, చిత్రాల రచనలో పోటీ

రాబోయే 'విజయదశమి' పండుగకు (1953 అక్టోబరు 17 వ తేదీ) ఆంధ్రపత్రిక సచిత్ర వార పత్రిక పిల్లల ప్రత్యేక సంచికగా వెలువడుతుందని పాఠకులకు తెలుపడానికి ఆనందిస్తున్నాము. బాల బాలికలకు ఉల్లాసం, విజ్ఞానం కలిగించే చక్కని కథలు, గేయాలు, వ్యాసాలు, బొమ్మలతో పత్రిక ఆకర్షణీయంగా తయారవుతుంది.

బాల బాలికల రచనాశక్తిని, చిత్రలేఖనాశక్తిని ప్రోత్సహించడానికి గాను పోటీ పెడు తున్నాము. ఈ పోటీలో ఒక మంచికథకు, ఒక మంచిపాటకు, ఒక మంచిబొమ్మకు బహుమతు లివ్వబడతాయి.

ఈ సందర్భంలో రచనలు, చిత్రాలు పంపదలిచేవారు ఈక్రింది అంశాలను గుర్తుంచుకోవాలి.

* పదిహేనేళ్లలోపు బాల బాలికలు మాత్రమే ఈపోటీలో పాల్గొనవచ్చును.
* కథలు, గేయాలు, బొమ్మలు స్వతంత్రమైనవై ఉండాలి.
* కథలు గేయాలు కాగితానికి ఒకేప్రక్క సిరాతో స్పష్టంగా వ్రాయాలి.

* బొమ్మలు రంగులలో కాని, రంగుకాగితం పైనకాని పెన్సిల్, సిరాలతో వ్రాసినవిగాని పనికిరావు. ఇండియన్ ఇంక్‌తో మాత్రమే వ్రాసిపంపాలి.

* రచనలు, బొమ్మలు 1953 సెప్టెంబరు 15 వ తేదీలోగా మాకు చేరేవిధంగా పంపాలి.
* రచయితలు చిత్రకారులు తమ పూర్తిపేరు (ఇంటిపేరు కూడా) వయస్సు, చిరునామా అన్నీ వివరంగా రచనలూ చిత్రాలతో పాటు వ్రాసి పంపాలి.

* స్వీకరించబడని రచనల్ని బొమ్మల్ని తిప్పి పంపాలని కోరేవారు చాలినంత స్టాంపుకూడా చేర్చి పంపాలి.

* కవర్లపైనా లేక రేపర్లపైనా "ఆంధ్రపత్రిక సచిత్ర వారపత్రిక దసరా పోటీకోసం" అని స్పష్టంగా వ్రాసినవి మాత్రమే పోటీకి స్వీకరించబడతాయి.

ముఖచిత్రం: ముఖచిత్రానికి అవసరమైన రంగులబొమ్మలు కూడా స్వీకరించబడతాయి. వీనిని కూడా పదిహేనేళ్లలోపు బాల బాలికలే పైనియమాలకు లోబడి పంపాలి. కవరుపేజీకి స్వీకరించబడే చిత్రానికి ప్రత్యేక పారితోషికం ఇవ్వబడుతుంది. ఈచిత్రాన్ని మాత్రం ఆగస్టు 15 వ తేదీలోగా పంపాలి.

పరిత్యాగం

శ్రీమతి టి. సావిత్రి

సావిత్రి చాల చురుకైన పిల్ల. తల్లి దండ్రులంటే చాల అభిమానం. అందులో తల్లంటే అంతులేని ఆదరణ. చామనచాయ. అంత రూపసి కాదు. వయసు వచ్చినకొలది బాగ తేలింది. ఎక్కువగా చదువుకోలేదు. తెనుగు వ్రాయ, చదువ కలదు. చాందస కుటుంబంలో పుట్టింది. నవీన యువతు లందరివలె సరదాగా ఉండాలని కోరిక. కాని యెలా సాగుతుంది? సినీమా లన్నా, సినీమా పాట లన్నా యెక్కువ సరదా.

సావిత్రికి 8 వ యేటనే దగ్గర సంబంధంలో ఇచ్చి తల్లిదండ్రులు వివాహంచేసి వారి బాధ్యత తీర్చుకున్నారు. సావిత్రికి వివాహం బాధ్యతేం తెలుసు! పెళ్ళంటే పల్లకీలో ఊరేగడం, తలంబ్రాలు పోసుకోడం, పూలబంతు లాడటం, సొమ్ములు పెట్టుకోడం, కొత్తగుడ్డలు కట్టుకోడం అనే భావం. అవి శారదా బిల్లురోజు లవడంచేత పాపం సావిత్రికి ఆ మోజు కూడ తీరింది కాదు. అయిన సంబంధం కాబట్టి పిల్లవాడికి కట్నం లేదు, పిల్లకు సొమ్ము లేదు. ఎలాగో పెళ్ళి అయిపోయిం దనిపించుకోడంతో సరిపోయింది.

ఊహ తెలిసినదగ్గరనుంచి తన భర్త చదువుకున్నవాడైతే బాగుండు, నవనాగరీకుడైతే బాగుండు అని సావిత్రి కలలు కంటం మొదలిడింది. కాని సావిత్రి భర్త వెంకట్రావుకు చదువుసంధ్య లబ్బలేదు. రోతగా ఉంటంచేత అతని ఉనికి సావిత్రి మనసును ఆకర్షించ లేకపోయింది. పైగా సావిత్రి బస్తీ పడుచు.

కొన్నాళ్ళకు సావిత్రికి కార్యం చేశారు. ఆ మూడు రాత్రులు యెలా గడుస్తాయా అన్నట్లు భార్యాభర్తలు గడిపారు. దొంగలాగ యెలాగో బయటపడ్డాను భగవంతుడా అని వెంకట్రావు నాలుగో రోజున తన వూరు వెళ్ళాడు. ఆనాటి నుంచి సావిత్రికి జీవితంమీద విరక్తి కలిగింది. ఒంటరిగా విచారిస్తూ, తనను తాను నిందించుకుంటూ, బ్రతికి యేమి లాభమని అప్పుడప్పుడు విరక్తిని బయటికి వెళ్ళ గ్రక్కుతూ మాట్లాడుతుండేది. కాని ఈమె గొడవ ఎవరికి పడుతుంది!

రోజులు, నెలలూ, సంవత్సరాలు గడుస్తున్నాయి. వెంకట్రావు మామగారింటికి రాడు, సావిత్రి అత్తగారింటికిపోదు. ఒకవేళ వెంకట్రావువచ్చినా అటొచ్చి ఇటు పోవడమేగాని పట్టుమని ఒక్కరోజన్నా వుండడం లేదు.

సావిత్రి యెప్పుడన్నా పేరంటానికిగాని, సినీమాకుగాని వెళ్లుతుంటే అమ్మలక్కలంతా చేరి "చూశావుటే! ఇది అత్తగారింటికి వెళ్ళదా యేమిటి," అని "మొగుడు గిట్టడా యేమిటే!" అనిఇంకా యేమేమో అంటుండేవాళ్లు. ఆ మాటలు విన్నప్పుడల్లా సావిత్రి చాల బాధపడటమేగాక వెంటనే ఇంట్లోకివెళ్లి వొంటరిగా యేడుస్తుండేది. ఒకొక్కప్పుడు "పాడు ప్రపంచం కష్టంలో సహాయం చాతగాకపోయినా రాళ్ళు వెయ్యడంలో మాత్రం ముందంజవేస్తుంది" అని అనుకునేది.

సావిత్రికి వేలు విడిచిన మేనమామ కొడుకు సుందరరావు. అతను తరుచుగా వీళ్లింటికి వస్తుండేవాడు. బి. యె ప్యాసయి యేదో కంపెనీలో నౌకరి. మంచి తెలివితేటలు, పలుకుబడి, కలవాడు. జాలిగుండె. యెవరికైనా కష్టాల్లో తన చేతనైనంతగా అడ్డుపడుతుండేవాడు. సావిత్రి కుటుంబానికికూడ మంచి చెడ్డల్లో ఆదుకుంటుండేవాడు. అందుచేత వాళ్ళందరికి ఇతనంటే ఎక్కువ అభిమానం. వాళ్ళింటికి సుందరరావు వచ్చినప్పుడల్లా సావిత్రి నవ్వుముఖంతో కొంటెప్రశ్నలు వేసి ఎగతాళి పట్టిస్తుండేది.

సుందరరావు సావిత్రి ముఖంలో అనేకసార్లు విచారం, నిస్పృహా గ్రహించాడు. దీనికి కారణం యేమై యుంటుందా, తాను చేసే సహాయం ఉందా అని ఆలోచనలో పడ్డాడు. కాని తెలుసుకోడం యెలా? అడుగుదాం: "అంతరంగిక విషయాలు అడగటమెలా? యెవరు చెబుతారు? అయినా సావిత్రినే అడిగితే యేం? ఆమెను యేమని అడగాలి? అడిగితేమాత్రం సాంప్రదాయ కుటుంబంలోని పిల్ల అంత సులభంగా బయటపడుతుందా? అసలు ఈ విషయం హెచ్చరించడమెలా? ఆమె యే విధంగా అర్థంచేసుకుంటుందో? "ఇంతకూ ఒంటరిగా అవకాశం దొరకాలిగా? ఇంటి నిండ బలగం దొరకడమెలా? బయట? అమ్మయ్యో! బైటే! పరాయి పిల్లతో పరాయి మగాడు రోడ్డుమీద మాట్లాడితే లోకులు నిందోపనిందలల్లి అల్లరి పాలు చేయరే? సహాయం చెయ్యలేక పోగా అల్లరి పాలు చేయడం కాదే?" అని యేమేమో ఆలోచిస్తుండేవాడు.

ఇలా కొన్ని నెలలుగడిచాయి. సుందరరావుకు భయం తీరలేదు. అవకాశమూ దొరకలేదు. ఒకరోజు సుందరరావు వాళ్లింటికి వెళ్లాడు. తండ్రిబజారుకు వెళ్ళాడు. మిగతా వాళ్లంతా గుళ్లోపురాణం వింటానికి వెళ్ళారు. సావిత్రిమాత్రం ఒంటరిగా బయట అరుగుమీద కూర్చుంది.

సుందరరావును చూడడంతోనే, లేచి 'గుడ్ నైట్ బావగారూ' యేదో దోవతప్పి వచ్చారే"అంది.

సుందరరావు "అమ్మా నాన్న వాళ్ళు ఇంట్లో లేరా?"

సావిత్రి : 'లేరు'

సుందరి : లోపలికి పోదాంపద'

సావిత్రి : "యెందుకూ?"

సుం : "అయితే మీ ఇంటి మర్యాద ఇంతేనా?. వచ్చినవాళ్లను రోడ్డుమీద నిలవబెట్టి మాట్లాడటమా ?

సావి : "లేదులే బావా, లోపలికి రా" ఇద్దరులోనికి వెళ్ళారు.

సావిత్రి : "కూర్చిలో కూర్చో బావా"

సుందరరావు పడకకుర్చీలో కూర్చున్నాడు. సావిత్రి కొంచెం దూరంగా గడపమీద కూర్చుంది.

సుం : "సావిత్రీ యేం సంగతులు?"

సావి : "యేమున్నాయి. అన్నీ అనుభవం గలవాడివి నీవే చెప్పాలి."

సుం : "సావిత్రీ యెప్పుడూ యేదో విచారంగా వుంటావు?"

సావి : "యేదో సినీమాలో అన్నట్లు యెలా చావడమా అని."

సుం : "యెందుకమ్మా అంత విరక్తి?"

సావి: "బ్రతికి ఎవరిని ఉద్ధరించడం?"

అంటూ సుందరరావువంక దీనాలాపంగా చూచింది.

సుందరరావు ఆమెవంక చూచాడు. ఆమె మనస్సులో భరించరాని సంఘటన యెంత వుందో అనుకున్నాడు. అతనికి అంతులేని జాలి కలిగింది.

ఇంతలో తల్లిదండ్రులు ఇంట్లోకి వచ్చారు. సుందరరావు యేవో కబుర్లు చెప్పి మళ్ళీ వస్తానని వెళ్ళిపోయినాడు. అప్పటి నుంచీ సుందరరావుకు ఆమె మనస్సు యేమిటో కనుక్కోవాలని పట్టుదల ఎక్కువైయింది. అనేక వూహలు పన్నాడు. ఒక్కటీ సాగేలాగున కనబడలే. అనేక విధాల మధనపడ్డాడు. పాలుపోలే. తల్లిదండ్రులను అడుగుదామా అనుకున్నాడు. "వాళ్ళంత వాళ్ళు చెబితే సరిపోయింది గాని అడిగితే అది యేం అనుమానానికి కారణమౌతుందో!"

సుందరరావు వెళ్ళిందగ్గరనుంచి అతని మీద ఒక విన్నమైన అనురాగం యేర్పడింది తనలో. "సుందరరావు చాల మంచివాడే. అందరికి ఉపకారే! నాకేమన్న సాయపడతాడా? అయినా ఇందులో నాకాయన చేసే సాయ మేముంది? నా కర్మానికి ఆయన యేం చేస్తాడు? నేను ఇలా చావవలసిందే గాని బ్రహ్మదేముడు కూడ సాయం చేయలేడు. దేముడు - పాడు దేవుడు - అసలున్నాడా? ఉంటే నా జీవితంలో సంతోషం మొలకెత్తించమనూ చూదాం?—ఆయన చేతగాడుగదా, ఆయన తాత తరం గాదు—వట్టి దద్దమ్మ. యెవరికోసం నేను జీవించడం? సుఖం సంతోషం లేని జీవనంవల్ల ప్రయోజనం? జంతువులు బ్రతకండల్లే! - చెట్లు పెరగడంలే-! వాటికి నాకు భేదం!" అనుకుని చింతించింది.

ఇంతలో తల్లివచ్చి 'యేమే ఇంట్లో నీళ్లచుక్క లేకపోతే అలా మొద్దులాగ కూర్చున్నావు! అంది. వెంటనే లేచి వెళ్లి ఇంట్లోకి పట్టెడ నీళ్ళుతోడి కుమ్మరించింది.

"అన్నానికి రావే" అందితల్లి.

"ఆకలిలేదమ్మా" అంది సావిత్రి.

"అదేమిటే? రాత్రికూడ తినలేదు. ఇప్పుడు వొంటిగంటయింది ఇంకా ఆకలి లేదంటావు? కొద్దిగా తిందు గానిలే" అంది తల్లి. 'తరవాత తింటానులే"అంది సావిత్రి.

మర్నాడు సుందరావు వచ్చాడు. ఒకరి వంక వకరు చూచుకున్నారు. ఒకరి నొకరు పలకరిస్తే బాగుండు ననుకున్నారు. ప్రతి రోజుసుందరరావువస్తే బాగుండునని సావిత్రి



"అదేమిటి బావా? నిన్న ఆదివారం, ? ఇవ్వాళా ఆదివారం— రేపూ ఆదివారమేనా? మరి పనిచెయ్యడం లేదా?

అనుకుంది. కొంచెంసేపుండి సుందరరావు వెళ్ళాడు. తనకు ప్రతిరోజు సావిత్రి కనబడుతుంటే బాగుండునని సుందరరావు అనుకున్నాడు. కొన్నాళ్ళకు సావిత్రి తల్లి యేదో వూరు వెళ్ళింది. తండ్రికి వండిపెట్టటానికి ఇంట్లో వదిలివెళ్ళారు. ఆ సంగతి సుందరరావు కనిపెట్టాడు. సంపాదనకై ప్రతిరోజు తండ్రి వూళ్ళోకి వెళ్ళేవాడు. ఆ సమయం చూచి సుందరరావు వాళ్ళింటికెళ్లి కొంచెంసేపుండి అటునుండి ఆఫీసుకు వెళ్ళేవాడు. రెండుమూడురోజులు గడిచాక అతనికి కొంచెం ధైర్యంవచ్చింది. గట్టిగా అడిగి తెలుసుకుందా మనుకున్నాడు, ఒకరోజు.

సు : "సావిత్రీ నన్ను అపార్థం చేసుకోనంటే ఒక సంగతి అడగనా?

సా : 'అడుగు బావా'

సుం : "అడగమంటావా? దాపరికం లేకుండా సమాధానం చెప్పాలి సుమా?"

సా : "అసలు అడగండే"

సు : "నీ విచారానికి కారణం"?

సావిత్రికి దుఃఖంపొంగి పొరలింది. తట్టుకొని రాని నవ్వు తెప్పించుకొని.

"బస్ - ఇంతేనా ?-ఒక సంగతడగనా ?

సు : "సరే అడుగు."

సా : "నీవు మనుచరిత్ర చదివావా?"

సు : "ఆ"

సా : "వరూధిని భర్తే ప్రవరాఖ్యుడనుకో. ఆమె జీవిత మెలా గడవాలి?"

సు : "మంచి సమస్యే తెచ్చిపెట్టావు. వెంటనే చెప్పలేను."

★ పరిత్యక్త ★

సావి :"చూడు బావా-వోడిపొయ్యావు. పెద్దసంఘసంస్కర్త నంటావే? ఇంతేనా!"

సు : "నీవు చెప్పు."

సా : "చెప్పనా! సంఘంలో వరూధిని వెంటనే మంద్లో మాకో పుచ్చుకొని వచ్చి పోవాలి."

సుందరరావు చిన్నబుచ్చుకొని ఆఫీసు టయం అయిందని వెళ్ళిపొయ్యాడు. ఆఫీసులో కూడ ఇదే ఆలోచన. "ఈ ప్రస్తావన యెందుకు తెచ్చింది. తన బ్రతుకు అంతేనని అర్థమా" అని విచారపడ్డాడు. బల్లమీద వున్న కాగితాలు అలాగే వున్నాయి. మేనేజరు వచ్చి చీవాట్లు పెట్టాడు. జ్వరంగా ఉందని శలవు పెట్టి ఇంటికి వెళ్ళాడు.

యధాప్రకారంగా మర్నాడు సావిత్రి కోసం వెళ్ళాడు. సావిత్రి యెదురొచ్చి 'ప్రశ్నకు సమాధానం బావా' అంది.

విచారంతో తిరిగి తలవంచుకున్నాడు. సావిత్రి - "ఇదేమిటి బావా - చెప్పకపోతే పోనీలే! నిన్ను మళ్ళీ అడగనులే" అంది. సుందరరావుకు తన సంగతి అర్థమైనట్టుగా గ్రహించింది. "పాపం ఆయన మాత్రం యేం చేస్తాడు" అనుకుంది.

కొన్నాళ్ళకు తల్లీవాళ్ళు తిరిగివచ్చారు. సావిత్రిని రోజు చూడంది వుండలేని స్థితికి వచ్చాడు సుందరరావు. కాని ఇప్పుడు వెళ్ళడ మెలా? ఆమె ఆ స్థితిలోనే వుంది. సహజంగా ఆడవాళు బయటపడరు గనక లోనసే కుములుతుంది.

రెండుమూడు రోజులు సుందరరావు కనపడలేదు. గవ్వ లాడుకుంటానని చెప్పి సావిత్రి వాళ్ళింటికి వెళ్ళింది.

ఆనాడు ఆదివారం. సుందరరావు ఇంట్లోనే వున్నాడు. సావిత్రిని చూచేటప్పటికి సుందరరావుకు ప్రాణం లేచివచ్చింది. కాని ఇంటినిండా బలగం. యెలా మాట్లాడటం. ఆ రోజు వీలుపడలే. మర్నాడు సుందరరావు తల్లిని, చెల్లెలునూ వూరికి పంపాడు. ఆ సంగతి తెలియక సావిత్రి వాళ్ళింటికి వచ్చింది. తలుపులు దగ్గరవేసి వున్నాయి. 'అత్తా' అని కేకవేసింది. పలకలేదు.

సుందరరావువచ్చి తలుపు తీశాడు.

"అత్తా వాళ్ళేరిబావా?" అంది సావిత్రి.

"వస్తారులే లోపలికిరా అన్నాడు" సుందరరావు.

సావి : "ఆఫీసుకు పోలేదేం బావా?"

సుం : "ఆదివారం కదూ"

సావి : "అదేమిటిబావా! నిన్నా ఆదివారం, ఇవ్వాళ ఆదివారం - రేపూ ఆదివారమేనా? మరి పనిచెయ్యడంలేదా?"

సు : "అంతే" "క్యాలండరు ప్రకారం నిన్న ఆదివారం నీవు వచ్చావు గనక ఇవ్వాళ్ళ ఆదివారం, రేపు వస్తావంటే రేపూ ఆదివారమే"

సా : ఇలా అయితే ఉద్యోగం ఉంటుందా బావా?"

సు : "పోనీ సావిత్రీ. అదేమిటో-నిన్ను చూడటం - నీతో మాట్లాడటం - నవ్వించటం - నవ్వటం - ఇవే నాకు మహానందం, నీతో గడిపే కొద్ది క్షణాలే నా జీవితంలో ఆనందఘటాలు.

సా : నేను నీతులు చెబుతున్నానను కోనంటే ఒక సంగతి చెప్పనా.

సు : చెప్పు.

సా : ఉంపని పంక్తకొని స్తున్నావేమో?

సు : అబ్బే - అదేం లేదు - నమ్ము నామాట. నిన్ను చూచిం దగ్గరనుంచి - ఈ జీవికి ఆశ ఎలా మొలకెత్తించడమా, అందుకు నేనెలా ఉపకరిస్తానా అనే ఆలోచన తప్ప వేరే యేంలేదు.

సా : యెందుకంత శ్రమనీకు. ఇదివరకే చెప్పానుగా బ్రహ్మతిరంగూడ

కాదని - అయినా - నామీద నీకెందు కింత ?

సు : అదేమో చెప్పలేను - అలా అయి పోయింది.

సా : ఎవరిపిచ్చివారి కోసందం, చాల ఆలస్యమైంది వెళ్తా.

సు : మళ్లీ యెప్పుడో.

సా : యేమో ! చెప్పలేను. రేపు అత్త గారింటికి వెళ్ళాలట.

సు : "అయ్యో పాపం. ఆడదానికి స్వేచ్ఛ లేదు గదా. గొడ్డు కిచ్చి పెళ్ళి చేసినా కాపురం చెయ్యాలిసిందేగదా. లేక పోతే లోకుల నిందే గదా. కన్న తల్లిదండ్రులు కూడ ధైర్యంచేసి ఇంట్లో వుంచుకో లేరు గదా. ఈ సంఘం యెప్పుడు బాగు పడుతుందిరా బాబూ" అంటూ కుర్చీలో వాలాడు.

మర్నాడు కళ్ళనీళ్ళు కళ్ళన గ్రుక్కుకుని తీసుకొనిపోవడానికి వచ్చిన వారితో సావిత్రి అత్తగారింటికి వెళ్ళింది. అక్కట తనకు సుఖం లేదని తెలుసు - నరకం అని కూడ తెలుసు - కాని వెళ్లక తప్పిందికాదు.

వెళ్ళిందగ్గరనుంచి నిమిష మొక యుగం లాగ కాలం గడుపుతూ వచ్చింది. ఉపవాసాలు యెక్కువ చెయ్యడంచేత నానాటికీ కృశించిపోసాగింది. బావతో సరసాలాడుతూ గడిపిన ఘడియలు తిరిగి తన జీవితంలో వస్తాయా అనుకుంది. ఇందులో జ్వరం పట్టుకుంది. మందుపుచ్చుకోనందున రోజురోజుకు జ్వరం యెక్కువై టైఫాయిడ్‌లోకి దించింది. తల్లితండ్రులకు తెలిసి ఇంటికి తీసుకొచ్చారు. డాక్టరు చూసి ప్రమాదమని మాచాయగా అన్నాడు. ఇవ్వాళ్ళ రేపు గడిస్తే గాని చెప్పలేనన్నాడు.

సావిత్రికి తను బ్రతకనని అనుకుంది. అదే మంచిదని కూడ సంతోషించింది. బావకు తెలియదేమో - తెలిస్తే వచ్చేవాడే అనుకుంది.

అప్పుడే సుందరావు గదిలోకి వచ్చాడు. ఆఖ్యావస్థలో ఉన్న సావిత్రిని చూడగానే గుండె బ్రద్దలయింది. కాని యేం చేస్తాడు. పొర్లివచ్చే దుఃఖాన్ని అపుకున్నాడు. ఆసుపత్రికి తీసుకొని వెళ్లకూడదా అన్నాడు. వద్దని డాక్టరు సలహా అన్నారు. సావిత్రి సుందరరావువంక చూచింది. అతని అవస్థ గ్రహించింది. కంఠచూపులతో తన హృదయాన్ని ప్రకటించింది. అటూ, ఇటూ చూచింది. యెవరు లేరు. రహస్యంగా - "బావా!" అని సంబోధించింది. సుందరరావు దగ్గిరికి వచ్చాడు.

"నేను చెప్ప లేదే! బ్రహ్మదేవుని చేత కూడా కాదని! వచ్చే జన్మలో కలుద్దాం - విచారపడకు" అంది.

"అమ్మా - నాన్నా" అని పిలిచింది.

ఇంట్లోనుంచి వారిద్దరూ పరుగెత్తివచ్చి మంచం అనుకొని కూర్చున్నారు.

సావిత్రి : "ఒక రహస్యం. నా బ్రతుకు తెలిపోనుంది, కొద్ది క్షణాలలో. చెల్లికి మాత్రం దానికి నచ్చినవాని కిచ్చి పెండ్లి చేసి సుఖపడేటట్టు చూడండి."

ఇంతలో అత్తగారు వచ్చింది. "అత్తయ్యా ఒక మాట" అంది. అమ్మా నాన్న అవతలికి వెళ్లారు. అత్తగారొచ్చి మంచంమీద కూర్చుని "యేమమ్మా" అంది.

సావి : "యేమీలే దత్తయ్యా - నేను పోతున్నాను. నా జీవితమంతా వృధా అయింది. తిరిగి మీ అబ్బాయికి పెళ్లి చేసి ఇంకో జీవి వుసురుపోసుకోకండమ్మా" అని కళ్ళు మూసింది. ఇల్లంతా గొల్లుమన్నారు. ★

పెన్షన్

పోస్టుమాస్టర్ రామయ్యకు ఆ సాయంత్రమే పాపం ఉద్యోగ విరామ పత్రము చేతికిచ్చారు. అతను నివ్వెరపోయి నుంచున్నాడు. “రేపటినుంచి నీవు ఆఫీసుకు రానవసరం లేదయ్యా” అన్నాడు పోస్టుమాస్టరు. రామయ్యకు 55 ఏండ్లు నిండాయి. అంచేత రిటైర్ అయ్యాడన్న మాట.

ఉద్యోగంనుంచి రిటైర్ అయ్యాడేగాని గృహ యాజమాన్యమునుంచిమట్టుకు రిటైర్ కాలేదు. పెండ్లి చెయ్యాల్సిన ఎదిగిన ఆడపిల్లలు యిద్దరు ఇంట్లో వున్నారు. మగపిల్లలు అంతకంటే చిన్నవాండ్లు, స్కూల్లో చదువుతున్నారు. కనీసం వుప్పూ, కారంతోనైనా పూటకుపూట జరిగిపోవాలి.

రామయ్య నివ్వెరపోడానికి కారణం ఉంది. అదివరకు ప్రభుత్వం 60 ఏండ్లవరకు సర్వీసు పొడిగిస్తుందని వార్తా పత్రికల్లో చూస్తూ వుండేవాడు. తనకు కూడా అయిదేళ్లు ఇంకా సర్వీస్ ఉంటుందని ఆశపడ్డాడు. కాని ఈ పత్రం చూసేసరికి గుండెల్లో రాయిపడ్డట్టయింది రామయ్యకు. గుడ్డిలో మెల్ల అన్నట్టు ఆరోజు ఒకటో తేదీ అయినందున జీతంకూడా చేతికిచ్చారు.

కానీ ఏం ప్రయోజనం? అంతకుముందు నెల పొడుగునా ఇంటి వెచ్చాలకు చేసిన బాకీలకు అప్పడు తీసుకొన్న పైకంలో మూడువంతులు అదృశ్యమయింది. ఇక మీదటకూడా ఖర్చులేమో మామూలే. కాని జీతం సన్నగిల్లింది. ఇంకేమి చేస్తాడు?

ఇంటికెళ్ళి భోజనాలైన తరువాత చావుకబురు చల్లగా భార్య చెవిలో వేశాడు ఈ మాట. ఆడవాండ్లనోట్లో మాట దాగుతుందా? కొంగున నిప్పు దాచినట్లే! వూరంతా పాకిపోయింది. పాత బాకీలవాళ్లు లేచివచ్చారు, తుఫానంతా వీండ్ల యింటి మీదకే వచ్చిపడ్డట్టు. వాళ్లు ఆసరాలకూ, వాయిదాలకూ చెవి వొగ్గుతారా? ఆ మిగిలింది కూడా క్షణంలో నిండుకొంది.

రామయ్య పట్నంలో వుండటం సబబు కాదని, మకాం పల్లెటూరికి మార్చదామనుకొన్నాడు. అక్కడైతే అనవసరమైన యింటి అద్దె, యింకా ఎన్నో ఖర్చులు తగ్గుతాయని, తిన్నా తినకపోయినా ఎవ్వరూ అడిగేవాండ్లు, హేళన చేసేవాళ్లు వుండరని అనుకున్నాడు. కాని పిల్లల చదువుల విషయం జ్ఞాపకం వచ్చింది.

రామయ్య ఆ రాత్రి సరిగా భోజనం చెయ్యనూ లేదు; నిద్రా లేదు. ఇంతలో తనకు వుద్యోగ నిర్వహణలోని పూర్వ స్మృతులు ఒకటివెంట ఒకటి జ్ఞాపకం వచ్చాయి. తను ఎంతమంది జవరాండ్ర భర్తల చావుజాబులు, టెలిగ్రాములు తన చేతులతో అందించి ఎన్ని యిండ్లలో దుఃఖశోకాలకు నాంది పలికాడో! నఫరు యింట్లో వుండగా ఒకసారి, ఏదో రెండు, మూడు రూపాయలకు ఆశపడి, నఫరు హాజరు లేదని రిజిష్టరు నోటీసులను జారీ చేయకుండా తిరిగి పంపివేశాడు.

శ్రీ సి. వి. సుబ్బారావు

ఒకరోజున తన పేటపక్కనే జరిగిన విచిత్ర సంఘటన జ్ఞాపకం వచ్చింది రామయ్యకి. ఆ 64 నెంబరు యింటి యజమాని బంగారువ్యాపారం చేసేవాడు. చాలకాలం వరకు అతనికి పిల్లలు లేరు. పొద్దస్తమానం షాపులోనే కూరుచునేవాడు. లాభం వస్తుంటే భోజనం చేసింది చేయందీ కూడా మర్చిపోయి అలాగే కూర్చొని వుండిపోతారు వ్యాపారస్థులు! భార్యమీద ఏదో అనుమానం. అంచేత రోజూ రాత్రి యింటికి రాగానే కీచులాడుకోటం పరిపాటి అయిపోయింది వాళ్లకు. మళ్లీ తెల్లారి లేవడం, దినచర్యలకు వుపక్రమించడం. ఇలా జరుగుతూ వుండేది. ఒకరోజు ఆయన యింటికి వచ్చేసరికి ఆవిడ ఎవరో భర్తకు తెలియని వ్యక్తితో మాట్లాడుతూ వుంది. తను వచ్చినా ప్రసంగం విరమించలేదు. ఆ కొత్త వ్యక్తి ఆయనను యింతకు ముందు చూచి వుండలేదు. కనుక ఆయన్ని చూచి ముఖవైఖరి అదోలా మార్చాడు. యింక చెప్పాలా? అనుమానపు పిశాచము బాగా తలకు ఎక్కిపోయింది. ఆవిణ్ని తర్వాత అడిగాడు. “అతను మావాడే. మావూరి వేరయ్య బాబాయిగారి వీరభద్రరావు” అని చెప్పింది. కానీ అతను నమ్మలా.

తన భార్య నిజంగా తన్ను ప్రేమిస్తుందా లేదా అని పరీక్ష చేయదల్చుకున్నాడు. “వ్యాపారంమీద బొంబాయి వెడుతున్నాను. నాలుగైదు రోజులవరకు రాను. ఇల్లు జాగ్రత్త” అని చెప్పి తెల్లారుఝామునే బయల్దేరి వెళ్ళాడు. వెళ్ళిన మూడవనాడే టెలిగ్రాము వచ్చింది భార్యకు. ఎవరో అతని స్నేహితుడు ఇచ్చినట్టుంది “నారాయణరావు ఈరోజు 3 గంటలకు స్వర్గస్థుడయ్యాడు” అని మాత్రమే వుంది అందులో. అడ్రసూ, ఎక్కడపోయిందీ తెలుపలేదు.

ఆ టెలిగ్రాముగూడా రామయ్యే మోసుకపోయి ఆమెకు ఇచ్చాడు. ఇంక చెప్పాలా. ఒకటే కాకిగోల. చుట్టుపక్కలవారు చేరుకున్నారు. కావలసిన కర్మకాండంతా జరిగిపోయింది. వితంతువుకు జుట్టు తీసివేసే ప్రశ్న వచ్చింది. పిల్లతరపువారు, “అట్టే దాని కెన్నేళ్ళున్నాయి, ఈరోజుల్లో పెద్ద పెద్దవాండ్లే జుట్టు వుంచుకొంటున్నారన్నా”రు. కొందరు “తప్పకుండా తీయాల్సిందే తలమీద నీడే పోయాక జుట్టువుండి వుద్ధరిస్తుందా?” అన్నారు. భార్య రుద్ధకంఠంతో “వారు లేకపోయాక ఈ జుట్టు ఎందుకు?” అని ముండనం చేయించుకొంది.

అప్పటికి సరిగా 15 రోజులైంది. ఇంతలో అయ్యగారు యింటికి వచ్చారు. తలుపు వేసివుంది. “ఓహోయ్, ఒసే, సుభా” అని పిలిచాడు. జవాబు లేదు. నాల్గోసారి ఎవరో తలుపు తీశారు.

నారాయణను చూసేసరికి ఇంట్లో అందరికీ భయము, విస్మయము కలిగాయి. అతనివంక చూడ్డమే కాని ఎవరికీ నోట మాట పెగల్లేదు. “ఏమిటిది? ఎందుకిలా విస్తుబోయి చూస్తారు? మా ఆవిడ యింట్లో లేదా?” అంటూ లోపలికి సరాసరి వెళ్లిపోయాడు. అంతవరకు ఆవిడ వినిపించుకోలేదు. అతన్ని చూసేసరికి ఆమెకు ఒక్కసారి గుండె ఆగినట్లయింది. తన కండ్లను తానే నమ్మలేక పోయింది. చెవులు పనిచేయక [illegible]రాలై పోయింది. ఏమిటే యీ వేషం “పొరపాటు. కల్లిపోతివి. తిరుపతి వెళ్ళొచ్చావా!” అన్నాడు తమాషాగా. సరే గాబరానుండి బయటపడి అందరూ జరిగిన విషయం, చెప్పారు. వద్దనేకొద్దీ గారు,

పోయాక నాకు ప్రపంచంతో ఏంపని అని ఆవిడే ముండనం చేయించుకుందని చెప్పారు.

రామయ్యకిలా ఎన్నెన్నో జ్ఞప్తికి వచ్చాయి. క్రమంగా కొంతసేపటికి కొంచెం కునుకుపట్టింది. నిద్రలోకూడా ఈ విషయాలే. తాను దారా పుత్రాదులను వదిలి చనిపోయినట్లు, దూతలు తన యాతనా శరీరాన్ని యముడిముందు వుంచినట్లు కలవచ్చింది.

*   *   *

యముడు: ఎవరు వీడు?

దూతలు: పోష్టుమాష్ట రామయ్య ప్రభూ.

చిత్రగుప్తుడు రామయ్య చేసిన పాపాల ఖాతా పుస్తకము యముడికి అందించాడు.

యముడు: ఏం రామయ్యా? నీ పేరు మంచిదే. కాని నీవు చెడ్డపాపాలు చేశావు.

రామయ్య: చిత్తం ప్రభూ! నేను ఏ పాపమూ చేయలేదే! కానీ మనియార్డరు జారీ చేసేప్పుడుమట్టుకు, వంద రూపాయల మనియార్డరైనా సరే తొమ్మిది పది రూపాయల కాగితాలు, తొమ్మిది రూపాయి కాగితాలు యిచ్చి ఒక రూపాయి చిల్లర యిచ్చేవాడ్నండి.

యముడు: అలా ఎందుకు చేసేవాడివి? నూరు రూపాయలనోటు, లేకుంటే పది రూపాయల కాగితాలు గాని ఎందుకు యివ్వకూడదూ?

రామయ్య: చిత్తం ప్రభూ. ఏదైనా ఒక పావలాడబ్బులు గిట్టుతవని.

యముడు: ఛీ! యిది రాజద్రోహం కాదూ? జీతం తీసుకొంటూ పైగా మనియార్డరుకు పావలా, అర్ధరూపాయి కాజేస్తావా?

రామయ్య: కాదు స్వామీ. జీతం పట్టుకెళ్లి ప్రతినెలా మొదటి తేదీ మా ఆవిడ దోసిట్లో పోసేవాడ్ని. అదిమట్టుకు ఏం చేస్తుంది? కాపురం నెట్టాలిగా. అందులో నా చేతికి మళ్ళీ కానీ వచ్చేది కాదు. అంచేత ఎప్పుడైనా కాఫీకి, బీడీలకు ఈరూపకంగా సంపాదించుకొనేవాడ్ని.

యముడు: ఆ వెధవ బీడీలు, కాఫీనీళ్లు మాని వుండలేవా!

రామయ్య: అసాధ్యమేనండీ! పొద్దుటి నుంచి చూస్తున్నాను. బీడీ పిచ్చి బాగా వుంది. ఇక్కడెక్కడా బీడీకొట్లు కనిపించటం లేదు.

యముడు: మేమంతా పొగ తాగుతున్నామా? నోరుముయ్యి.

రామయ్య: ఇక్కడవరకూ ఇంకా బీడీ, చుట్టా, సిగరెట్టుషాపులు పాకినట్టు లేదు ప్రభూ! మహా పిచ్చి అలవాటు. అవి మరిగితే బ్రహ్మకూడా మానలేడు.



"చావుకబురు చల్లగా భార్యచెవిని వేశాడు."

యముడు: నీవు 2-7-41 తేదీ మూడు రూపాయలు లంచము తీసుకొని, బసవయ్య యింట్లో వున్నాగూడా భరణపుదావా నోటీసు జారీ చేయలేదు గదూ?

రామయ్య: అట్లాంటి పద్దు లేకుంటే మేమింక అడుక్కు తినాల్సిందే. ఒక్క చాక్కాగుడ్డకు బుద్ధి గడ్డితిన్నది.

యముడు: గవర్నమెంటు మీకు దుస్తులు యిస్తుంది కాదూ?


రామయ్య: రెండు జతలిస్తే ఈ వేసవి కాలంలో పక్కవాండ్లతో మాట్లాడటానికి వీలుండదండి. అంటే పీనుగులు కుళ్లినవాసన

యముడు: నీవు విలేజి పోష్టుమాన్‌గా వుండేటప్పుడు, వుత్తరం ఏరోజు వచ్చినా, నీవు ఆవూరికి వెళ్లేరోజు, ఆ తేదీముద్ర కొట్టి మరీ వెళ్ళి యిచ్చేవాడివి కాదూ?

రామయ్య: మరేనండి. 20 పల్లెలకు ఒక్కణ్ని. రోజూ తిరగటానికి మావి తోలుపాదాలేనండి, యినుపకాళ్లు కాదు.

యముడు: (గడువు మాచి) నీకు మరణ

(54 వ పేజీ చూడండి)



ఆమె వెనుదిరిగి గోపాలాన్ని చూసి జాలిగా నవ్వింది.

కాళ్లెగరేసుకుంటూ పరుగు పరుగున వెళ్లి ఆమె సన్నపాటి ఎర్రటి వేళ్ళను పట్టుకొని నడక సాగించాడు గోపాలం.

"జోళ్లు వేసుగో రాదురా గోపీ"

గోపాలం ఆత్రంతో ఆమె కళ్ళలోనికి చూశాడు. ఎంత ఎత్తుందో! అంత ఎత్తెప్పుడౌతాడో తను! ఆవిడలాఔతే ఎంతబావుంటుంది.

"ఇలా గొడుగు నీడలోకి రా".

అతనామె దగ్గరగా జరిగి ఆమె కాళ్లకు తగుల్తూ నడక సాగించాడు. ఆమె చీర కొంగు అతని చెక్కిళ్ళకు చల్లగా తగుల్తోంది.

చాలా మంచి చీర! మెత్తగా చల్లగా హాయిగా వుంది. మంచి వాసన మల్లెపువ్వుల్లా.

క్రిందికి చూస్తున్న అతని కళ్ళు ఆమె పాదాలమీద పడ్డాయి - ఎంత చక్కని పాదాలు - తెల్లగా- ఆ గోళ్లెంత బావున్నాయి-' తను ఆడుకొనే ఆలు-చిప్పల్లా.

ఆలోచిస్తూ వెనుకపడ్డాడు - కాళ్ళు ఇసుకమీద పడి మ్రగ్గుతున్నాయి. మళ్ళీ పరుగు తీసేడు.

ఇంకోసారి ఆమె చిరునవ్వు; జాలిగా - ఎంత వేగంగా నడిచిపోతుంది - ఈ పెద్దవాళ్ళంతా ఇంతే-వాళ్ళకేం అంతంత లేసి కాళ్లు - తనకూ అలానే ఉంటే-అమ్మో! వీళ్ళందరి కంటె గబగబా తనూ నడుచును.

జారిపోతున్న లాగు ఎగదీసుకున్నాడు.

"బల్లా పుస్తకం ఇలా ఇయ్యి."

మారుమాట లేకుండా ఆమె కందించాడు చంకలో ఉన్న చట్రాం ఊడొచ్చిన బల్ల అట్టలేక నలిగిన పుస్తకాన్ని, అతడు - బస్తాకు బరువు తగ్గినట్టయింది.

ఇప్పుడు సులువుగా నడిచెయ్యవచ్చు. తన నడకెందుకో అంతబావుండదు - ఎప్పుడావిడంతా నడుద్దామనుకున్నా రాదు. ఆవిడెంత సొంపుగా నడుస్తుంది!- ఆ కాళ్ళు లెక్కపెట్టినట్టు వాచీ ముల్లుల్లా కదుల్తాయి.

రోడ్డంతా కలియజూశాడు. ఎక్కడా మనుష్య సంచారం లేదు - పొలాల్లో ఒక కోడె, ఆవూ దగ్గర దగ్గరగా నిల్చున్నాయి- ఒక అరఫర్లాంగు దూరాన చింత చెట్టు కానొచ్చింది. రోడ్డుఇసకలో అతనిపాదాలు దూరుతూ కస్సుకస్సు మని శబ్దం చేస్తున్నాయి.

ఈ ఇసకలో నడవడం చాలా సరదాగా ఉంటుంది-కాళ్లు దూరిపోతూ అప్పుడే పుట్టించిన బూరుగుదూది పరుపుమీద నడచినట్టుంటుంది. మొన్న అన్నయ్య పెళ్ళికి ఆ వూరేదో వెళ్లినప్పుడెంతబావుంది-ఆ వూళ్లో పెద్ద సముద్రం వుంది. ఆ పెద్ద ఇసకదిబ్బలు - అక్కడలా ఆడుకుంటూ ఉండిపోతే బావుండేది - కాని ఈ పెద్దవాళ్లంతా వినరో! ఏం మనుష్యులో! అన్నయ్య ఒక్కనాడూ అక్కడ ఒక్కక్షే

శ్రీ మంథా వెంకటరమణారావు

ఆడుకోనివ్వలేదు. మళ్ళా ఎప్పుడు వెళ్ళడం అక్కడికి!? పెద్దవాణ్ణయ్యాక - ఇంకా ఎప్పుడు పెద్దవడం? అమ్మో! ఈవిడంత పెద్దవడమే-ఎన్నాళ్ళవుతుందో.

అతని ముఖాన చెమట్లు పోశాయి.

కాని ఈ ఇసకలో నడుస్తూ ఉంటే అబ్బ! ఏం వేడి - పరుగెత్తి ఆమె గొడుగు నీడలోనికి వెళ్లాడతను - ఎంత వేడైనా ఈ ఎండాకాలం ఎందుకో బావుంటుంది. ఇక్కడి మామిడిచెట్లు కింకా పెద్దకాయలు లేనే లేవు-మొన్న సూరిగాడు పట్టుకొచ్చిన కాయ లెంత లేసున్నాయి! ఆ తోట వాడి కొక పాతంగాల్చి ఇచ్చేస్తే కాయలన్నీ మన వేంట! మొన్న చిన్నాన్నాయి పళ్ళు పులిసి అన్నం తినలేకపోయేడు - ఎందుకో పిల్లెవ్వళ్ళూ తనని రానివ్వరు వాళ్లతో - వాళ్ళ గొప్పేవిటో-

మెడెత్తి ఆమె ముఖాన్ని చూశాడు గోపాలం - చెమట అక్కడక్కడ పట్టినా తెల్లగా ఉందామె ముఖం - ఆమె కనురెప్పలకాటుక కొంత చెదిరింది. చిన్న గాలికి ఆమె ముంగురులెగిరి కళ్ళలో పడుతున్నాయి.

ఆమెకు దగ్గరగా నడిచి ఆమెకు తగుల్తూ నడవసాగాడతను - ఆమె తన చెయ్యి అతని బుజమ్మీద వేసింది.

ఎంత మెత్తటి చెయ్యి - ఇంత ఎండలోనూ చల్లగా కూడా-ఉంది. ఆ చేతి వేళ్లు చెక్కిళ్ళకు తగిలేందుకు మెడ ప్రక్కకు తిప్పాడతను. సున్నితంగా మల్లెపువ్వుల్లా తగిలేయవి.

చింతచెట్టు దగ్గరకొచ్చింది. పెద్దనీడ - అక్కడి కాసేపాగితే బావుణ్ణనిపించిందతనికి - రోజూ అలానే అనుదామనుకున్నా, ఆవిడతో చెప్పడానికతనికెందుకో ఇష్టం లేదు - జోళ్లెందుకు వేసుకోలేదంటుంది.

చింతచెట్టునీడలోంచి నడచి పోతున్నారిద్దరూ - అతను వేగం తగ్గించి వెనుకపడ్డాడు - ఆమె ఆగి వెనుదిరిగి ఇంకోసారి నవ్వింది - అతను ముఖం దించుకున్నాడు.

చెట్టుగాలి చల్లగా కొడుతోంది. ఎంతో హాయిగా ఉందతనికి - అక్కడ తన చిన్న మంచం వేసుగొని పడుక్కుంటే ఇట్టే నిద్ర పట్టేస్తుంది. ఈ పెద్దవాళ్లతో అన్నీ చిక్కులే. సరిగా పడుక్కోనివ్వరు. ఆడుకోనివ్వరు తిండి తిననివ్వరు ఇలానే - వాళ్లు మాత్రం ......అన్నాయి బాగా ప్రొద్దెక్కే నే కాని లేవనే లేవరు- వాడికి పొద్దున్నే తినడానికేదన్నా ఉండాలి - మధ్యాహ్నం భోజనంలోకి తప్పకుండా చేపలుండాలి - ఎన్ని చేపలున్నా వాడికి చాలవు. ఇట్టే తినేస్తాడు - ముఖాని కేవేవో మంచి మంచి వాసనవన్నీ రాసుకుంటాడు - గమ్మత్తు గమ్మత్తయిన బట్టలు - కాళ్లకి మెత్తటి జోళ్ళు - పెద్ద దొరలా తయారవుతాడు - వదినా వాడూ సినిమాకి వెళ్లిపోతారు, - తనున్నానని కూడా జ్ఞాపకం ఉండదు. సాయంత్రం ఆఘసుమంచి బాగా నేమళ్ళా తినడాని కొక్కరాలి- అబ్బ! అలా వుంటే ఎంత బావుంటుంది.

మెత్తటి చెయ్యి అతని తల నిమిరింది తలెత్తి చూశాడతను - ఆమె అతని కళ్ళలోకి సాదరంగా చూస్తోంది. తల దించుకున్నాడతను.

ఈసారి ఆమెకు మరింత దగ్గరగా వెళ్లి కూర్చుకోని నడవసాగాడు - కొంత దూరం పోయాక ఓసారి వెనక్కు తిరిగి చూశాడు - ఇంకా ఆ చింతచెట్టు దాని నీడ ఉన్నాయి - దానిగాలింకా తనకు తగుల్తోంది - వేస్తున్న ప్రతిఒక్క అడుక్కీ ఆ చెట్టూ, ఆ నీడా చిన్నవైపోతున్నాయి. స్కూలుమెట్లెక్కాక ఆమె చేతి (వేళ్ళు) వదిలాడతను - స్కూలు ఖాళీగానే ఉంది - మగా ఆడా కలిసి అయిదారుగురిలా ఉంటారు పిల్లలు.

ఆమె ననుసరిస్తూ ఆమె క్లాసుగదిలోనికి వెళ్ళి ఒక మూలకున్న బెంచీమీద కొసకు కూర్చున్నాడు - ఆమె గది వదిలి ఎక్కడికో వెళ్ళింది. ఎదురుగా ఉన్న నల్లబల్లని, ఆవిడ కూర్చుండే కుర్చీనీ దానిముందున్న టేబిలునీ చూస్తూ కూర్చున్నా డతను - పొద్దున్న కొత్త మాష్టారేసిన గుణకారం లెక్క ఆ నల్లబల్లమీద ఇంకా ఉంది - టేబులుమీద ఒక చిన్న బెత్తాం.

ఒక్కడూ అక్కడ కూర్చుంటే ఎందుకో గుండె వేగంగా కొట్టుగొంటోం దతనికి. ఏదో భయంగా కూడా అనిపిస్తోంది. గుణకారం లెక్క నింకోసారి చూశాడు. తనా లెక్క చెయ్యలేదు - అతని ముఖం ముకుళించుకుపోయింది. ఆవిడే ఆ లెక్క వేసుంటే ఎంత బావుణ్ను. ఏడుపొస్తున్న ట్టయిం దతనికి. ఏడవాలనిపిస్తోంది కూడా. ఆ కొత్త మాష్టార్ని చూస్తే ఏదోలా అనిపిస్తుంది - ఆ మాష్టారు లెక్క వేస్తూ ఉంటే అతని ప్రక్కను నిలబడి అందర్నీ చూస్తూ చిన్న నవ్వు నవ్వుతున్న ఆమెను చూసేసరికి ఎందుకో కోపం వచ్చిం దామెమీద - ఏదో పోగొట్టుకుంటున్నట్టు కూడా ఐంది.


గది నాలుగు మూలలా చూసి, పిరికిగా లేచివెళ్ళి ఆ లెక్కని పత్తువతీరా చేతులతో చెరిపి పారేసేడు. అతని ధైర్యానికి తనకే ఆశ్చర్యం వేసింది. ఒక్కరోజు కూడా కూర్చున్న బెంచీమీదనుండి లేవడానికే ధైర్యం కావలసి వచ్చేది.

వెనుకనుంచి మెత్తటి చెయ్యి బుజంమీద పడింది. ఉలిక్కిపడి వెనక్కి తిరిగాడు. ఆవిడ దగ్గరగా నిల్చొనుంది. తను చేసిన పని చూసిందేమో. చూస్తే చూడనీ. ఆవిడ తనపని చూసినందుకు తనకి సిగ్గువెయ్యలేదు.

"చూడు - ఈనీళ్లు తాగు" - గ్లాసుతో నీళ్ళందించిం దావిడ.

ఆమె కళ్ళలోకి చూశా డతను. ఆమె నవ్వుతోంది చిలిపిగా.

నీళ్లు త్రాగుతూఉంటే చీరకొంగుతో అతని నుదుటి చెమట తుడిచిం దావిడ. గ్లాసును ఆమె కందించి పోయి తన



స్థానంలో కూర్చున్నా డతడు తిరిగి - ఆమె గ్లాసు టేబిలుమీదుంచి తన కుర్చీలో కూర్చుం దాలోచిస్తూ.

తల దించుకొనికూర్చున్నాడు గోపాలం - ఆమె తనతోకూడా ఆ గదిలో ఉండడం ఎంతో ధైర్యంగా ఉంది. తలదించుకొనే సన్నగా ప్రక్కనుంచి చూశా డామెను - ఆమె అతనివేపే చూస్తోంది. ఎంతో సిగ్గు వేసింది తనకి. ముఖం ఎర్రబారింది. ఆవిడ బట్ట లెంత బావున్నాయి - తను మురిక్కిబట్ట లేసుకున్నా ఏవీ అనుకోదు - తన్ను తాకితే ఆ కొత్తబట్టలు మాసిపోతాయన్న ఇదికూడా లేదావిడకి.

బడి రెండోగంటలో పిల్లలంతా ఒక్కొక్కరే రావడం మొదలెట్టారు.

చిల్లంగి

పైన చెప్పుల చప్పుడైంది. కొత్త మాష్టారు గబగబ నడుస్తూ వచ్చారు.

అన్నాయిలాగే ఉన్నాడతనూను. కాని నొక్కునొక్కుల జుత్తూ అదీ బాగున్నాడు. అతడు రాగానే గదంతా సెంటు వాసన గుమ్మని కొట్టింది.

ఆవిడ కుర్చీనుండి లేచింది. చిన్న నవ్వు నవ్వుతూ నమస్కారంచేసి ప్రక్కకు తప్పుకుంది. అతడు ప్రతి నమస్కారం చేస్తూ అన్నాడు—

"ఎందుకు? కూర్చోండి - కూర్చోండి"- అని.

ఆమె అంది తెల్లటి పలువరస వెలిబుస్తూ చిన్నవ్వుతో - "ఫరవా లేదు" - అని. ఇద్దరూ కూర్చోలేదు. నిల్చొనే మెల్లగా ఏవేవో మాట్లాడుకున్నారు. ఆవిడంటున్న ప్రతిమాటకీ అతడు నవ్వే.

మూడోగంట కొట్టగానే గది వదిలిపెట్టి అతడు వెళ్ళిపోయేడు - ఒక పెద్ద బరువు తగ్గినట్టయింది గోపాలానికి. ఆమె చెప్తున్న పాఠంలో ఒక్క పదంకూడా అతని మనస్సుకి పట్టలేదు-విడుపుగంట కొట్టడం అతనికి వినిపించలేదు. అంతా లేచివెళ్ళిపోతూ ఉంటే అతని కాశ్చర్యంవేసింది—

గదంతా ఖాళీ అయింది.

ఆవిడ గొంతుక వినిపించి ఆతడు తలెత్తాడు.

"గోపీ - ఇంటికి పోదాం పద."

అదే చిరునవ్వు ఆమె పెదాలమీద.

కారణం లేకుండా ఎందుకో అతని మనస్సు బరువుగా ఉంది. ఆవిడతో ఏదో చెప్పా లనిపిస్తోంది. ఏవిటి చెప్పడం?

దగ్గరగావచ్చి పలకా పుస్తకం అందుకుందావిడ. ఆమె వ్రేళ్ళతని చేతి నందుకున్నాయి - ఆమె వంట్లో కలిసిపోయినట్లయిందతనికి. ఆ చేతిమీద తలపెట్టుకుని నిద్రపోతే ఎంత బావుంటుంది? కాని ఎందుకో అతని మనస్సు బరువుగా ఉంది. ఏదో చెప్పా లనిపిస్తోం దావిడతో.

బయట చెప్పుల చప్పుడైంది - కొత్త మేష్టారు వచ్చేరు గదిలోనికి.

రాగానే గోపాలంవేపు అదోమాదిరిగా చూస్తూ అన్నాడతను - "ఎవళ్ళ అబ్బాయి?"

మనిషి బాగున్నా గొంతు బొంగురుగా గాడిదగొంతులా ఉందనిపించింది గోపాలానికి.

తా నెవడైతే అతని కెందుకో - ఏవిటా అడగడం - అంత మర్యాదా లేకుండా! అబ్బాయిట! అబ్బాయి! అబ్బాయేవిటి - తన పేరు తెలియకపోతే ఊరుకోవాలి - ఏవీ కానివాడిలా అబ్బాయిట. అబ్బ! ఎంత గొప్ప. ఆవిడ ముద్దుకొడుకుని నేను, నువ్వెవడివి పో - అని ధీమాగా తనంటే - అప్పుడు తెలుస్తుంది తన సంగతి.

ఆమె అతని చెయ్యి వదలకుండానే అంది చిరునవ్వుతో - "మా గోపీ-మా వీధిలోనే వీళ్ళ ఇల్లు"—

ధీమాగా నిల్చున్నాడు గోపాలం.

"మా గోపీ!" అని ఆవిడంది. తనకు తెలుసు. ఏవిటనుకున్నాడో తన సంగతింకా!

మాష్టారు నవ్వుతూ అన్నారు - "వివీధేం - లేపట్నుంచి మా వీధి కూడాను - ఒస్తా" అతను వెళ్ళిపోయేడు.

అతనామె కళ్ళలోకి చూసిన చూపు ఎంతో ఏహ్యంగా తోచింది గోపాలానికి.

చింతచెట్టు దగ్గరకు రాగానే తలెత్తిచూసేడతను. ఆమె మెత్తటి వ్రేళ్ళ మధ్య అతని చెయ్యి ఉయ్యాలలా ఊగుతోంది - సూర్యుడు ఎర్రగా రక్తపు బుడ్డీలా కొండలోకి దిగిపోతున్నాడు.

చింతచెట్టునీడ పొలాల్లోకి పడుతోంది. ఎండ బాగా చల్లబడింది.

ఇప్పుడు కాళ్ళు చురకవు - బాధలేదు. ఇసుకలో మెల్లిగా నడవొచ్చు, దాంట్లో కాళ్ళు కూరుస్తూ. ఇంటిదగ్గర చిన్న చెల్లి పాటికి కుర్చీ తయారుగా వుంచి తనకోసం చూస్తూఉంటుంది బస్సుఆటకి. ఈవేళ తను డ్రయివరుగా ఉంటాడు - ఏడుస్తే ఏడవనీ రోజూ ఇలా నే ఏడుస్తూ గమ్మత్తు చేస్తుంది. రోజూ అదే డ్రయివరు - ఇవాళ తను ఎకాయెకీని విజనారంనుండి బొబ్బిలి వరకూ నడుపుతాడు. ఇంటికి వెళ్ళగానే డ్రయివింగ్ సీట్‌లో కూర్చొని 'బస్సు' స్టార్ట్ చేసేస్తాడు - నడుస్తున్న బస్సు ఎవళ్ళూ దిగలేరుకదా!

ఇల్లు దగ్గరపడింది. తలెత్తి ఆమె ముఖం

ప్రక్కహోటల్ ప్రొప్రయిటర్ - తన ఆస్పత్రికి రావడం చూడంగానే ఒక డాక్టరు అన్నాడు. "అరే ... మీరే వచ్చేశారే...నాకు బలే తలనొప్పిగా వుంది, అంచేత కాస్త కాఫీ పుచ్చుకుందా మని నేనిప్పుడే మీ హోటల్‌కు బయలుదేరబోతున్నా"

"అరె...అలాగా ... నాకు కూడా బలే తలనొప్పిగా వుందండీ. మీరేమైనా మందిస్తారేమో నని ఇప్పుడిక్కడికి వస్తున్నా" అని జవాబిచ్చాడు హోటల్ ప్రొప్రయిటర్.

"మహేష్"

లోనికి చూశాడతడు. ఆవిడేదో తీవ్రంగా ఆలోచిస్తూ నడుస్తోంది. తనవేపు చూడనే లేదు. ఆమె రెప్పలు బరువుగా దూరపు కొండల్ని చూస్తున్నాయి - తనున్నట్టే జ్ఞాపకంలేదు ఆవిడకి!

ముఖం త్రిప్పుకొని శూన్యంగా తన ఇంటివేపు చూశాడు - చిన్న చెల్లి అప్పుడే వీధి వరండామీద కుర్చీ బోరగిల్లా పెట్టి డ్రయివింగ్ సీట్లో కూర్చుంది. "పోయి - పోయి" ఆ హారను కొడుతూ నోటితో - దానికేకలు వినిపిస్తున్నాయి తనని చూడగానే-

"గోపన్నాయి - వేగం - వేగం - ఆలశ్యం చేసేవంటే బస్సు తప్పిపోగలదు జాగర్తా"-అంటూ-

ఇంటిముందాగాడు గోపాలం - ఆవిడ కూడాను. తలెత్తి ఆమె ముఖంలోకి ఇంకో సారి చూసేడతను. ఈసారి అగాధంగం కలగలేదు. ఆమె అతనివేపే చూస్తోంది.

తెలియనిదేదో మాట్లాడాలనిపిస్తోందతనికామెతో - ఏం మాట్లాడాలో అతని మనస్సు కొంచమైనా సహాయపడలేదు. ఆమె చెయ్యివదుల్తూ చిన్న గొంతుకతో అన్నాడు. "అమ్మగారూ"

"ఏంరా గోపీ"-ఆత్రుతగా అందామె.

అతని గొంతుక ఇంకా తగ్గిపోయింది. తల దించుగొని అన్నాడు.

"రేపుకూడా పిలుస్తారా!"

ఆమె చిన్నగా నవ్వి, అతని చెక్కిళ్ళని వ్రేళ్ళతో నొక్కి పుస్తకం పలక అతని కందించి వెళ్ళిపోయింది.

చిన్న చెల్లి కేక పెడుతోంది.

"పోనీలే - నువ్వివాల డ్రయివరుగా వుండు-దానికేనా అలా ముఖం పెట్టేసేవు."

గోపాలాని కొడాలనిపించలేదు - గేటు ముందలానే నిల్చొని వీధికొసనున్న ఆమె ఇంటివేపు చూస్తూ నిల్చున్నాడు.

* * *

చింతచెట్టు దగ్గర కొచ్చింది.

కాళ్లు బరువుగా పడుతున్నాయి గోపాలానికి-స్కూలుకి వెళ్ళడం అతని కెందుకో ఇష్టంలేకుండా ఉంది.

తలెత్తి ఆమె ముఖంలోనికి చూశాడు. ఆమె రోజూలానే ఏదో తీవ్రంగా ఆలోచిస్తోంది.

ఏవిటో అంత ఆలోచన! ఈమధ్యనే ఈవిడ కీ ఆలోచన ఎక్కువైపోయింది. ఆ కొత్తమాష్టారొచ్చినప్పటినుంచీ ఈవిడిలా మారిపోయింది. చిల్లంగి పెట్టేడేమో - ఈ చిల్లంగివాళ్ళు శ్మశానంలో రాత్రులు తిరుగుతారుట! అమ్మో! ఆ చిల్లంగివాడితో ఈవిడ మాట్లాడ్డమే - శ్మశానం అంటేనే భయమేస్తుందే - అందులో దెయ్యాలూ, భూతాలూ అవీ వుంటాయి - చచ్చిపోయిన నూర్ గాడు కూడా అక్కడ దెయ్యమై యుండాలి. బ్రతికున్నప్పుడు కొయితాల మీద రకరకాల దెయ్యాల బొమ్మలువేసి తనదగ్గర పలక పుల్లలు, డబ్బులు జడిపించి గుంజుతూవుండేవాడు.

★ చిల్లంగి ★

ఓ దెయ్యాన్ని చూస్తే బాగుంటుంది. కాని ధైర్యం ఉండొద్దూ? కొత్తమాష్టార్ని చూపించమంటే? చిల్లంగివాళ్ళతో మాట్లాడమా? అమ్మో! కాని అతడు భయం కలిగిస్తూ ఉండడే — భయం వెయ్యకపోయినా — ఛీ! అతనితో మాట్లాడ్డు తను. అతనంటేనే అసహ్యం వేస్తుంది. మంచి మనిషి కాదు. ఆవిడకి చెప్పాలా మాట — అతనితో మాటాడొద్దని చెప్పాలి — చిల్లంగి పోవడానికి కావలిస్తే నూరు నాన్న ఖాదరు సాయిబు ఇట్టే పోగొట్టిస్తాడు — అతనిని తీసుకురావడం తనది పూచీ. ఆవిడ 'ఊఁ' అంటే ఏ పనన్నా ఇట్టే చేసేస్తాడు తను — అసలు ఖాదరు సాయిబు దెయ్యాల్ని పట్టి వాటిని మాట్లాడిస్తాడు. వాళ్ళింట్లో మనుష్యుల బుర్రలు వరసగా దండెలు గుచ్చి ఉన్నాయిట! అతనికి కాళికాదేవి ప్రత్యక్షమయిందిట కూడాను. సంకోచిస్తూ అఖరికన్నాడతను—

"అమ్మగారూ?"—

ఆవిడంది ఆత్రంగా — "ఏంరా— గోపీ."

"మరేం — మన కొత్త మాష్టారు మంచివారేనండీ?"

ఆవిడ పకపక నవ్వి అంది — "చాలా మంచివారు. ఏం? నిన్నేమన్నా అన్నారా?"

కాదన్నట్టు తల ఊపి అన్నాడు గోపాలం.

ఏఁవీ అర్థంకాలే దీవిడకి. అసలు చిల్లంగి సంగతే తెలీదు. ఎలా తెలుస్తుంది — తెలీకుండా చిల్లంగి పెట్టేస్తారు ఈ చిల్లంగి వాళ్లు. ఓసారి చిల్లంగి దొరకొత్త దొరికిపోవడం జ్ఞాపకమొచ్చిం దతనికి. ఖాదరు సాయిబు వెంటనేవచ్చి దానిముందు రెండు పళ్ళూ విరగ్గొట్టి, మంత్రంవేసి పాతిపెట్టి దాన్నొదిలీసేడు. ఈ మాష్టారుకీ అలా చేస్తే తీరిపోతుంది.

ఆవిడతో తనున్నప్పుడు ఎందుకో అలా చూస్తాడు తనవేపు. తనక్కడ ఉండడం ఇష్టం లేనట్టు — లేక తనకే......తనకా! అహఁ! బ్రహ్మదేముడు రావాలి తనసంగతి తెలీదు కాబోలింకా. చిన్న చెల్లి నడుగుతే చెప్తుంది. ఓసారికొట్టిన లెంపకాయ మజా ఈజన్మలో మరచిపోదు. పైగా ఖాదరు సాయిబు తనకు బాగా తెలుసు — తన దగ్గరా పిడి ఆటలు.

కాని ఇంకా ఏదో అనుమానం ఉండిపోయిందతనికి. అది తీర్చుకొనే దాకా అతని మనస్సుండబట్టలేదు. నడుస్తూనే అన్నాడు.

"అమ్మగారూ— మరి కొత్తమాష్టారు మన వీధిలో దిగేరుకదా — అలా అక్కడే ఉండిపోతారాండీ?"

ఇంకోసారి ఆవిడ నవ్వి అంది — "ఏంరా గోపీ. ఆ మాష్టారంటే ఎందుకు నీ కంత ఇదీ?"

ఆవిడమాట లిష్టపడలేదు గోపాలానికి. అతని కనుమానం వేసింది. ఆవిడ కామాష్టారంటే ఇష్టమున్నట్టుంది. నిజంగానే చిల్లంగి పెట్టేసే డీవిడకి — ఈవిడకి నిజంగా తెలీదు — చెప్పా లీవిడకి — ఎంత సాయమన్నా చేస్తాడు తను — అమ్మవారికి కావలిస్తే దండం పెట్టుకుంటాడు. చిన్న కోడిపిల్లనిస్తే. అంతా తీరిపోతుంది.

ఆమె దగ్గరగా నడిచి ఆమెకు తగుల్తూ నడవసాగాడు గోపాలం. ఆమె కాళ్ల రెండింటినీ పెనవేసుగుంటే బావుణ్ణనిపించింది.

మగతగా ఆలోచిస్తున్న అతనికి వెనుక దూరంగా చెప్పుల చప్పుడు లా వినిపించింది — తిరిగి చూశాడతను — కొత్తమాష్టారు! తమని కలుసుకోనేందుకు గబగబా నడుచుకొస్తున్నాడు.

గోపాలం ముఖం వాడిపోయింది. ఆవిడ కూడా తిరిగిచూసింది. వెంటనే ఆగిపోయిందామె — చిన్న నవ్వు నవ్వుతూ అతను దగ్గరగా వచ్చాడు.

"ఏం? ఇంత వేగం వెళ్లిపోతున్నారు. ఇంకా వేళుందికదా?" ఆమె నవ్వి అంది. "కాస్తముందుగా వెళ్తే విశ్రాంతి తీసుకోవచ్చు — చూడండీ ఈ ఎండలో వెళ్లడం"

అతనేదో మాటాడబోయి అనుమానంగా గోపాలంవేపు చూశాడు.

గోపాలం వెంటనే ఇది కనిపెట్టాడు. అతని మనస్సు ఆ మాష్టారిమీద అసహ్యంతో నిండింది. ఈ త్తచిల్లంగా వాడు — దెయ్యాలవాడు! మంత్రాలువేసి ఆవిణ్ణి మార్చేసేడు.

అతనంటున్నాడు — "నిన్న సాయంత్రం ఒక్కణ్ణే అలా షికారుపోయేను. మీరిల్లు కదల్లేనట్టుంది. ఓ సారలా మంచిగాలి పీల్చడానికి వెళ్తే తప్పేమీ లేదుగదా?"

ఆమె అతనివేపు అదోరకంగా చూసి నవ్వి ఊరుకుంది.

రోడ్డుమధ్య సాగిపోయాడు గోపాలం.

ఆవిడ తిరిగి ఆశ్చర్యంగా చూస్తూ ఆగిపోయింది.

వెలవెలపోతున్న ముఖంతో అన్నాడు గోపాలం. "మొగం తిరుగుతోందమ్మ

కాదూ-"

మాట్లాడుతూనే రోడ్డుమీద పడిపోయేడతడు పాపం-

ఆవిడ పరుగునవెళ్లి అతన్ని ఒళ్లోకి తీసుకుంది. కొత్త మాష్టారు ఆశ్చర్యంగానూ కొంత విసుగ్గానూ చూస్తూ నిల్చున్నారు.

ఆత్రంగా పేరుపెట్టి పిల్చిందావిడ గోపాలాన్ని-గోపాలం మాటాడేడు. అతనికళ్లు వాడి, మాటలు పడిఉన్నాయి - ఆమె తొందరగా లేచి, అతన్ని భుజానవేసుకొని పెద్ద అడుగులు వేసుకుంటూ ఇంటివైపు నడిచింది.

కొత్త మాష్టారు ఏం చెయ్యడానికీ తోచక చూస్తూ నిల్చుండి పోయేరు.

ఆవిడ ఒంట్లో స్వర్గంలో ఉన్నట్టనిపించింది గోపాలానికి - తన జన్మలో ఎరుగని సంతోషం అనుభవించేడు - అతని మనస్సు విజయగర్వంతో నిండింది. ఇప్పుడు రానీ ఏ చిల్లంగివాడొస్తాడో. గోపాలందగ్గరా చిల్లంగి! ఏదో హాయిగా ఆలోచిస్తూ కళ్లు మూశాడతను.

* * *

దూరంగా ఆకాశంమీద ఏదో పక్షి వికారంగా అరుచుకుంటూ పోయింది.

ప్రక్కను పొదలో చిన్న చప్పుడు.

ఉడత ఒకటి ఎగురుకుంటూపోయి దగ్గరున్న చెట్టెక్కింది.

చీకట్లో తుప్పలమధ్య ఊపిరి తియ్యకండా కూర్చున్నాడు గోపాలం.

కొత్త మాష్టారిల్లు తలుపేసుంది. ఎక్కడా ఏ అలికిడీ లేదు.

ఎదురుగాఉన్న అమ్మగారిల్లు కూడా తలుపేసుంది. కాని లోపల దీపం వెలుగుతున్నట్టుంది.

చీకటి ఆకాశంమీద మెరిసే నక్షత్రాలను చూస్తూ కూర్చున్నాడతను.

చేతులేదో రాసుకుపోయింది. ఉలికిపడి ప్రక్కకు తప్పుకున్నాడు.

తూరుపు కొండ ఉదయించబోయే చంద్రుడి కిరణాలముందు నల్లరాతిసిలా ఉంది.

లెక్కలేని ఆ నక్షత్రాలను చూస్తూ ఉంటే అమ్మమ్మ ఎప్పుడో చెప్పే కథ జ్ఞాపకం వచ్చిందతనికి. ఎవడో రాజుండేవాడు - అతనికి రెండు సందేహాలుండిపోయాయి. ఆకాశంమీద ఎన్ని నక్షత్రాలున్నాయి, దేవుడెప్పుడూ ఏం చేస్తూ ఉంటాడు అని. ఎప్పటికీ సందేహం తీరకపోగా ఓనాడు మంత్రిని పిలిచి వాటికి సందేహం వారం దినాల్లోగా చెప్పమన్నాడు. లేకపోతే తలపోతుందన్నాడు. మంత్రికి పాపం ఏం చెయ్యడానికీ తోచలేదు. ఐతే అతని కూతురు చాల తెలివైంది. తండ్రి దిగులుకి కారణం తెల్సుకొని ఓస్సి ఇంతేనా అంది. ఆఖ్రరోజున తండ్రిని పిల్చి ఏదో రహస్యంగా చెప్పింది. ఐదో రోజున మంత్రి రాజుదగ్గరకి వెళ్లేడు. "ఏం మంత్రీ చెప్పగలవా" అన్నాడు రాజు. "చిత్తం" అన్నాడు మంత్రి. దేవుడేం జేస్తాడన్న దానికి జవాబుగా మంత్రి రాజుని తను చెప్పినట్టు చెయ్యమన్నాడు. తన బట్టలు రాజుకిచ్చి రాజు బట్టలు తను వేసుగొని సింహాసనం ఎక్కి కూర్చున్నాడు. దేవుడదే చేస్తాడన్నాడు. రెండో ప్రశ్నకి జవాబుగా ఓ బస్తాడు ఇసుక తెచ్చి ఒక్కొక్క రేణువే లెక్కపెట్టుగోమన్నాడు.

గోపాలానికి నవ్వొచ్చింది. ఆశ్చర్యమూ వేసింది. అంత తెలివే తనకుంటే ఈపాటికి తనూ ఓ పెద్ద ఏదో ఐపోను.

దూరంగా చప్పుడయింది. పాదాల చప్పుడు. ఇద్దరు వ్యక్తులు నడుచుకొస్తున్నారు రోడ్డుమీద.

గోపాలం మరీ పొదలచాటుకి పోయేడు.

ఇద్దరు వ్యక్తులూ దగ్గర పడ్డారు.

అతడు గుర్తుపట్టేడు కొత్త మాష్టార్ని, అమ్మగార్ని. అతని ముఖకవళికలు పూర్తిగా మారిపోయేయి. ముఖం ఎర్రబారి పెదాలు వణకసాగేయి. మరీ ఊపిరి బిగపట్టి కూర్చున్నాడు.

కొత్త మాష్టారి మాటలు వినిపిస్తున్నాయి- "సాధువుగా వాడుకుంటే నా జీతం మనిద్దరికీ సరిపోవచ్చు-దానికోసం అంత బెంగెందుకు-పిచ్చిదానిలా ఉన్నావు."

ఆవిడ ఇంటిముందు ఇద్దరూ ఆగిపోయేరు మాట్లాడకండా. అతడామె చేతుల్ని తన చేతుల్లోనికి తీసుకున్నాడు. ఆమె తలదించుకొని నిల్చుంది. మౌనంగా కొద్ది నిముషాలు నిల్చొని ఇరువురూ విడిపోయేరు. కొత్త మాష్టారు తన ఇంట్లోకి పోయేరు.

గోపాలం ఒక్కసారి లేచి తిరిగి కూర్చుండిపోయేడు ఏదో ఆలోచిస్తూ - అతని ఒళ్ళంతా జ్వరం వచ్చినట్లు ఒకేలా వణుకుతోంది. అతని కుడిచేయి వణుకుతూ జేబులోకి వెళ్ళింది-ఆ లేతకళ్ళు భయంకరంగా మారేయి - నిప్పుపెట్టెను పట్టుకొని జేబులో దూరిన చెయ్యి బయటకొచ్చింది- దగ్గరగా దాన్ని పరిశీలించి చూశాడతను - కంపిస్తూనే పెట్టె తెరిచి ఒక పుల్ల తీసి సందేహిస్తూ అంచుమీద కొట్టేడతను. 'భగ్గు'మని అంటుకొంది పుల్ల. ప్రపంచమంతా వెలుగుతో నిండిపోయినట్టయిందతనికి. చాలా భయంవేసింది. ఊది ఆర్పేసేడు మంటని. వణకే చేతులలోనుంచి పెట్టి జారి నేలపడింది.

మంత్రముగ్ధుడిలా కొత్త మాష్టారింటిని చూస్తూ కూర్చున్నాడతను.

చంద్రుడు బాగా పైకొచ్చాడు. ఆ కాంతిలో గోపాలం ఒళ్ళు ఒక నీడలా, నేలమీద ఒక మచ్చలా ఉంది.

దూరంగా అడవిలో ఒక ఆవు ఎలుగెత్తి అరుస్తోంది.

ఒక్కసారిగా లేచాడు గోపాలం. అతని కళ్ళంట నీళ్లు కారుతున్నాయి. ఆవేశంతో ఆ ఇంటిని చూస్తూ మెల్లగా పెదవుల క్రింద అనుకున్నాడు. "చిల్లంగి"-ఆ మాటలంటూ పొదల్లోనుంచొక్క గంతువేసి నలువైపులదీ పరిగెత్తుకుంటూ పోయాడా చీకట్లో.

* * *


పెద్దన్నాయి దొరగారిలా, ఓ చిన్న టోపీ, నల్లటి కళ్ళద్దాలూ అవీ పెట్టుకొని

★ చిల్లంగి ★

చప్పుడు లేని జోళ్ళతో శేషు గ్గాతో నడుస్తూ వెళ్ళి లాభంలేక ఏదో శపథాలు పలుకుతూ చలవజోళ్ళు పైకి తీసి వ్రేళ్ళతో ఆడిస్తూ తలదించుకొని వెళ్ళిపోయాడు.

రోడ్డుమీద నిల్చొని సర్వజ్ఞరావు సుబ్బమ్మ రెండు దవడలూ గట్టిగా నొక్కుకొని, మూతివిరిచి, తలమీద పైను పంచ సర్దుకొని గబగబ ఎక్కడికో చాలా తొందర వార్తల్ని మోసుకుంటూ నడుచుకుపోయింది.

దూరంగా వారికి పైడయ్య కరణంగారి ఆవుదూడ వెంట పరుగుతీస్తున్నాడు దానిని పట్టుకొనేందుకు.



గదిలో నలుగురైదుగురిలా మనుష్యులున్నారు.

ఇంకా బాగా ప్రొద్దెక్కలేదు. సూర్యుడి ఒక కిరణం గది చూరులోనుంచి సందు చూసుకొని వచ్చి సులకమంచం ప్రక్కని పడుతోంది.

సులకమంచంమీద పడుకున్న అమ్మగారిముఖం నిశ్చలంగా చూస్తూ తలప్రక్క నేలమీద కూర్చున్నాడు గోపాలం.

ఆవిడ చీరనుంచి తేలికైన మల్లెపువ్వుల వాసన మంచులా చల్లగా గదిని నిండింది. వాయిలుచీర ఇస్త్రీ మడతలు చెక్కుచెదరకుండా తీర్చి దిద్దినట్టున్నాయి. ఆమె ఒళ్లంతా పొంగినట్టుండి కడుపువద్ద ఒక గుట్టలా ఉంది. ఆమె ముఖం ఎప్పట్లానే తెల్లగా అందంగా ఉంది. కళ్ళకున్న కాటుక నీరుకారడం వల్ల చెదిరి చెక్కిళ్ల మీద మరకను చేసింది. శుభ్రంగా దువ్వుకున్న తల.- పెదవులమీద జాలిగా చిరునవ్వు-

అరవిందం మాష్టారు ఉదయంనుండి చాల హడావిడిగా ఉన్నారు. అతని ఖద్దరు లాల్చి, బుజంవద్ద ఆరంగుళాల కన్నంతో ఎటో పోతానంటూ చెదిరిపోంది. ఆఖరికి చిరాకెత్తే కాబోలు అది పోకుండా, తానే దానిని పైకి లాగి నడుముకు చుట్టాడు. అతని బాధనురేమీ లేదు కాని అన్ని వంపులతోనూ అంతా కళాపూరితంగా పెరిగి,పోషించ బడుతున్న తన అందమైన ఒంటికి ఎక్కడ కన్ను తగుల్తుందోనని, ఐనా ఆఖరికి తెగించేడు.

అరవిందం మాష్టారి సంగతి ఆ ఊళ్లో అందరికీ తెల్సిందే. ఎక్కడ్నించో గాల్లోంచొచ్చిన ఆయన జీవితంలోని చిన్న కథలాటి ఒక విశేషాన్ని ఆ ఊళ్ళో చాలామట్టుకు చిన్నలూ, పెద్దలూ పైటికి కాపోయినా లోలోపల ఇప్పటికీ నమ్మతారంటే ఆశ్చర్యంకాదు. అలా అని ఒకరూ దాని సత్యాసత్యాన్ని ఆయనతో ముఖాముఖీ మాట్లాడి తెలుసుకునేందుకు కాడి గట్ట లేదు. రూఢి అని స్థిరపడిపోయిన ఒక సంగతిని కాదనిపించుకుని, దానితో కట్టుకున్న ఊహా సౌధాల్ని కూల్చుకొని బాధ పడడం ఎవరికీ ఇష్టంలేక అయిఉండొచ్చు. ఇంతకీ అది నిజమే అయి ఉండొచ్చు, అది ఆ ఊళ్లో జరిగిందికాదు. అందుకే మరింత నమ్మడాని కవకాశం. అసలు వీళ్లు పూర్వం కాశ్మీరులో ఉండేవారుట. అందుకే తలనెరిసి, ముఖం ముడుతలు పడ్డ

ఆ దేశపు సాంప్రదాయం అతనిలో కనిపిస్తూ ఉంటుందిప్పటికీ, అతని చరిత్రలో నమ్మకం ఉన్నవాళ్ళకి ముఖ్యంగా.

అసలు జరిగిన సంగతేవిటంటే ఆయనింట్లో ఓనాడో దొంగపడ్డాడుట. దొంగ వచ్చేసరికి చప్పుడై ఈయన పెద్దకొడుకు లేచి కేకవెయ్యబోయేడు. వెంటనే ఆ దొంగ చేతిలో ఉన్న కత్తితో ఆ కుర్రాణ్ణి చంపేసేడు. ఇంతలో మాష్టారిక్కూడా తెలివొచ్చింది. అతను కళ్లు విప్పేసరికి ఇంకేం ఉంది. దొంగమాత్రం పారిపోతున్నాట్ట అప్పుడే. దొంగని పట్టుకోలేదుకాని గుర్తు పట్టేడట. ఆ దొంగవాళ్ల పనిమనిషేనట! కాని మాష్టారొక్కపిట్టతో కూడా చెప్పలేదు దొంగవరో!

వీధిలో ముగ్గురు మాష్టర్లు వెదురుబద్దలు చీల్చి వేగం వేగంగా కట్టె తయారు చేస్తున్నారు. ఇంకో ఆయన పిడకలు ముక్కలు గావించి నిప్పువేసిన కుండలో పేరుస్తున్నాడు.

కొస్త దూరంలో .హెడ్ కానిస్టేబులు సోమనాథం పచారు చేస్తున్నాడు బీడీ కాలుస్తూ.

అరవిందం మాష్టారు బయటకొచ్చారు - రాగానే అతని కంటబడింది కాకీ బట్టల్లోని సోమనాథం - అంత గొప్పాయనకూడా అతన్ని చూడగానే చెమట్లు కార్చుకున్నాడు. అక్కడినుంచే వంగి ప్రణామం చేసి జారిపోయే కచ్చ సరిచేసుకుంటూ హెడుగారివేపు పరుగుతీశా రాయన. గౌరవాన్ని స్వీకరిస్తూ ఆ కాకీబట్టల్లోని ఆయన చాలా హోదాగా తల ఊపేడు చిన్న చిరునవ్వు కూడా విసుర్తూ.

ఇద్దరూ ఏదో ఏదో చాలా చాలా మాట్లాడుకున్నారు, గట్టిగా, మెల్లగా నవ్వుతూ - ఆఖరి కతడూ మాష్టారూ కలిసి దడి ప్రక్కకి వెళ్లేరు.

పెద్దన్నాయి, అరవిందం మాష్టారు గతి హడావిడిగా ప్రవేశించడం గోపాలం గమనించలేదు.

అప్పుడే బాగా ప్రొద్దెక్కింది. నడుమున కున్న లాల్చీకూడా లాగి పారేశారు మాష్టారు.

మంచంమీద చేతులాన్చి ఆవిడ ముఖంలోనికి చూస్తూ కూర్చున్నాడు గోపాలం.

పెద్దన్నాయి, కాళ్లు రెండూ ఎడంగా ఉంచి నిల్చొని, లాల్చీ రెండు చేతులా పైకి మడిచి గోపాలాన్నొక్క [illegible] మీద కెత్తేడు. అంత మీదనుంచి గోపాలం క్రిందపడ్డాడు - పెద్దన్నాయి పెద్ద కేకేసి మీద కెగిరేడు. అతని మండనుంచి రక్తం ఒకే ధారగా కారుతోంది. గోపాలాన్ని మెత్తటి జోడుతో ఒక్కతాపు తన్ని ఏవో

ఇంగ్లీషులో తిట్టుకుంటూ గబగబా బయటకు పోయే డతను.

అంతా తనకు తెలుసునన్నట్టు ముఖం పెట్టి, ఒక సాధువులా వెళ్ళి గోపాలం ప్రక్కని చతికిలపడ్డారు అరవిందం మాష్టారు. ముగ్గురు మాష్టర్లూ కట్టె పూర్తిచేసి వచ్చి ఆయన వెనుక నిల్చున్నారు.

అరవిందం మాష్టారి చెయి గోపాలం తలపైని పడింది మెల్లగా నిమురుతూ - ఏదో చాలా కష్టమైన పని నెత్తిన వేసుకున్నట్టు ముఖం పెట్టి మెల్లగా గోపాలాన్ని సంబోధించేరు కాస్సేపయాక.

"నాయనా!"

గోపాలం మాట్లాడలేదు. ముఖమైనా అతని వేపు తిప్పి అతని వయసుకిచ్చే గౌరవం నిలబెట్టలేదు. జీవితంలో ఎన్నో ఒడుదుడుకు లెదుర్కొన్న అతడు ఇది పట్టించుకోపోవడం ఆశ్చర్యం కాదు. పైగా అతని ముఖాన వైరాగ్యం పొందినవానిలా చిరునవ్వు వెలిసింది. తల నిమురుతూనే గంభీరంగా అన్నారు. "నాయనా! అమ్మ పిలుస్తోంది."

ఈసారి నిజంగా ఆ ముసలాయనకి తీరని అవమానమే. వెనుకనున్న మాష్టర్లకైనా అలా వినిపించింది. మాట్లాడకపోవడం అటుండగా అతని చిన్న వ్రేళ్లు ఆమె తలలోనికి వెళ్లేయి.

ఇంక ఇది సహించరానిదే. కొడుకుని చంపేసినా మాష్టారూరుకుందురే కాని, తన హితోపదేశాల్ని ఎవరన్నా పెడచెవిని పెట్టడం ఆయన సహించలేని పని. ఇది వెనకనున్న వాళ్ళ మనసుల్లో పుట్టిన అనుమానం.

మాష్టారు గోపాలం తలమీంచి చెయ్యి తీసేరు. అతని ముఖం వాడి ముడుతలు పడ్డ కనురెప్పలు చెమ్మగిల్లేయి.

మాష్టారు లేచి ఏదో సన్న చేసేరు. అంతా కలిసి ఆమెను లేవనెత్తేరు. గోపాలం లేచి ఆమె తలదగ్గర నిల్చున్నారు.

అంతా పూర్తయింది. అరవిందం మాష్టారు నిప్పు పట్టుకున్నారు. ముగ్గురు మాష్టార్లూ ఇంకో పైఆయనా కొమ్ములదగ్గర నిల్చున్నారు.

ఎదురుగా ఉన్న మాష్టారిల్లు తాళ్లా తెరిచి ఖాళీగా ఉంది.

దూరదూరంగా అక్కడక్కడ పిల్లలు నిల్చొని ఆత్రంగా చూస్తున్నారు.

పైడయ్య దూడ రెండు చెవులూ పట్టుకొని లాక్కెళ్తున్నాడు కరణంగారి ఇంటికి.

సుబ్బమ్మ తిరిగి ఇంటికి పోతూ నెత్తిమీది కొంగు ముఖంమీదికి లాక్కుంది.

"హరి! హరీ!" అన్నారు అరవిందం మాష్టారు. కొమ్ముల దగ్గరున్న నలుగురూ హరినామస్మరణ చేసేరు.

కట్టె మీదికి లేచింది. నడక ప్రారంభమైంది. ముందు అరవిందం మాష్టారు అతన్ననుసరిస్తూ గోపాలం, వెనుక బుజాలమీద తేల్తూ కట్టె.

దూరంగా మామిడితోటలో కోయిల తియ్యగా పాడుతోంది.

గాలికి రోడ్డుప్రక్కలనున్న దేవదారు చెట్లాకులు రాలుతూ చప్పుడు చేస్తున్నాయి.

సూర్యుడు నెత్తిమీద కొచ్చేడు. ఎండ తీవ్రంగా ఉంది.

ఇసుకలో కాళ్ళశబ్దం—అందరు చేసే "హరి" శబ్దం.

గోపాలం తలదించుకొని నడుస్తున్నాడు. చింతచెట్టు దగ్గరకొచ్చింది. దాని నీడ ఒక పెద్ద మచ్చలా రోడ్డుమీద పడుతోంది.

గోపాలం అడుగుల వేగం తగ్గించేడు. చెట్టునీడలోనికి వెళ్ళాక తలెత్తి చూశాడతను. నల్లకాకులు రెండు గ్రద్దనొకదాన్ని వెంబడిస్తూ అరుచుకుంటూ పోతున్నాయి.

అంతా ఒక్కసారాగారు. మాష్టర్లు బుజాలు మార్చుకున్నారు. నడక తిరిగి ప్రారంభమైంది.

ఊరు పొలిమేర దాటింది గుంపు. పాములా వంకలు తిరుగుతూ కొద్దిదూరాన కానొస్తోంది నది. దాని ఇరుప్రక్కలా ఇసుక తిన్నెలు పౌడరు పూసుకున్న ముఖాల్లా ఉన్నాయి.

నది అవతల ఒడ్డున ఎవరూ తోడు లేకండా ఒక శవం కాలిపోతోంది.

నది దగ్గరైంది. ఇసుక దిబ్బలమీద నడక ప్రారంభమైంది. కాళ్లు కూరుకు పోతున్న ఇసుకలో వేగం తగ్గింది. నిప్పులమీద నడుస్తున్నట్టుందందరికీ-

గోపాలం తల ఎత్తకుండా నడుస్తున్నాడు.

ఇంత వేడిలోనూ కట్టెనుంచి సెంటు వాసన మాష్టర్ల ముక్కులకి తగుల్తూ తచ్చాంతి చేస్తోంది.

నది ఒడ్డున రెండుమూడు ఓడలు తలక్రిందులుగా పడుతున్నాయి. రాబోయే వర్షాల్లో ఉపయోగానికి వాటికి మరామత్తు జరుగుతోంది.

ఖాళీగా వచ్చిన వలని నీటిలోనికి విసురుతున్నాడో జాలారి యువకుడు.

నలుగురైదుగురు పిల్లలు దిగంబరులై నీట్లో ఈతకొట్టడానికి బ్రహ్మప్రయత్నం చేస్తున్నారు.

ఇసుకలో కాళ్ళకేదో గట్టిగా తగిలి ఆగిపోయాడు గోపాలం. గుంపు ముందుకు సాగిపోయింది.

ఒకరు: (విదేశీయునితో) మా పూర్వులు తొమ్మిది గజముల చీర నేసి అగ్గిపెట్టెలో పెట్టేవారు!

విదేశీయుడు:- మీ పూర్వులు అంత మొరటు వారా?

ఆయన :- ఎందుకూ?

విదేశీయుడు:- కాకుంటే? అంత పెద్ద అగ్గిపెట్టెలు చేసుకుంటారా!

కె. యం. స్వామి నెల్లూరు.

కాలుకి తగిలిన వస్తువకోసం ఎంతో తీక్షణంగా అన్వేషణ ప్రారంభించేడతను. ఒక గజం దూరాన ఇసుకలో పాతుకొని ఒక ఎముక దానికంటుకొని రెండు తెల్లటిపళ్లు కానొచ్చేయతనికి. వాటినందుకొని ఎంతో తీక్ష్ణంగా పరీక్షచేస్తూ నిల్చున్నాడతను. రాను రాను అతని ముఖం వికసించింది. చెక్కిళ్లెర్రబారి పెదాలు వణకేయి. ఆ ఎముక ముక్కని గట్టిగా రెండు చేతులతోనూ నొక్కి పట్టుకొని గుంపువేపు పరుగు తీసేడతను.

గుంపు నది దాటుతోంది. ఏటి మధ్యకు వెళ్ళారంతా. అప్పుడే నీరు అందరికీ మొల వరకూ వచ్చింది.

నదిలోనికి పరుగు తీశాడు గోపాలం. ఐదు గజాలదూరం పోగానే నీరు పీకవరకూ వచ్చింది. చేతులు రెండూ పైకెత్తి ఆ నీటి ప్రవాహంలో ఆగిపోయాడతను.

గుంపు ఏరు దాటి అవతలి ఒడ్డుకి పోయింది. గోపాలం పెదవులు చెప్పలేని సంతోషంతో వణుకుతున్నాయి. నదిలోని ఇసుక అతని పాదాల్ని క్రిందికి లాగేస్తోంది.

ఉన్నట్టుండి, తన కుండే శక్తినంతా గొంతుకలో వినియోగించి అరిచేడు గోపాలం.

"అమ్మగారోయ్! అమ్మగారూ! ఇంకొచ్చేండి - ఇంక ఒచ్చేండమ్మగారూ - ఇవిగో పళ్ళు - చిల్లంగిమాష్టారు పోయేరు - ఇవిగో రెండు పళ్లు. అమ్మగారోయ్"—

గోపాలం కేకలు విననట్టు నది అవతల ఒడ్డున కట్టెమీద సుఖంగా నిద్రపోతూందమ్మగారు. ★

బుద్ధిచెప్పిన ఎన్నికలు

నేను నెత్తీ నోరు కొట్టుకొని చెపుతూనే వున్నా - "వద్దురా బాబూ ఆ వ్యవహారాల"ని. నామాట వింటేనా? ఏదో, తానో నాయకుడు అయిపోయి, ప్రపంచాన్నంతా జయించాలని కాబోలు వాడి వుద్దేశ్యం. అరె! మొన్న మొన్నటి వరకూ ఎంత మంచివాడు! వాడి చదువేమిటో వాడేమిటో తప్ప యితరులతో మాట్లాడేవాడా? ఎవరు నేర్పాడో గానీ, ఆపిచ్చి బాగా నెత్తికెక్కింది.

"ఒరే! ఆ విషయాల్లో జోక్యం కలిగించుకొని, ఆ పిచ్చిలో తిరిగేవాళ్ళింత వరకు ఎవ్వరూ బాగుపడలేదురా!" అన్నాను చెప్పి చూద్దామన్న వుద్దేశ్యంతో.

"నేను బాగుపడకపోతే మాత్ర మేమిటిరా? నావల్ల ఎంతోమంది బాగుపడుతూ వుంటేనూ. మహానుభావుడు రామానుజాచార్యు లేమన్నారు? గురువుగారు మంత్రోపదేశం చేసి దీన్ని జపిస్తే స్వర్గప్రాప్తి అనీ, ఇతరులకు చెపితే నరకప్రాప్తి అనీ చెప్పారట. ఆయనేం చేశాడు? సహచరు లందరికీ ఆ మంత్రాన్ని ఉపదేశించాడు. గురువర్యులు ప్రశ్నించగా ఏమన్నాడు? 'నా వల్ల అంతమంది స్వర్గానికిపోతే నేనొక్కణ్ణీ నరకానికిపోతే నేమి మహాత్మా?' అన్నారుట. అదీ వాడి సమాధానం!

దీన్నిబట్టి చూస్తే అప్పటికే ఆ కేసు నా చేతులోంచి జారిపోయినట్లే కనిపించింది. రోగికి పైత్యం బాగా తలకెక్కింది. ఇక దాన్ని వదిలించాలంటే మళ్ళా విష్ణుమూర్తి పదకొండో అవతారం దాల్చాలి.

రెండుమూడు రోజులుగా కన్పించని కృష్ణమూర్తి ఒకరోజు వచ్చేసి సీరియస్‌గా నా ప్రక్కన కూర్చున్నాడు. అప్పుడేవచ్చి

తిరునగర్

హోటల్లో టిఫిన్ తీసుకొంటున్నాను. ఇంకా కాలేజీకి వేళ గాలేదు.

"అసలు సంగ తేమిటిరా?" అని అడుగుదా మనుకున్నాను. కాని వాడి ముఖం చూచి అడగ బుద్ధివెయ్యలేదు. కొంచెం సేపుంటే వాడే చెపుతాడనుకొని యింకో ప్లేటుకు ఆర్డరిచ్చి, నా తిండి గొడవలో నేనున్నట్లే నటించాను. కృష్ణమూర్తి మొఖంచూస్తే వాడేదో పెద్ద ఆలోచనతో సతమత మవుతున్నట్లు కనిపించింది. సర్వరు ప్లేటు తెచ్చి వాడి ముందుంచాడు వాడదేమీ ముట్టుకోకుండానే.

"నేను కాలేజీ యూనియన్ ప్రెసిడెంటుగా నుంచుంటున్నాను." అన్నాడు. చెప్పొద్దూ. నేను నిజంగా నమ్మలేదు. హాస్యంగా అంటున్నాడని భ్రమపడి" "నుంచో. తప్పకుండా నువ్వే గెలుస్తావు అన్నాను, సీరియస్‌గా అంటున్నట్లే నటిస్తూ.

"అందరూ అలాగే అంటున్నారు." అన్నాడు మెల్లిగా హోటల్ నాలుగు మూలలు చూస్తూ కృష్ణమూర్తి.

"నువ్వు ప్రెసిడెంటువైతే కాలేజీ స్వర్గంలా తయారవుతుంది" అన్నాను.

"అయితే నీ ఓటు ఎటు వెయ్యదలుచుకున్నావు?" అని ప్రశ్నించి, ఆత్రంతో నా ముఖంలోకి చూచాడు.

"చచ్చినా నీకు మాత్రం వెయ్యదలుచుకోలేదు."

తకీమని సమాధానం చెప్పి, అంతవిట్టు, ఉపయోగించినందుకు గర్వంగా వాడి ముఖంలోకి చూచాను.

కృష్ణమూర్తి ముఖం ఎఱ్ఱబడిపోయింది. వాడి పరిస్థితి చూస్తే నాకప్పు డర్థమయింది, వాడు చెప్పిందంతా నిజమేనని.

"పోనీ దానికి కారణం చెప్పగలవా?" అన్నాడు మెల్లిగా.

"అసలువిషయ మేమిటో చెప్పరా! ఎందుకు నిలబడుతున్నావు? ఎవరు నిన్నలా చేయమని చెప్పారు? ఏమిటీ కథ? నాకేమీ తెలియకుండా వచ్చేసి 'నీ ఓటు నాకిస్తావా?' అని అడిగితే ఎలాగు? ఇదేమన్నా మునిసిపల్ ఎలక్షననుకున్నావా?"

ఇక వాడు చెప్పడం మొదలుపెట్టాడు. వాడు చెప్పినదాన్నిబట్టి తేలిందేమిటంటే- క్లాసులో వున్న అంతమందీ వచ్చి వీణ్ణి నుంచోమని ప్రోద్బలం చేశారుట. ఇక మొత్తంమీద రెండు క్లాసుల ఓట్లు వస్తే తప్పక గెలుస్తాడుట. కాలేజీ అన్ని క్లాసుల్లోనూ మొత్తం నలభైమంది ఆడపిల్లలున్నారు. వాళ్ళకు తనమీద ప్రత్యేకాభిమానం వుందని కృష్ణమూర్తి నమ్మకం. తప్పకుండా తనకే ఓటు చేస్తారంటాడు. అందుచేత నిస్సందేహంగా గెలుస్తానని తలంపుతో వాడికి నుంచోవా లనిపించిందిట.

"ఒరే! నిలబడతా, నిలబడతానని ఉబలాటపడుతున్నావుగానీ నిలబడి ఏంచేస్తావురా?" అన్నాను.

"ఏంచేస్తానో ముందు ముందు నీకే తెలుస్తుంది నీ కళ్లతో నువ్వే చూస్తువుగాని. కృష్ణమూర్తి ప్రెసిడెంటుగా వున్నాడంటే కాలేజీ అంతా మోతెత్తిపోవాలి. విద్యార్థుల హక్కులకోసం పోట్లాడతాను. విప్లవం వర్ధిల్లజేస్తాను" అన్నాడు ఆవేశంతో.

"అయితే నువ్వీ కాలేజీని వదలదలుచుకోలేదన్నమాట."

"ఏం? అలా అడుగుతున్నావు?"

"ఈ బి. యే. ప్యాసవడానికేనా, ఈ వెధవ వేషాలన్నీ? మీనాన్నకు తెలిసిందంటే నీ తాట వలిచేస్తాడు. ఎవరో నుంచుంటున్నారంటే - వాళ్లకేమిటి? లక్ష్మీపుత్రులు వాళ్లు డబ్బెలా ఖర్చుగాను? వాళ్ళెన్ని సంవత్సరాలు తప్పినా ఫరవా లేదు. నీ వంటివాడు తప్పాడంటే నీముఖం ఎవరేనా చూస్తారా? పిచ్చి పిచ్చి వేషాలు వేయకుండా మెదలకుండా వూరుకో!" అని హితబోధ చేశాను.


"గురువచనం బతి నిర్మలంబయ్యు సలిలంబునుంబోలె శ్రవణస్థితంబై యభవ్యునికి శూల పుట్టించునని." శ్రీనాథ కవివర్యులు సెలవిచ్చినట్లు నా హితబోధ వాడి చెవికెక్కలేదు సరిగదా రోషం కూడా వచ్చింది.

"పెద్ద నువ్వే ప్యాసయేవాడివిరా... చూద్దాంగా ఎందుకు ప్యాసుకానో. ప్రెసిడెంటు పదవిలో వుంటే ఢంకామీద దెబ్బకొట్టి మరీ ప్యాసవుతాను. ఏమనుకుంటున్నావో! నువ్వెన్ని చెప్పినా ఇక లాభం లేదులే! నువ్వు నామీద అభిమానంతో ఓటు వేస్తే వెయ్యి. లేకపోతే లేదు" అని అక్కణ్ణించి కాఫీ అయినా తాగకుండా లేచి వెళ్లిపోయాడు.

సరే ఇక వాడి మనస్సు మార్చడానికి ప్రయత్నించడం "చేరి మూర్ఖుల మనసు రంజింప" చేయడమే అవుతుందని, వాడికే ఓటు వేయడానికి నిశ్చయించుకున్నాను.

టైము కాగానే క్లాసుకు వెళ్లాను. ప్రతిరోజూ నా ప్రక్కనే కూర్చునే కృష్ణమూర్తి సీటు, మూడు నాలుగు రోజుల్నించీ ఖాళీగానే వుంటోంది. ఈరోజూ అంతే. నేనింతకుముందే హోటల్లో చూశాను. ఇంక కాలేజీకి రాలేదని ఎలా అనుకుంటాను? బహుశా లేటుగా వస్తాడేమో ననుకొని సమాధానపడ్డాను. పిరియడు సగం గడిచినా వాడి జాడ లేకపోయేసరికి, ఈమధ్య వాడి వెంట జోరుగా తిరుగుతున్నవాణ్ణి అడిగాను "కృష్ణమూర్తి ఎక్కడ?" అని.

"కేన్వాసింగ్‌కి తిరుగుతున్నాడోయ్," అన్నాడు. క్లాసులు ఎగ్గొట్టి పదవీ వ్యామోహంతో తిరుగుతున్న కృష్ణమూర్తిని గూర్చి విచారించాలో సంతోషించాలో తెలియదు నాకు.



ప్రక్కనేవున్న వ్యక్తి దుడ్డుకర్ర పట్టుకుని యుద్ధానికి సిద్ధమైన సైనికుడి పోజులో నిలబడ్డాడు.

ఇక వాడు క్లాసుకు రావడమే మానేశాడు. నామినేషన్లు కూడా అయిపోయాయిట. కృష్ణమూర్తి పేరు కూడా నోటీసు బోర్డులో వేశారు, తాటికాయంత అక్షరాలతో, ప్రెసిడెంటుగా పోటీచేస్తున్నట్లు.

కృష్ణమూర్తి పోటీదార్లు యిద్దరిలోనూ కాస్త పేరుగలవాడు వెంకటేశ్వర్లు. అతనికీ పదవీవ్యామోహం లేదని చెప్పలేం గానీ మావాడికున్నంతగా కన్పించలేదు. అసలు కృష్ణమూర్తికి ఈ వుండు పుట్టకముందు వెంకటేశ్వర్లొక్కడ్నే పోటీ లేకుండా గెలిపిద్దామని విద్యార్థుల వూహ. కృష్ణమూర్తి

★ బుద్ధిచెప్పిన ఎన్నికలు ★

నిలబెట్టేసరికి పార్టీలు బయలుదేరాయి. పార్టీలు పడినప్పటినుంచీ వెంకటేశ్వర్లుకు పట్టుదల ఎక్కువైంది.

ప్రచారం జోరుగా సాగుతోంది. విద్యార్థుల యిళ్ళకు ప్రతిరోజూ అన్ని పక్షాలవారూ తెగ తిరిగేస్తున్నారు. ఎన్నికలు మూడు రోజు లున్నాయనగా కృష్ణమూర్తి, వాళ్ళ పార్టీవాళ్ళను వెంటపెట్టుకొని మా యింటికి వచ్చి నన్ను కేక వేశాడు. బయటకు వచ్చి చూస్తే అబ్బో! పెద్దపెద్ద తలలుగల ప్రముఖులంతా అక్కడ వున్నారు.

"మే మెందు కొచ్చామో తెలుసు ననుకుంటాను" అన్నాడు పార్టీలో ఒకడు. ఇంతలో కృష్ణమూర్తి అందుకొని "ఏమండోయ్. వాడు మీకు క్రొత్త గానీ, వాడికీ నాకూ వున్న స్నేహం ఈనాటిది గాదు. ఏదో మన విధిప్రకారం కనబడడానికి వచ్చాం గానీ, వాణ్ణి అడగాలటండీ," అంటూ నా చేతిలో ఏదో కాగితం పెట్టాడు.

వాడి ధోరణి చూచి పార్టీవాళ్ళలోనే యిద్దరు గుసగుసలాడుకొంటున్నారు. "మనవాడికి గూడా పట్టుబడిందే పద్ధతి" అని.

వాళ్లు వెళ్ళిపోగానే కాగితం చూద్దునుగదా! ఓహో! ఆర్టుపేపరుమీద కృష్ణమూర్తి ఫొటో వేయించేసి "కాలేజీ బాగుపడాలంటే, విద్యార్థులు తమ హక్కులు కాపాడుకోవాలంటే, కృష్ణమూర్తికే ఓటు వేసి గెలిపించండి" అని వ్రాసివుంది. ఆ ప్రచారపత్రం చూస్తే, మొత్తంమీద కృష్ణమూర్తి చేతి చిలుం బాగానే వదిలిందని తెలుస్తూంది.

కాలేజీలో పార్టీలు ప్రచారం గురించి చెప్పనే అక్కరలేదు. రోజులు దగ్గర పడుతున్నాయి. ఆ పుణ్యకాలం కాస్తా సమీపించింది. పోలింగు మొదలుపెట్టారు. కృష్ణమూర్తి ఆరోజు కాలేజీలోగానీ, ఎక్కడా గూడా కనిపించలేదు. తీరా నేను ఓటు చేయడానికి వెళ్ళాను. ఎంత వెదికినా మా కృష్ణమూర్తిగాడి పెట్టె కనిపించలేదు. తెల్లముఖంవేసి విధిలేక యింకో పెట్టెలో వేసి బయటికి వచ్చాక నోటీసుబోర్డు చూస్తే కృష్ణమూర్తి నామినేషన్ ఉపసంహరించుకున్నట్లు వుంది!

వాడి పార్టీవాణ్ణి ఒకణ్ణి పట్టుకొని అడిగాను "ఏమోయ్! కృష్ణమూర్తి విత్‌డ్రా చేసుకున్నాడట. ఎందుచేత ?" అని.

"ఏమోనండి. నిన్నటివరకూ బాగానే వున్నాడు. రాత్రి ఏం జరిగిందో ఏమో! తెల్లవారేసరికి ఈ పదవి నాకవసరం లేదంటూ కూర్చున్నాడు" అన్నాడు.

నా కొకటి తోచింది. ఇదివర కెప్పుడూ నే నేదైనా సలహాయిస్తే వాడు త్రోసి వెయ్యలేదు. ఆలోచించగా ఆలోచించగా నా హితబోధ వాడికి చివరికి తలకెక్కి వుంటుందనుకున్నాను. సాయంత్రం వెళ్ళి వాణ్ని కలుసుకున్నాను. రూములో ముసుగుపెట్టుకొని పడుకొనివున్నాడు. నేను గాబరాపడ్డాను. ఆదుర్దా ఆగక వాణ్ని నిద్రలేపాను. నన్ను చూచి ఏమీ ఆశ్చర్యం కనబరచకుండానే, వళ్లు విరుచుకొని "అలా కూర్చో," అన్నాడు కుర్చీ చూపిస్తూ.

"వంట్లో ఎలావుంది ?" అన్నాను.

"వంట్లోకేం ? బాగానేవుంది. ఒక నెల రోజులనుంచీ సరిగ్గా తిండీ, నిద్రా లేదురా !" అని పెద్దగా ఆవులించాడు. వాణ్ణి చూస్తే నా కాశ్చర్యం వేసింది. అంత ఆర్భాటం చేసినవాడు తన కేమీ తెలియనట్లు నిశ్చింతగా నిద్రపోతూవుంటే నిజంగానే ఆశ్చర్యం కలిగింది.

"అలా బయటికి వెళదాం వస్తావా ?" అన్నాను.

"పద!" అని పక్కమీదినుంచి లేచాడు. పీక్కుపోయిన వాడి కళ్ళు ఆ వైనం చూస్తే భోంచేసినట్లు లేదు. హోటలుకు తీసికెళ్ళి యిద్దరం సుష్టుగా భోంచేశాం.

వాడూ ఏదో ఆలోచిస్తున్నాడు. ఇది నా బోధఫలితమేనని నేను లోలోననే గర్వపడుతున్నాను. నడుస్తున్నాం యిద్దరమూను. సముద్రపు ఒడ్డు చేరుకొని చతికిలపడ్డాం. అప్పటికే అక్కడ జనసంచారం తగ్గిపోయింది. వెన్నెల వచ్చింది.

"నువ్వలా ఎందుకు చేశావురా ?" అన్నాను.

"పోనిద్దూ. వెధవది. అయిపోయిందేదో అయిపోయింది."

"నాతో గూడా చెప్పగూడదు గాబోలు."

"నీతో వచ్చిన చావే ఇది......"

"పోనీలే! నా కెందుకు చెపుతావురా నువ్వు?"

"అన్నావూ! అయితే విను" అని వాడు మొదలుపెట్టాడు.

"మా పార్టీవాళ్లు ఒక కార్యక్రమం తయారుచేశారు. అందులో ఆడపిల్లల యిళ్లకు వెళ్లడం చిట్టచివరకి వేశారు. దాని ప్రకారం బయలుదేరాం. నిర్మల తెలుసుగా! వాళ్ల యిల్లు ఊరిచివర. ముందుగా

గేట్ కీపర్:- ఇదేమిటి హాఫ్‌టికెట్ తీసుకువచ్చావ్... ఇంత పెద్దవాడివి... నీవయస్సెంతయ్యా?

అతను:- బాబూ! నా వయస్సు ముప్పైఏళ్లు. కానీ నాకు ఒక్కకన్ను లేదు. నేను అందరిమల్లే రెండు కళ్లతో సినిమా చూడలేను...

"మహేష్"

అందరం బయలుచేరి నిర్మల యింటికి చేరాం.

"అప్పటికి తొమ్మిది గంటలు దాటింది. ఆ వీధిలో మునిసిపాలిటీ దీపాలు ఉన్నా, అంతా చీకటిగానే వుంది. మేం వెళ్లేసరికి ప్రహరీగోడ తలుపులు తీసేవున్నాయి. ఆ ద్వారం దాటి ముందు కెళ్లాం. ఇంటి తలుపులు వేసివున్నాయి. కిటికీచువ్వల సందుల్లోనుంచి దీపపుకాంతి యివతలకొస్తోంది. బయటవరండాలో గేదెదూడ కట్టేసివుంది. ఇంటికి ముందు ఎడమప్రక్క గొడ్లచావిడల్లే వుంది, వాసన కొడుతోంది. వరండాలో రెండు మూడు గడ్డిమోపులు. గదంతా చెత్తతో కప్పివేసివుంది. మాలో ఒకడు కిటికీదగ్గర కెళ్లి లోపలకి తొంగి చూశాడు. ఒక అమ్మాయి, ఓ మగవాడు మాట్లాడుకొంటున్నారట. ఆమె పిల్లకు పాలిస్తూ వుందట.

"ఏవండీ" అని మెల్లిగా పిలిచాడు మావాడు.

ఆ అమ్మాయి అదిరిపడి "ఎవరు?" అంది. ప్రక్కనే వున్న వ్యక్తి మూలనున్న దుడ్డుకఱ్ఱ పట్టుకుని యుద్ధానికి సిద్ధమైన సైనికుడి పోజులో నిలబడ్డాడు. ఎవరన్నా లోపలికి వస్తే కఱ్ఱతో బుఱ్ఱ బ్రద్దలయేట్టు కొట్టడానికి సిద్ధంగా వున్నాడు.

ఆయన అవతారం చూచి మావాడు దడుసుకున్నాడేమో, కంఠం ఇంకొంచెం తక్కువస్థాయిలోకి తెచ్చుకొని "మేమేనండీ! ఒక్కసారి తలుపు తీయండి" అన్నాడు. వాడి గొంతు వణుకుతూవుందని తెలుస్తూనే వుంది.

"ఒక్క ఓటు పోతే పోయిందిలేరా - రండి పోదాం" అన్నాను నేను.

"నీకు తెలియదులే! ఇంతమాత్రానికే

వెళ్ళిపోతే మనం సంపాదించామే" అన్నాడు నా ప్రక్కతను.

"వీరంటే ఎవరికి తెలుసు? పేరు చెప్పు" అని గద్దించింది లోపల్నించి.

మేవండీ! కాలేజీ కుఱ్ఱాళ్ళం" అన్నాడొక పార్టీ వర్కరు.

"ఘుః! మీయమ్మ కడుపు మాడ" అని మెల్లిగా అనుకొని, బిగ్గరగా "ఎందుకొచ్చారు?" అంది.

"వెళ్ళిపోదాం పదండిరా!" అని చెబుదామనుకున్నాను గానీ, నా ప్రక్కతను "యిస్" అన్నాడు ముక్కుమీద వేలు వేసుకుని.

"మీ అమ్మాయితో కాస్త పనివుందండీ."

ఆమె కంఠం జోరుచేసి "మీపని మరీ ఆటగా వుందే? మాటమాటకీ ఎందు కిట్లా వస్తారు? ప్రొద్దున్నించి చూస్తున్నాం. కుక్కల్లాగా తిరుగుతున్నారు. యిప్పటి కిది మూడోసారి. మీకేం వేళాపాళా లేదూ? ఈ దఫా వచ్చారంటే మర్యాదగావుండదు ఏమిటనుకున్నారో. ఫోండి" అంది.

నా కప్పు డర్థమయింది. ఇంతకుముందే వెంకటేశ్వర్లు తరఫువాళ్ళు వచ్చి వెళ్లారని. ఆ మహాతల్లి వాళ్లే వీళ్ళని ఆ రెండూ మామీద దులిపింది. నా జన్మలో ఇంతవరకూ ఎవరివల్లా ఒక్క పల్లెత్తు మాటయినా పడలేదు. నా మిత్రులంతా ఏమీ పెద్ద అవమానం జరగనట్లే వున్నారు. అంటే అటువంటి చెణ్కొ తిన్న ఘటాలన్నమాట! ఒక్క ఓటుకే యింత రభసయితే, యిన్ని యిళ్ళు ఎలా తిరగడం? అందరూ యింతేగా? నా మనస్సు చివుక్కుమంది. ఛ! ఛ! ఇది నీచం, అనిపించింది.


మహాతల్లీ బుద్ధివచ్చేట్టు చేశారమ్మా! ఇంకా ఎంతోమంది యిళ్ళకు వెళదామనుకుంటున్నాం. మీ దంపతు లిద్దరూ మంచివాళ్ళుకనుక దేహశుద్ధి చేయలేదు. ఇంకెక్కడైనా అయితే అది తప్పదు. అని మనసులో అనుకొని ప్రెసిడెంటుపదవికి ఓ నమస్కారబాణం అర్పించి, మా వాళ్లెన్ని చెప్పినా యింకో యింటికి రానని చెప్పేసి రూముకొచ్చి ముసుగుపెట్టాను. తెల్లవారి లేచి కాలేజీకి వెళ్లి నా పేరు 'విత్‌డ్రా' చేసుకున్నాను" అని పూర్తి చేశాడు కృష్ణమూర్తి.

అయితే వీడు మారింది నావల్ల కాదన్న మాట! ఏమయితేనేం మళ్లీ కృష్ణమూర్తి మారినందుకు నాకు సంతోషం కలిగింది. "లేరా. సినీమాకు వెళదాం" అన్నాను, వాడేదో పెద్ద పరీక్ష ప్యాసయినట్లు.

*   *   *

పైన చెప్పిన విషయాలన్నీ ఎప్పుడో చిన్ననాటివి. బి. ఏ. పరీక్ష యిచ్చిన తరవాత కృష్ణమూర్తీ, నేనూ విడిపోయాం. అప్పటినుంచీ వాడెక్కడున్నాడో తెలుసుకోడానికి ప్రయత్నించినా వాడి జాడ దొరకలేదు.

ఇటీవల తాహసిల్దారుగా ఓ వూరు వెళ్లాను. ఒక లక్షాధికారి నాకు స్వాగత మిచ్చాడు. వాడే కృష్ణమూర్తి. భార్యతరఫున చాలా ఆస్తి వచ్చిందట. ఆ రాత్రి గ్రామస్థులు వచ్చి కృష్ణమూర్తిని పంచాయతీబోర్డు ప్రెసిడెంటుగా నిలబడమని ప్రాధేయపడుతున్నారు. కాని కృష్ణమూర్తి ఒక్కటే సమాధానం చెప్పాడు వాళ్ళకి: "నా జీవితంలో అలాటి ఛండాలపు పని ఎప్పుడూ చేయను"అని నావంక చూచాడు. వాళ్లు వెళ్లిపోయాక "ఇలా చేసింది నువ్వే కదురా!" అన్నాడు. ★



మహాబలేశ్వరం సమీపంలో ప్రతాపగఢంలోని భవానీదేవాలయ స్తంభాలు.

ఫొటో శ్రీ వి. ఆర్. సబ్నవీసు, బొంబాయి.

సాధించుకొన్న స్వాతంత్ర్యం

సరస్వతికి అందఱిమాదిరిగానే తల్లి తండ్రులున్నారు. అందఱి తల్లితండ్రులుమాదిరి గానే వాళ్ళూ ఆమెకు బాల్యంలోనే వివాహం చేశారు. రజస్వల కాంగానే కార్యం చేసి కాపరానికి పంపారు. అత్తా, ఆడబిడ్డల అదుపు ఆజ్ఞల్లో మెలకువగానే కాపురం చేస్తూవచ్చింది. కడుపున ఒకకాయకూడా కాచింది. అదృష్టవశాత్తూ అనుకోండి, లేదా దురదృష్టవశాత్తూ అనుకోండి ఆకాయ మగపిల్లకాయ. వాడి మూడోయేట సరస్వతికి వైధవ్యం ప్రాప్తించింది. కర్మకాండల తర్వాత, కానువాయి ప్రకారం ఓదార్చి ఆదరించి తిరిగి పంపిస్తామని చెప్పి పుట్టింటివారు తీసుకొచ్చారు. కొన్నాళ్ళయింతర్వాత సరస్వతిని అత్తవారింట దిగపెట్టి రావటానికి తండ్రి స్వయంగానే తల్లీ బిడ్డల్ని తీసుకెళ్లేడు. తీరావెళ్ళి గడపలో అడుగుపెట్టితే "వచ్చారా" అనేనాథుడు లేక పొయ్యాడు. వియ్యంకుడు చంగున లేచి ఉత్తరీయం వేసుకొని ఏదో ముంచుకొనిపోతున్నట్టు నిష్క్రమించాడు. వియ్యపురాలు ఏదో పని వున్నట్లుగా వంటింట్లోనే పాతుకుపోయింది. ఆడబిడ్డలు మూతి విరుచుకొని లోపలి కెళ్ళారు. కాని తలుపు సందుల్నుంచి చూడటం మాన లేదు. పిల్లవాడు "అత్తయ్యా" అంటూ

శర్మ

లోపలికెళితే విసిపించుకొన్న వాళ్ళూ లేరు. గుడ్లనీళ్ళు కుక్కుకొంటూ వాణ్ణి "ఇలారా నాయనా" అని పిలచి సందిట్లోకి తీసుకొంది. సరస్వతి తండ్రి ఉస్సురంటూ అలా చతికిలపడ్డాడు. బావగారూ, మరదులూ మరో దోవనే వీళ్ళని తప్పించుక తిరుగుతున్నారు. సాయంత్రం అయింది. సంజచీకటి పడ్డది. ఆలనాపాలనా లేదు. నిట్టూర్పుతో తండ్రి లేచి "ఇంకెందు కమ్మాయీ లే!" అని కూతురూమనమళ్ళతో తిరోధానుడయ్యేడు, అందఱికీ వినపడేట్టుగానే "నా బిడ్డ, నా మనమళ్లు నాకు బరువనుకొన్నారా" అంటూ.

కొన్నాళ్ళకేదో మాయదారి జబ్బొచ్చి సరస్వతి కొడుకుకూడా పోయినాడు. పొరుగింటి శాస్త్రులుగారి కెక్కడో పిల్లవాడి పితామహు డవుపించి ఇకిలిస్తూ "వాడు కూడా పొయ్యాట్టే" అన్నాట్ట. శాస్త్రుల్లుగారు జవాబిచ్చే లోపలనే పితామహుడు ఇకిలిస్తూనే అంతర్ధానమయ్యాట్ట.

* * *

సరస్వతి తండ్రి కూతురిపేర తన స్వార్జితములోనుంచే రెండెకరాల మాగాణిని సర్వహక్కులతో సరస్వతికి వ్రాసిచ్చేడు తన తదనంతరం కూడా సరస్వతి కేలోపం రాకుండా వుండేందుకు. కాని ఆ రోజు నుంచీ మటుకు ఇంట్లో పెద్దన్నయ్య తదితరులు మాత్రం అయినదానికీ కానిదానికీ, చెట్టుమీద పెట్టే పుట్టమీద పెట్టే చిర్రుబుర్రు మంటూండటం సాగించారు. అసలు సరస్వతి కూడా, మొదటే తండ్రి త్యాగాన్ని మందలించింది. "నాన్నా! నువ్వూ అన్నయ్యావాళ్లుంటూ వుండగా నాకేం లోపం అవుతుంద"ని. తండ్రి మాత్రం "నీకేం తెలియదు. చిన్నదానివి. నేనన్నీ ఆలోచించే చేశాను" అన్నాడు.

సరస్వతి తల్లికి మాత్రం ఈగోలే పట్టలేదు. అవిటిబొంగల్లా సరస్వతి వైధవ్యాన్నెలా శాస్త్రోక్తంగా సరిదిద్దాలా అనే. అందువల్ల ఆమె ఆసన్నాహంలోనే వున్నది. ఇక సరస్వతి తమ్ముడున్నాడు. ఇంటర్మీడియట్ చదువుతున్నాడు. సంస్కారప్రియుడు. అక్కగారి వైధవ్య దీక్షనుగూర్చి అమ్మ ప్రసంగం తెచ్చినప్పుడల్లా తమ్ముడు తల్లితో హోరాహోరిగా యుద్ధం చేస్తూనే వున్నాడు. చివరికి ఒకానొకరోజున సరస్వతి కేశఖండన ముహూర్తం ముంచుకొచ్చింది, ఆరోజున ఆయింట్లో-గాలి దుమారం రేగింది. ముఖ్యంగా తమ్ముడు కారణంగా. సరస్వతి మాత్రం పరిస్థితులని గమనిస్తూనే వుంది. కాని ఇంకా తమ్ముణ్ణి "ఎందుకురా నీకీ బెడద" అంటూ సూచనగా మందలిస్తూ వచ్చింది. తమ్ముడు పట్టు విడవలేదు. అమ్మతో ఘర్షణ ఎక్కువైంది. తండ్రి నాదేంలేదన్నట్టు అంటిముట్టని అగ్రహారంలా వూరొక్కన్నాడు. అన్నగారు పరిస్థితులింకా ముదరకపూర్వమే వుద్యోగరీత్యా దూరస్థుడయ్యేడు. ఇక అక్కగారి సముద్ధరణా భారమంతా తమ్ముడు తనమీద వేసుకొన్నాడు. ఇంతకూ తమ్ముడి పట్టుదలేమిటంటేఒకటి, కేశఖండన వల్లకాదని, రెండు, సత్వరం అక్కగారికి పునర్వివాహం జరిగి తీరాలనీ. ఆయింట్లో అలజడికి ముఖ్యంగా రెండవది కారణం. చివరికి అమ్మతో ఘర్షణ పెద్దదయింది. ఆ వ్రత కోపం ఆ ... చెయ్యిచేసికొన్నాడు. ఇక పట్టలేక సరస్వతి తమ్ముడికి అడ్డంవచ్చి ఉగ్రకాళిలా

"తమ్ముడూ! పో అవతలకిపో! ఊ..." అని ఆజ్ఞాపించింది. తమ్ముడు నిర్ఘాంత పోయి ఏదో చెప్ప ప్రయత్నిస్తున్నాడు.

"ఊహు. ముందు ఎవంగాపో. తర్వాత" అని తిరిగి గద్దించింది. అది అక్కగారు ఆజ్ఞాపిస్తున్నట్లనిపించలా. ఏదో స్త్రీశక్తి, పరాశక్తి ఆజ్ఞాపిస్తున్నట్లనిపించింది. వెనక్కి తగ్గాడు, గతుక్కుమంటూ.

"ఛీ మూర్ఖుడా! ఇదా నీ ప్రయోజకత్వం. అమ్మమీదనా నీ తిరుగుబాటూ... సిగ్గు లేదు. కళ్ళంటూవుంటే చేసిందానికి కళ్లు బొత్తలు పడేట్టు ఏడు" అంది.

"అది కాదే అక్కయ్యా!...స్త్రీ..." అని తమ్ముడేదో చెప్పబోతున్నాడు. తిరిగి సరస్వ తందుకొన్నది. "ఆఁ. తెలుసు... నేటికొక్కగా నీ అక్క విధవయ్యిందిగదా అని ఇదే సమయం ప్రపంచానికి నీవుకూడా ఒక సంఘసంస్కర్తనని చాటుకొందామని" అంతేనా అని గద్దించింది.

"చాటుకొందామని కాదక్కయ్యా... నన్ను అపార్థం చేసికొన్నావు..." అని బావురుమన్నాడు. తిరిగి యిలా ప్రారంభించింది సరస్వతి. "కాకపోతే మరేమిటి. స్త్రీస్వాతంత్ర్యం గూర్చి నీ అపోహలు... యుగయుగాలుగా పురుషుడు నిర్ణయించిన అదుపు ఆజ్ఞల్లోనే మెదులు కొంటూ వచ్చింది స్త్రీ. తీరా స్వాతంత్ర్యం కావాల్సిన సమయంలో కూడా ఆ స్త్రీ స్వాతంత్ర్యం అంటే ఏమిటో పురుషుడే నిర్ణయించాలా. పురుషుడే నిర్ణయించిన స్వాతంత్ర్యమే స్త్రీ నెత్తిపై రుద్దబడాలా? దానికి స్త్రీ యిష్టాయిష్టాలతో సంబంధం లేదా? స్వాతంత్ర్యంకూడా పురుషులు నిర్ణయించినదే, బలవంతాన స్త్రీకి కట్టపెట్టాలా? ఇదే నా స్వాతంత్ర్యం. స్త్రీకి ఏ పరిస్థితుల్లో ఏ స్వాతంత్ర్యం కావాలో స్త్రీనే నిర్ణయించుకోనియ్యి. అందుగాను కావాల్సింది స్త్రీకి అవకాశం అంతే. అర్థమయ్యిందా? యిప్పటికయినా..." అని గర్జించింది. తమ్ముడు కిక్కురుమనకుండా మేకపిల్లలా అప్పటికి అక్కడనుంచీ తప్పుకొన్నాడు. నీరసంగా, అక్కగారికిమరిముఖంచూపలేక.

అంతే సరస్వతి కాళీరూపం ఏమయిందో తెలియదు. తిరిగి స్త్రీరూపం దాల్చింది. కాదు తల్లిముందు బిడ్డ రూపం తాల్చింది. తల్లికాళ్ళమీద పడ్డది విలవిలా ఏడుస్తూ.

"అమ్మా! నువ్వూ స్త్రీవేకదా విధవనయినంత మాత్రాన నన్ను స్త్రీకి యితరమయిన ప్రాణినిగా చూస్తావెందుకు. స్త్రీజాతిపై స్త్రీకే అందులోనూ కన్నబిడ్డపై కన్నతల్లికే సానుభూతీ అంతఃకరణా నశించిందా? ఒక్కటడుగుతాను చెప్పు. ఆడదానికి అందులోనూ మన భారతస్త్రీకి ఆఖరు ప్రాణం, ప్రాణాల్లోకల్లా ప్రాణం తనతల నీలాలేగద. వాట్నికూడా తెంపేస్తావా. నన్నిలాగూడా బ్రతకనియ్యవా? ఆయన పోయారు. వాడుకూడా పోయాడు...... వీట్నన్నా వుండనియ్యవా?... నా ప్రాణాల్ని నిలువునా తీసేస్తావా?...నిజంగా నీకు తీసెయ్యాలనిపించిందా. అంత వెక్కసమైనయ్యా అవ్వి...నిజం చెప్పు...నలుగురికీ జడిసి కాదు నువ్వు తలపెటింది.. నలుగురికోసమై నన్ను బలిచేస్తావా...... అమ్మా...అమ్మా...అమ్మవు కాదూ?... నువ్వు నా తల్లివి కాదూ" అని బావురుమని అమ్మని కౌగిలించుకుంది. అంతే ఆ తల్లీ బిడ్డల హృదయాలు ఏ వేవో అంతర్యాన్ని కలుపుకొని ఏకమైనాయి. "లేదమ్మా లేదు. ఇకెప్పుడూ తలపెట్టను. నువ్విలాగైనా బతికి బావుంటే నాకదే పదివేలు. వస్తు. ఏడవకు...మరింకొద్దు" అంటూ బిడ్డను తన గుండెలకు హత్తుకొన్నది. ★



విజ్ఞానవీధులు

"డాక్టర్"



135. దేవాలయాల్ని దేవతలు కట్టేరా?

ప్రతీ పురాతన దేవాలయమూ దేవతలు కట్టినదే నంటాయి స్థలపురాణాలూ, జనశ్రుతులూనూ. ఈపుకారులు దేవాలయానికి వెళ్ళేభక్తులకు దేవాలయమును కట్టిన శిల్పులమీదా, ఆ శిల్పాల సౌందర్యముమీదా, ఆ దేవాలయ శిల్పముమీదా దృష్టిపడి దేవుని మీద భక్తితగ్గుతుందన్న సంకోచముతో పెద్దలు కల్పించినవేకాని నిజము కానేకాదు. దేవాలయాలన్నీ ఎవరో మానవ శిల్పులు ఏదోకాలములో కట్టినవే. సాధారణంగా దేవాలయ గర్భగృహ ద్వారబంధము మీదగానీ, గర్భగృహానికి ముందున్న మండప ద్వారబంధము మీదగాని ఆదేవాలయమును కట్టించినవారి శాసనాలుంటాయి. వాటిని బట్టి తెలుస్తుంది ఎవరు కట్టించేరో. జగన్నాథములోనూ సింహాచలములోనూ కళింగదేశమును 11 వ శతాబ్దములో ఏలిన అనంతవర్మ చోడగంగ దేవుని శాసనాలున్నాయి. మైసూరు రాష్ట్రములోని దొడ్డగద్దవల్లి, హాళేబీడు దేవాలయాలూ; తంజావూరు బృహదీశ్వరాలయమూ; కంచికైలాసనాథ, వైకుంఠ పెరుమాళ్ళు దేవాలయాలూ; ఏ రాజులు కట్టించారో తెలిపేశాసనాలున్నాయి. ఈ శాసనాల్ని బట్టి చరిత్రపరిశోధకులు ఆలయాల నిర్మాణమీయీ సంవత్సరాలలో పూర్తి అయిందని పట్టిక వెయ్యగలరు.

శాసనాలు కొన్ని దేవాలయాల్లో దొరకకపోవచ్చును. అలాంటప్పుడు ఎవరు కట్టించారో తెలుసుకోడానికి కొన్ని దేవాలయాలకి మట్టుకు వాటిపేరు సహాయము చేస్తుంది. కళింగదేశానికి గాంగరాజుల కాలంలో రాజధాని అయిన ముఖలింగనగరములో అణ్యాంక భీమేశ్వరాలయము అని ఒక దేవాలయమున్నది. అది 'అణ్యాంక భీము'డనే రాజు కట్టించినది. శాసనాలు పరిశీలిస్తే, మలయ గొంటీశ్వరాలయము, రాజనారాయణాలయమూ, భీమేశ్వరాలయమూ అన్నవి వాటిని కట్టించిన రాజుల పేర్లు తెలుపుతాయనీ తెలుస్తుంది. చామర్లకోటలోని చాళుక్య భీమేశ్వరాలయమూ, దాక్షారామ భీమేశ్వరాలయమూ, గుణుపూడి భీమేశ్వరాలయమూ ఒకేకాలములో కట్టించబడ్డ దేవాలయాలు. చామర్లకోట రాజనారాయణాలయము రాజనారాయణుడన్న బిరుదుగలిగిన కులోత్తుంగుడు కట్టించినది కాబోలు.

శాసనాలూ, పేర్లూ కూడా సాయపడకపోతే ఆ దేవాలయ శిల్పాకారమును బట్టి నిర్మాతలెవరో చెప్పవచ్చును కొన్ని సందర్భాలలో. ముఖలింగమూ, భువనేశ్వరమూ జగన్నాథమూ దేవాలయాలు పొడుగైన రథము ఆకారములో చిన్న చిన్న మెట్లు మెట్లుగా ఉండేరూపంతో 11, 12 శతాబ్దాల కళింగుల శిల్పాన్ని చూపిస్తాయి. చేజెర్ల కపోతేశ్వరాలయమూ, మహాబలిపురపు భీమరథమూ, గణేశరథమూ తిరువొత్తియూరు త్యాగరాజస్వామి ఆలయమూ గజపృష్ఠాకార శిఖరాలతో బౌద్ధ చైత్య శిల్ప ప్రభావాన్ని చూపిస్తాయి. మహాబలిపురపు అర్జున ధర్మరాజరథాలూ, కంచి కైలాసనాథ, వైకుంఠ పెరుమాళ్ ఆలయాలూ రాజసింహుడనే బిరుదుగలిగిన నరసింహపల్లవుని కాలములో కట్టబడి రాజసింహ శిల్పానికి ఉదాహరణాలుగా ఉన్నాయి.

తంజావూరూ, గంగైకొండచోళపురమూ, ధారాసురమూలోవున్న పెద్ద ఆలయాలు గర్భగుడిమీద చాలా ఎత్తైన శిఖరాలు కలిగి, చోళరాజుల ఆలయ నిర్మాణపద్ధతిని తెలుపుతాయి. పక్షితీర్థపు వేదగిరిమీది ఆలయపు ఆకారమూ ఇదే. అది చోళులు కట్టించినదే. మైసూరు రాష్ట్రములోని హొయిసాల దేవాలయాలు నక్షత్రాకారపు పునాదులతోనూ, మూడు గదుల గర్భగృహముతోనూ, ద్వారబంధము మీది గజలక్ష్మితోనూ, పై పలికిన వర్తులాకారపు నాట్య మండపములోనూ హొయసాలుల శిల్పాన్ని దృష్టాంతీకరిస్తున్నాయి. ఇలాంటి లక్షణాలే చూపించే కాకతీయుల దేవాలయాలూ, గోదావరీగర్భములో నిపటిస దేవాలయమూ, పిఠాపురపు కుక్కుటేశ్వరాలయమూ కాకతీయుల కాలములో నిర్మాణమై యుంటాయని చెప్పవచ్చును. హనుమకొండ పద్మాక్షి ఆలయమూ, వరంగల్లు కోటలోని స్వయంభూ దేవాలయమూ, హంపీ విరూపాక్షుని పక్కన వున్న ఆలయాలూ జైన సంప్రదాయపు ఆలయాలు, దేశంలోని చిన్నచిన్న ఆలయాల శిల్పాన్ని పరిశీలించుకుని అది ఏయే సంప్రదాయాల సమ్మేళనమో తెలుసుకోడము మంచిసాధన.

136. క్షీరమాపకం ఎట్లు పనిచేస్తుంది?

ప్రతివస్తువుకీ కొంత బరువుంటుంది. ఒక ఘనపు సెంటిమీటరు పరిమాణం (ఆయతనం)గల వస్తువు తూగే బరువును దాని సాంద్రత (*Density*) అంటారు.

ఒడ్డూ పొడుగూ, ముఖంతీరూ కంఠస్వరమూ మున్నగునవి ఒక వ్యక్తియొక్క వ్యక్తిత్వాన్ని యేవిధంగా తెలియజేస్తాయో ఆ విధంగానే వస్తు సాంద్రత ఆవస్తువు యొక్క వ్యక్తిత్వాన్ని నిరూపిస్తుంది. సృష్టిలో స్వచ్ఛమైన ప్రతివస్తువుకీ నిర్దిష్టమైన కొంత సాంద్రత ఉంటుంది. ఉదాహరణకు నీటిసాంద్రత ఒక ఘనపు సెంటీమీటరుకు ఒక గ్రాము; పాదరసం సాంద్రత ఒక ఘనపు సెంటిమీటరుకు 136 గ్రాములు; బంగారం సాంద్రత ఘనపు సెంటిమీటరుకు 19.5 గ్రాములు. అట్లే మిగిలిన వాటిసాంద్రతలు కూడా ఉంటాయి.

నీటిలో కొంత తేలుతుందన్న విషయం అందరికీ తెలిసిందే. కొంతే కాదు, నీటి


కంటె తేలికయైన వస్తువులన్నీ నీటిలో తేలతాయి. తక్కువ సాంద్రత గల వస్తువులు తమకంటె యెక్కువ సాంద్రతగల ద్రవాలలో తేలతాయని యీ విషయం నిరూపిస్తుంది. ఏదైనా ఒక వస్తువు ఒక ద్రవంలో తేలియున్నపుడు, దానిలో కొంతభాగం ఆ ద్రవంలో మునిగియుంటుంది కదా! ఆ విధంగా ద్రవంలో తేలే వస్తువు యొక్క మునిగియున్న భాగ పరిమాణం అది తేలియున్న ద్రవసాంద్రతనుబట్టి ఉంటుంది. వస్తువు ఏ ద్రవంలో తేలుతుందో ఆ ద్రవసాంద్రత హెచ్చినకొద్దీ వస్తువు యొక్క మునిగేభాగం తగ్గుతుంది. ఈ సూత్రాన్ని ఉపయోగించే క్షీరమాపకాన్ని (*Lactometer*) పరికల్పించేరు.

క్షీరమాపకాన్ని సామాన్యంగా గాజుతో తయారుచేస్తారు. దీనిలో ఒక గొట్టం, ఆ గొట్టానికొక చివర అతుకబడి సమాన మందంగల సన్నని పొడుగైన కాడ, గొట్టానికి రెండో చివర చిన్నబుడ్డి ఉంటాయి. క్షీరమాపకం పాలలో నిట్టనిలువుగా తేలడానికిగాను బుడ్డిని బరువైన ద్రవ్యంతో-సీసపు గుళ్లతోనో, పాదరసంతోనో - నింపుతారు.

క్షీరమాపకం కాడపైని *M*, *W*. అనే రెండుగుర్తులుంటాయి *M*. అనే గుర్తు క్షీరమాపకం స్వచ్ఛమైన పాలలో ఎంతవరకు మునుగుతుందో తెలియచేస్తుంది. క్షీరమాపకం నీటిలో ఎంతవరకు మునుగుతుందో *W* - అనే పైగుర్తు విదితపరుస్తుంది. ఈ రెండుగుర్తులను వాస్తవంగా స్వచ్ఛమైన పాలలోనూ, శుద్ధజలములోనూ వేర్వేరుగా క్షీరమాపకాన్ని ఉంచి, ఏర్పాటుచేస్తారు. ఈ రెండుగుర్తులకు మధ్యగా మరికొన్ని గీతలుంటాయి. వాటి సాహాయ్యంతో పాలలో ఎన్ని నీళ్ళు కలిసేయో తెలిసికోవచ్చు.

క్షీరమాపకాన్ని ఉపయోగించి పాలు నీళ్ళపాలో మంచిపాలో తెలిసికొందుకై క్షీరమాపకాన్ని శుభ్రంగా కడిగి మనం పరీక్షచేయ నెంచిన పాలలో దానిని నిట్టనిలువుగా వదలాలి. పాలగిన్నె అంచులకు గాని, అడుగుకుగాని తగలకుండా క్షీరమాపకము స్వేచ్ఛగా పాలలో తేలియాడేటట్లు చేసి, అప్పుడది ఏగుర్తువరకు పాలలో మునిగియుందో చూడాలి. కాడమీద అడుగుననున్న *M* గుర్తువరకు క్షీరమాపకము మునిగియుంటే ఆపాలు నీళ్ళు కలియని స్వచ్ఛమైనపాలనీ, అంతకంటె ఎక్కువగా మునిగితే అవి నీళ్ళపాలనీ, మనం గ్రహించవచ్చు.

కల్తీలేనిపాలకు నిర్దిష్టమైన సాంద్రత



ఉంటుంది. పాలసాంద్రతకంటె నీటి సాంద్రత తక్కువకాబట్టి పాలలో నీటిని చేర్చినకొద్దీ ఆ నీళ్ళపాల సాంద్రత తగ్గుతుంది. అందుచేత పాలలో కలిపిన నీరు హెచ్చినకొద్దీ, ఆ నీళ్ళపాల సాంద్రత తదనుగుణంగా తగ్గడంవలన క్షీరమాపకం నీటిలో ఎక్కువ లోతుకు మునుగుతుంది. ఈ విధంగా క్షీరమాపకం దాని కాడమీదనున్న ఏగుర్తువరకు పాలలో మునుగుతుందో ఆగుర్తునుబట్టి ఆపాలలో ఎన్ని నీళ్ళుకలిసేయో చెప్పవచ్చు.

పాలలో కలిపిన నీటి మొత్తాన్ని క్షీరమాపక సాహాయ్యాన్నికూడా కనుక్కోడానికి సాధ్యంగాని సందర్భాలు కొన్ని లేకపోలేదు. పచ్చిపాలలో వెన్నను తీసి ఆ పాలను కొంతమంది అమ్ముతారు. పాలసాంద్రతకంటె వెన్నసాంద్రత సాపేక్షంగా తక్కువ. అందుచేత వెన్న తీసిన పాలు స్వచ్ఛమైన పాలకంటె ఎక్కువ సాంద్రతను కలిగిఉంటాయి. కాబట్టి గుత మొత్తం నీటిని అట్టిపాలలో చేర్చినప్పటికీ ఆ విషయాన్ని క్షీరమాపకంతో కనిపెట్టడం సాధ్యంకాదు.


కొందరు, స్వచ్ఛమైన పాలలో నీళ్ళను కలిపి, కొద్దిగా పంచదారను ఆ పాలలో వేస్తారు. పంచదార సాంద్రత పాలసాంద్రతకంటె ఎక్కువ కావడంవలన, పాలలో నీటిని కలుపగా తగ్గిన సాంద్రత పంచదారకు చేర్చడంవలన భర్తీ అవుతుంది. అట్టిపాలు పైకి పల్చగా కనపడినా, క్షీరమాపకంతో పరీక్షించినప్పుడు, కల్తీలేని స్వచ్ఛమైన పాలు చూపించేగుర్తునే చూపిస్తాయి.

అనంత్.

చిట్టిప్రశ్నలకు జవాబులు

—ఇంతవరకూ భూమిమీదపడి మనకు లభించిన ఉల్కలలో రోబర్టు పియరీ గ్రీన్‌లాండులోని మెల్విలీ అఖాతమునుంచి తెచ్చిన ముప్ఫయి అరున్నర టన్నుల ఉల్క పెద్దది.

—సూర్యుడూ, చంద్రుడూ కూడా (మన భూమిలాగే) తమచుట్టూ తాము తిరుగుతున్నారు. సూర్యుడు సుమారుగా నాలుగు వారాల కొకమాటు ఆత్మప్రదక్షిణము చేస్తున్నాడు. చంద్రుడు కూడా అంతే కాలములో ఆత్మప్రదక్షిణము చేస్తున్నాడు. కాని నెల్లాళ్ళలో చంద్రుడు భూమిచుట్టూ తిరిగివస్తున్నాడు. కనక చంద్రుడిపార్శ్వము అదే కనబడుతూంటుంది మనకి. సూర్యుడు 'భూమిచుట్టూ తిరిగి వచ్చినట్టు కనబడడానికి ఏడాది పట్టుతుంది. కనక సూర్యుడు ఆత్మప్రదక్షిణము చేసుకుంటూన్నట్టు సూర్యుని మచ్చల గమనమువల్ల తెలుస్తుంది. ★




D.G.RAJ

బొమ్మరిల్లు

విలువైనది

శ॥ కోటి

★

ఒకరోజున బడిపంతులు
చెట్టుయొక్క భాగాల్లో
విలువైనది ఏదంటూ
ఒక్క ప్రశ్న వేశారు.

సందేహము తీర్చుకోగ
నేను చెట్టు చెంత కేగి
ఈలా ప్రశ్నించాను.

"కొమ్మ కొమ్మ కుసుమించిన
పరిమళ పుష్పము లారా!
మీా విలు వెంతమ్మా?"

పూవులు:-

"ఎంతని మేం చెప్పగలం?
వనితల జడ మలుపులలో
నిక్కి నీల్గి కూచుంటాం
ఎంతైనా వెచ్చించి
వనితలు మము కొంటారు"

"గుత్తులుగా వ్రేలాడే
చక్కని ఓ ఫలములార!
మీా విలువెంతండీ?"

ఫలములు:-

"ఎంతని చెప్తామోయీా?
మేము చెంత లేకుండ
ఈ మహిలో ఏ రాజో
పుష్టిగ భోంచేసేది?
ఇంతేమిటి, అంతేమిటి
ఎంతైనా ఖర్చుపెట్టి
మమ్ముల గొనిపోతారు."

"చెట్టంతా చిగురించిన
లేయాకుల గుంపులార!
మీా విలు వెంతయ్యా?"

ఆకులు:-

"ఎంతని చెప్తాం, భాయి?
విలువంటూ మాకు లేదు.
మేకల కాహారం, మేం
గొల్లవారు మేకలకై
కాసు ఖర్చు లేకుండా
మము త్రుంచుకుపోతారు.

గొల్లచేత చిక్కకుంటె
మధ్యాహ్నపు బాటసారికి
నీడనిచ్చి, జోలపాడి
సేద దీర్చి పంపిస్తాం
కృతజ్ఞతను చెప్పకుండ
బాటసారి లేచిపోవు!"

వడివడిగా నేను పోయి
మా పంతులుగారితోటి
"చెట్టుయొక్క భాగాల్లో
విలువైనవి ఆకు" లంటు
సమాధాన మిచ్చిన విని
ఆకతాయి కుర్రవాళ్లు
గొల్లున నవ్వేశారు!

సుప్రియ

బుద్ధభగవానుడు ధర్మచక్ర ప్రవర్తనమునకు పూనుకొన్న కాలంలో కాశీలో సుప్రియుడుఅనే ఆయన భగవానునిపట్ల మహాభక్తి గల ఉపాసకుడుగా వర్తిల్లుతూ వుండేవాడు. ఆయన భార్యకూడ బుద్ధ భగవానునియందు మహాభక్తి నెరపుతూ ఉపాసకురాలుగా ప్రసిద్ధి పొందింది. ఆమెపేరు సుప్రియ. ఈ భార్యాభర్తలిద్దరు శ్రద్ధాళువులు. దాతలు. బౌద్ధసంఘానికి సేవకులు; ధర్మాత్ములు.

ఇట్లావుండగా బుద్ధ భగవానుడు భిక్షుకసంఘంతో సహా రాజగృహం నుంచి ధర్మప్రచారం చేసుకుంటూ వారణాసికివచ్చి, ఋషిపతన మృగదావ నామకమైన ఆరామంలో విడిది దిగారు. ఈ మృగదావంలో బౌద్ధ భిక్షువులకు వసతులూ అవీ అప్పటికే ఏర్పడివున్నాయి. బుద్ధ భగవానుడుభిక్షుకసంఘంతో మృగదావంలో దిగిన అనంతరం ఒక రోజున సుప్రియ ఈ ఆరామానికి వచ్చింది. వచ్చి ఒక విహారంనుంచి మరో విహారం, ఒక పరివేణంనుంచి మరోపరివేణం తిరిగి, భిక్షువులను కుశల ప్రశ్నాదికాలతో గౌరవిస్తూ, "అయ్యా! మీలో ఎవరన్నా రోగులు వున్నారా? మీకు ఏమి కేమి కావాలి?" అంటూ వారిని సత్కరించింది.

ఆసమయంలో ఒక భిక్షువుకు జబ్బుచేసింది. పథ్యం పుచ్చుకోవాలి. మాంసంతో పథ్యం తినాలని అతనికి అనిపించింది. అనిపించి సుప్రియతో "భగినీ! నేను పథ్యం పుచ్చుకోవలసి వుంది" అని చెప్పాడు. "అట్లాగా! అయ్యా! సరే తెస్తాను" అని అతనిని సమాశ్వాసించి, సుప్రియ ఇంటికెళ్లిపోయింది.

శ్రీ జి. సాంబశివరావు

ఇంటికి వెళ్లి దాసీని పిలిచి "ఒసే! బజారుకి వెళ్లి ఇవ్వాళ్ల సిద్ధం చేసిన మాంసం తీసుకురావే" అని డబ్బులు ఇచ్చి పంపింది. దాసీది బజారు అంతా తిరిగిందిగాని, ఆరోజుకు ఆరోజున కోసిన మాంసం బజారులో ఎక్కడా దొరకలేదు. ఇంటికి తిరిగివచ్చి తన యజమానురాలి వద్దకు వెళ్లి "అమ్మా! బజారంతా తిరిగాను గాని ఇవ్వాళ్ల కోసిన మాంసం ఎక్కడా దొరకలేదు" అని చెప్పింది. సుప్రియ ఆలోచనలో పడిపోయింది. ఆమె మనస్సులో ఇట్లా అనిపించింది "రోగియైన ఆభిక్షువుకి పథ్యం సమకూరుస్తానని మాట ఇచ్చాను. పథ్యం తినిపించకపోతే రోగం ముదురుతుంది. ఏమి జరిగినా జరుగుతుంది. అదీకాక నేను అతనికి మాటఇచ్చాను. మాటను చెల్లించకపోతే ధర్మాన్ని తప్పినట్లు అవుతుంది. అందుచేత ఇచ్చిన మాటను ఇచ్చినట్లు తీర్చుకోవాలి."



ఈవిధంగా మనస్సులో అనుకొని, ఒక నిశ్చయానికి వచ్చి, ఇంట్లో మాంసాన్ని నరికే కత్తి వుంటే,

సుప్రియ

దాన్ని పుచ్చుకొని, తన తొడను కోసి, మాంసాన్ని తీసి, దాసీ దాన్ని పిలిచి "దాసీ! ఈమాంసాన్ని తీసుకువెళ్లి, వండి మృగదావ ఆరామంలో వున్న విహారానికి పోయి, అచ్చట ఫలానాచోట ఫలానా రోగి భిక్షువు, వున్నాడు. అతనికి ఇచ్చి తిరిగిరా. సుప్రియ రాలేదేమి, అని అడిగితే జబ్బుగా వుందని చెప్పు" అని ఆమాంసాన్ని దానికి ఇచ్చి, తయారుచేయించి, ఆభిక్షువుకు పంపించింది.

2

సుప్రియ భర్త సుప్రియుడు ఇంటికి వచ్చాడు. ఆలోపలే సుప్రియ తొడలకు కట్లు కట్టుకొని, బాధతో గదిలోకివెళ్లి పడుకుంది. "సుప్రియా నువ్వు ఎక్కడ" అంటూ సుప్రియుడు పిలిచాడు. సుప్రియకు బాధలో ఆమాటలు విన్పించలేదు. సుప్రియుడు, భార్య సుప్రియ ఎక్కడ పడుకొనివుందో అక్కడకు వెళ్లాడు. ఆమె పడుకొని వుండటం చూచి "ఏమి పడుకున్నావు" అని ప్రశ్నించాడు. "జబ్బుగా వున్నదని" సుప్రియ జవాబు చెప్పింది. "ఏమి జబ్బు" అని సుప్రియుడు అడిగాడు. దానితో ఆమె ఈజరిగిన సర్వవృత్తాంతాన్ని తన భర్తకు నివేదించింది.

సుప్రియుడికి భార్యయొక్క ఈ మహాత్యాగశీలత, ఈమహాధార్మికత ఆశ్చర్యాన్ని కలిగించాయి. అద్భుతంపడజేశాయి. "ఆశ్చర్యం! సుప్రియ! ఆశ్చర్యం! అద్భుతం! సుప్రియ! అద్భుతం! నీవు మహా శ్రద్ధాళువవు! సుప్రియా! నీవు మహాశ్రద్ధాళువవు. ఇచ్చినమాటను పాలించే నిమిత్తం రోగిఅయిన భిక్షువును ఉద్ధరించే నిమిత్తం స్వశరీర మాంసాన్ని కోసి ఇచ్చావా! అహో! ధర్మం" అంటూ సంతోషాన్ని ప్రకటించి భగవానుడైన బుద్ధుడు ఎక్కడ వసతిచేసి వున్నాడో, అక్కడకు వెళ్లాడు.

3

సుప్రియుడు భగవానుడు విడిది చేసివున్న చోటికి వెళ్లి, అభివాదనంచేసి, ఒక ప్రక్కగా ఉపస్థితుడై, భగవానుడైన బుద్ధుణ్ణి ఈవిధంగా అర్థించాడు. "భగవానుడా! మీరు భిక్షుసంఘంతో సహా మాయింట్లో రేపు భిక్షను గ్రహించాలి" అని.

బుద్ధ భగవానుడు మౌనంతో సుప్రియుని ప్రార్థన స్వీకరించారు. భగవానుడు తన ప్రార్థనను మన్నించినారని తెలుసుకొని సుప్రియుడు కూర్చున్నచోటినుండి లేచి, భగవానునికి భక్తితో ప్రదక్షిణలు చేసి ఇంటికి వెళ్లిపోయాడు. ఆరాత్రి ప్రొద్దుపోయేదాక కూర్చుని, బుద్ధభగవానునికి, భిక్షుకసంఘానికి ఏమి యేమి, పదార్థాలు చేయిస్తే బాగుంటుందో, ఆలోచించి, నిశ్చయించి, ఆవిధంగా ఆయాపదార్థాలు ఉత్తమంగా తయారుచేయవలసిందిగా ఆజ్ఞలు ఇచ్చి, తెల్లవారగనే, వంటలు పూర్తిఅయినట్లు తెలుసుకొని, భగవానుడైన బుద్ధుడు వున్నచోటికి వెళ్లి, "భగవానుడా! భోజనాలకు లేవవచ్చు. సర్వం సిద్ధమైవుంది" అని భిక్షకు ఆహ్వానించి వచ్చాడు.

4

అపరాహ్ణం అయింది. బుద్ధ భగవానుడు భిక్షుకసంఘంతో సహా సుప్రియుని యింటికి భిక్షకు వచ్చాడు. సుప్రియుడు భిక్షుకసంఘ సహితుడైన బుద్ధునికి స్వాగతంఇచ్చి అందరిని ఉచితాసనాలమీద కూర్చోనమని అర్థించాడు. అంతా కూర్చున్నారు. సుప్రియుడు భగ వానునిప్రక్క శ్రద్ధాళువై భక్తి వినమ్రభావాలు ఉట్టిపడగా నుంచున్నాడు. భగవానుడైన బుద్ధుడు ఇటూ అటూ చూచాడు. సుప్రియ కన్పించలేదు. "సుప్రియుడా! సుప్రియ యేది?" అని భగవానుడు ప్రశ్నించాడు. "భగవానుడా! సుప్రియకు సుస్థిగా వుంది" అని సుప్రియుడు సమాధానం ఇచ్చాడు. అయితే ఏమి! ఆమెనుగూడా ఓపిక చేసుకొని వచ్చి ఇచ్చట కూర్చోమను" అని భగవానుడు సుప్రియునితో అన్నాడు. "భగవానుడా! ఆమె వచ్చేస్థితిలో లేదు, అని సుప్రియుడు జవాబు చెప్పాడు." "అయితే చేతులతో పట్టుకొని నెమ్మదిగా తీసుకురా" అని భగవానుడు శాసించాడు.

సుప్రియుడు వెళ్ళి, సుప్రియను చేతులమీద వేసుకొని తీసుకు వచ్చాడు. సుప్రియ భగవానుణ్ణి చూచింది. ఆమెకు పట్టలేని ఆనందం కల్గింది. ఆమె మనస్సు భక్తితో నిండిపోయింది. ఆమె

హృదయం ధర్మభావంచేత వివశమైంది. ఆమె సర్వశరీరం భక్తిచే కల్గిన పారవశ్యంతో ఉజ్వలంగా ప్రకాశించింది. తాను భిక్షువుకు తొడలో మాంసాన్ని కోసి ఇచ్చిన కారణంగా ఏర్పడిన గాయం దాని అంతట అది ఆక్షణంలో నయం అయిపోయింది. విచిత్రంగా నయమైన గాయంమీద చర్మం ఏర్పడింది. ఈ అద్భుతానికే ఆశ్చర్యపోతున్న సుప్రియకు, ఆస్థానంలో తిరిగి మామూలుగా లోమసముదాయం జనించడం కూడా అనుభూతమైంది. "తథాగతుడా! నీ దివ్యశక్తి అద్భుతమైంది. నీమహానుభావత దివ్యమైంది. నీదర్శన మాత్రం చేతనే గాయం నయమైంది. చర్మం మొలిచింది. ఇది మహాశ్చర్యం. ఇది మహాద్భుతం అని సుప్రియ భగవానుని మహానుభావత్వాన్ని నుతించింది.

అంతా హర్షసంభరితులైనారు. బుద్ధుడు భిక్షుకసంఘంతో సహా భిక్షను స్వీకరించి మృగదావం చేరుకున్నాడు. భిక్షువుల నందరిని సమావేశపరిచాడు "మీలో ఎవరు సుప్రియను మాంసం తెచ్చిపెట్టమని అడిగారు" అని ప్రశ్నించాడు. ఏ భిక్షువు సుప్రియను మాంసం తెచ్చిపెట్టవలసిందిగా కోరాడో, ఏ భిక్షువుకు సుప్రియ బజారులో ఎక్కడా తాజామాంసం దొరకని కారణంచేత తన శరీరాన్ని కోసి మాంసాన్ని తయారుచేసి పంపించిందో, ఏభిక్షువు అది ఏమి మాంసమో తెలియకుండా కూడా భుజించాడో, ఆభిక్షువు ముందుకు వచ్చి, "భగవానుడా! నేను సుప్రియను మాంసం తెచ్చి పెట్టమన్నాను" అని జవాబు చెప్పాడు.

"సుప్రియ మాంసాన్ని పంపించిందా!"

"పంపించింది"

"నువ్వు తిన్నావా?"

"తిన్నాను"

"అది ఏమి మాంసమో తెలిసే తిన్నావా?"

"తెలియదు! భగవాన్! తెలియక తిన్నాను"

భగవానుడైన బుద్ధునికి కూడా ఆభిక్షువును ఏమనాలో తెలియలేదు. ఆయనకు అప్పుడు కోపం వచ్చిందో ఆయనలో అప్పుడు కరుణ తొణికిందో, వేదన ఉద్భవించిందో చెప్పడం కూడా కష్టం. ముఖం ఎర్రబడింది. మాట గంభీరంగా వచ్చింది. "భిక్షూ! నువ్వు మోఘ పురుషుడివి. భిక్షూ నువ్వు మోహపురుషుడివి. సుప్రియ మాంసాన్ని పంపిస్తే, అది మనుష్య మాంసం అని కూడా తెలుసుకోలేనంతటి మోహాంబుధిలో మునిగిపోయినావు. అప్రసన్నుల ప్రసన్నులను చేయడంకోసం ఇంతటి త్యాగం సుప్రియ చేయగలదు అన్న ఇంగితం కూడా నీకు లేదు."

"భిక్షువులారా! శ్రద్ధాళువులు, సుప్రసన్నులు అయిన మనుష్యులు తమ సర్వస్వాన్ని ఇట్లా త్యాగం చేస్తారు. లోక శ్రేయస్సుకోసం తమ శరీరాన్ని కూడా అర్పించివేస్తారు"

"భిక్షువులారా! మనుష్య మాంసం తినరానిది. మనుష్య మాంసమే కాదు, ఏ మాంసాన్ని బౌద్ధులు అయినవారు తినరాదు. ఈరోజునుంచి మాంసాహారాన్ని నిషేధిస్తున్నాను. ఇంకా అట్లా ఎవరన్నా తింటే వారికి థుల్లిచ్చయం అనే పాపం చుట్టుకొంటుంది. వారు నిరయంలో పడిపోతారు."

బుద్ధ భగవానుని ఈ ధర్మోపన్యాసాన్ని భిక్షువులు శ్రద్ధతో విన్నారు. అప్పటినుంచి బౌద్ధులు మాంసాహారాన్ని వర్జించారు. ★

పుణ్యానికి పోతే

కోదండపాణి తండ్రిమాట జవదాటనివాడు. తండ్రి యెంత చెప్తే అంత తండ్రి చెప్పినట్లుగా నడుచుకోవాలనే వుద్దేశ్యం గల మనిషి.

తండ్రి చనిపోతూ యిలా చెప్పాడు: "నాయనా, నేనింక యెంతోకాలం బ్రతకలేను. నీతో చెప్పవలసిన విషయం వకటేవుంది. నీవు మాత్రం యెప్పుడూ మంచిగా ప్రవర్తించాలి. ఇతరులు కష్టంలో వున్నప్పుడు వారికి చేతనైన సహాయం చేయాలి" అని.

తండ్రి మాటలను జాగ్రత్తగా విన్నాడు కోదండపాణి. తండ్రి చెప్పినట్లుగా నడుచుకోవాలనుకొన్నాడు. ఇతరులకు సహాయం చేయాలనుకొన్నాడు.

ఒకనాడు విజయవాడ వెళ్లవలసిన పనివచ్చింది. కోదండపాణి స్టేషన్కుపోయి, టికెట్టుకొని, ప్లాటుఫారం చివరకుపోయి కూర్చున్నాడు. బండి వస్తుందనే సూచనకి బెల్కొట్టారు. పెద్ద బొజ్జగల షావుకారొకడు నెత్తిన మూట, చేతిలో గొడుగు పెట్టుకొని తొందర తొందరగా నడుస్తూ రావడం కోదండపాణి చూచాడు. వెంటనే తనలో యిలా అనుకున్నాడు. "యితరులు కష్టంలో వున్నప్పుడు సాయం చేయాలని నాన్న చెప్పాడు కదా. పాపం! యీషావుకారు కంగారుతో బండి వచ్చేస్తుందని పరుగెత్తుకొంటూ వస్తున్నాడు. ఇతనికి చేతనైన సహాయం చేయాలి"అని. "ఏమండి షావుకారుగారూ, మీ రేవూరు వెళ్తారండీ!" అని అడిగాడు ఆషావుకారుని.

"బెజవాడ" అని బొంగురు గొంతుకుతో, తొందరగా నడుస్తూ జవాబిచ్చాడు షావుకారు.

శ్రీ మందవరపు
బాలవిఠల్ ప్రసాదరావు

"అలాగైతే ఆగండి నేనూ బెజవాడే వెళ్లాలి. పాపం, మీరు టికెట్టుకోసం తొందరగా పోతున్నారు. నాటిక్కట్టు యిచ్చేస్తా. తీసుకోండి" అన్నాడు కోదండపాణి. షావుకారు వెంటనే ఆగి, "ఏమిటీ, నీటిక్కట్టు నాకిచ్చేస్తావా! ఏదో పాతటికెట్టు నాకంట గట్టి, డబ్బు పుచ్చుకొని నన్ను మోసం చేద్దామనుకొన్నావా? నేనంత వెర్రివాణ్ణి కాను. ఇలా యెంతమంది నోట్లో దుమ్ముకొట్టావ్" అని నానా తిట్లు కోదండపాణిని తిట్టి, మరల తొందరగా నడవడం ప్రారంభించాడు.

"అయ్యో, నేను సాయం చేద్దామనుకొంటే, యీమూర్ఖుడిలా అంటాడేమిటి?" అని తనలో అనుకొన్నాడు కోదండపాణి. ఇంతలో బండి స్టేషన్లోకి వచ్చేసింది. బండెక్కాడు. విజయవాడ స్టేషనులో దిగాడు.

కోదండపాణి రోడ్డు మీద నడుస్తూ ఒకచోట ఒక ఆటవస్తువు పడియుండడం చూచాడు. దానికెదురుగ నున్న యింటి అరుగు మీద ఒక చంటిపిల్లాడు ఏడుస్తూండడం కూడా చూచాడు. వెంటనే తనలో "పాపం, యీ బొమ్మ కోసం ఆపిల్లవాడేడుస్తున్నాడు. దీన్ని తీసి ఆ అబ్బాయికిస్తా" అని అనుకొని, ఆబొమ్మను తీస్తున్నాడు. ఇంతలో ఆయింటి యజమాని వచ్చి "ఏరా దొంగ వెధవా, బుద్ధిలేదూ! చంటిపిల్లలాడుకొనే బొమ్మలు దొంగిలించేకంటే చావరాదూ!" అని అంటూ కోదండపాణిని చెంపమీద వకటి వేశాడు.

"ఇదేంటండీ, వెనకా ముందూ లేకుండా అలా కొడ్తారూ! నేనీ బొమ్మను తీసి ఆ అబ్బాయికిద్దామనుకొంటే..." అని కోదండపాణి అంటూండగనే

"ఛా, దొంగవెధవా, యింకా అబద్ధాలాడ్తావ్. మళ్లా మాట్లాడావంటే పళ్లు రాలగొడతా" అని నానాతిట్లు తిట్టి కోదండపాణి చేతు

లోని బొమ్మ లాక్కొని లోపల్కి పోయాడు.

"ఇదేంటిరా భగవంతుడా! పాపం! చంటి అబ్బాయి యేడుస్తున్నాడని ఆబొమ్మను తీసి యిద్దామంటే యితను యిలా కొడ్తాడేంటి?" అని తనలో అనుకొని కోదండపాణి ముందుకు సాగాడు విచారంతో.

కొంత దూరం పోయేసరికి, నెత్తిన యేదో మూటపెట్టుకొని నడవలేక నడవలేక వెళ్తున్న ఓ ముసిల్ది కోదండపాణి కంటబడింది పాపం! యీముసిల్ది ఆబరువును మోయలేక పోతోంది ఆమెకు సాయం చేయా లనుకొన్నాడు. కోదండపాణి "ఏ, మామ్మా, ఆమూటను యిలా గియ్యి నువ్వు మొయ్యలేక పోతున్నావు నేను తీసుకొస్తా" అని అన్నాడా ముసిల్దానితో

"ఏమిటీ, నువ్వు తీసుకొస్తావా. యిలా యెంతమందిని మోసం చేశావ్ నిన్న యిలాగే నీలాంటి దొంగవెధవ వచ్చి తీసుకొస్తానంటే శికుంచాల బియ్యం మూట యిచ్చాను మళ్లీ కనబడలేదు. యివ్వాళ నువ్వొకడవా! రేషను రోజుల్లో బియ్యం దొరక్క యేడుస్తుంటే మీరెవర్రా దొంగ వెధవలు దాపురించారు?" అని నానా తిట్లు తిట్టిందాముసిల్ది ఇంతలో జనం మూగారు "ఏమిటయ్యా గొడవ?" అని అడిగారు కోదండపాణిని

"అబ్బే యేమీలేదండీ, యీ మామ్మ ఆమూటను మొయ్యలేక పోతోంది అందుకని సాయం చేద్దామని ఆమూట నిలాగియ్యమంటే ఆవిడ నానామాటలూ అంటూంది" అని జవాబిచ్చాడు కోదండపాణి.

"పాపం! సాయం చేద్దామను కొన్నావా, దొంగ వెధవా? ఆముసిల్ది మూటనిస్తే చక్కా తీస్కుపోదామను కొన్నావా?" అన్నాడో పెద్దమనిషి.

"ఇలా యెంతమందిని మోసం

(54 వ పేజీ చూడండి)



"ఏరా దొంగవెధవా బుద్ధిలేదూ! చంటిపిల్లాడి బొమ్మ దొంగిలించే కంటే చావరాదూ!"

ద్రవించిన శిల

కఠినాతి కఠినమైన శిలలోకూడా కప్పలు నివసించడానికి స్థావరం ఏవిధంగా ప్రకృతిసిద్ధమై వుందో, అదే విధంగా శిలాసదృశ్యాలైన మానవ హృదయాల్లో కూడా ఏదో ఒక మూలమూల ఆర్ద్రతకు స్థానం వుండితీరుతుంది. ఎంత దుర్మార్గులైనవారిలోనూ ఇతరులకు కనపడని ఎంతో కొంత మంచితనం వుంటుంది. మనిషిని దుర్మార్గానికి మరల్చే మానసిక స్థితి బాహ్య పరిస్థితులమీద ఆధార పడి వుంటుంది.

రహీమ్ ఖాన్ పేరు చెప్తే ఆవూరంతటికీ ఓవిధంగా భయం; మరోవిధంగా అసహ్యం. ఓ భుజం మీద నాగలి వేసుకుని, ఒక చేతితో కర్ర పుచ్చుకుని ఎడ్లని తోలుకుని సాయంత్రం పొలంనుంచి అతను యింటికి వస్తూంటే ఎక్కడివా రక్కడ 'గప్‌చుప్' అయిపోతారు. అతను దూరం వెళ్ళగానే వెనకనుంచి వికవికలు పకపకలతో అటువంటి వాడనీ ఇటువంటివాడనీ, అతని క్రౌర్యాన్ని గూర్చి ఏవేవో గుసగుసలు ప్రారంభిస్తారు. పదిగజాల దూరంలోచూసిందే తడవుగాపిల్లలు ఎక్కడఆట లక్కడ విడిచిపెట్టి పరుగులు తీస్తారు. ప్రతివారికీ రహీమ్‌ను చూస్తే ఓ రాక్షసుణ్ణి చూసినంత భయం! అత నంత కోపిష్టి. సౌమ్యమైన మాట అతని నోటినుంచి రాదు. నోరు విప్పేడంటే మింగేసినంత పని. అందుకని సాధారణంగా ఆవూళ్ళో ఎవరూ అతనితో ఆప్తే మాట్లాడేవారు కూడా కాదు.

ఆవేళ రహీమ్ పొలంనుంచి తిరిగి యింటికి వస్తున్నాడు. రచ్చబండదగ్గర చేరిన జనం మామూలుగానే గుసగుసలు ప్రారంభించారు. రహీమ్‌కి ఇవేమీ లెక్కలేదు. అందర్నీ దాటి తనయింటికి చేరి నాగలిని ఓమూల గోడకు జేర్ల వేసి, ఎడ్లను యింటి కెదురుగా గుంజలకు కట్టాడు. ఇంకా యింటి తలుపులు తియ్యని పెళ్ళాంమీద పుట్టెడు కోపంతో అటుచూశాడు.

ఇంతట్లో యింటిపక్కావిడ చేతులో తాళంచెవులు పట్టుకుని వచ్చి "బాబూ! రహీమ్" అని భయపడుతూ పిలిచింది.

"ఎవరూ?" అంటూ ఆవిడకేసి చూసి ఒక్కసారి హుంకరించాడు. ఆవిడ హడిలిపోయింది. నోట మాట రాలేదు. దాంతో మరీ మండిపోయింది రహీమ్‌కి.

"ఏం? మాట్లాడవ్? నిన్నేమైనా మింగేస్తానా?" అన్నాడు.

ఆమెకి చచ్చినంత పనైంది. ఎలాగో ధైర్యంచేసి "నీభార్య-..." అంటూ ఏదో చెప్పబోయింది. పూర్తిగా వినే ఓర్పు ఎక్కడుంది ఖాన్‌కి?

"పారిపోయింది, అంతేనా?..." అన్నాడు వెటకారంగా నవ్వుతూ.

"కాదు. అన్నగారింటికి కొన్ని రోజు లుండడానికి వెళ్ళింది"

"హు!..." అంటూ మింగేసేటట్లు ఆమెవంకచూసి తాళంచెవులు తీసుకుని యింటి తలుపులు పెద్ద శబ్దంచేస్తూ తెరిచాడు.

ఇల్లంతా చీకటిగా వుంది. ఎలాగో దీపం వెలిగించి ఓమూల నున్న నులకమంచాన్ని, తన కోపం అంతా దానిమీద చూపిస్తూ, క్రింద పడేసి కూర్చున్నాడు. ఇంతలో ఓమూలనుంచి పిల్లి 'మ్యావ్' మంది. దాన్ని యింటోంచి తరిమేసేవరకూ శాంతి లేకపోయింది ఖాన్‌కి. తిరిగివచ్చి మంచంమీద కూర్చున్నాడు. కాళ్ళు కడుక్కుందుకు నీళ్ళు యిచ్చేవారు లేరు. అన్నం పెట్టేవాళ్ళుగాని తను కొడితే తిడితే పడేవాళ్ళుగాని యింట్లో ఎవ్వరూ లేరు. ఇంటిలో నిశ్శబ్దం అతడికి చాలా అశాంతి కలిగించింది. భార్య యింట్లో వున్నప్పుడూ అతను కోపంగానే వుండేవాడు. ఆవిడ యింట్లో లేకపోవడంవల్ల ఇప్పుడూ అతనికి మరింత కోపం వచ్చింది. అతను ఆరాత్రి కింక భుజించదల్చుకోలేదు. "ఇదికూడా వెళ్ళిపోయిందన్న



మాట" అనుకుంటూ, మంచం మీద నడుం వాల్చాడు. ఇంక తిరిగిరాదనే దృఢనమ్మకం కలిగింది అతనికి.

గడిచిన ఇరవైఅయిదేళ్ళ దాంపత్య జీవితంలోనూ ఏదో ఒక రోజున తన భార్య యిలా విడిచి వెళ్ళిపోతుందని రహీమ్ మొదటి నుంచీ అనుకుంటూనే వున్నాడు. ఆరు సంవత్సరాల క్రితం తన పెద్ద కొడుకు, తర్వాత మూడేళ్లకి చిన్న కొడుకూ, తను కొట్టే దెబ్బలకు భరించలేక పారిపోయారు మేనమామగారింటికి. అప్పుడే అనుకున్నాడు, యింక కొద్దిరోజులకు భార్యకూడా అదేపని చేస్తుందని.

రహీమ్‌కి చాలా చికాకు కలిగింది - భార్య యింట్లో లేదని. అంటే అది ఆమెమీద ప్రేమవల్ల కాదు. ఇంట్లో అత్యవసరమైన వస్తువేదో కనిపించకపోతే ఎల్లా వుంటుందో, అల్లా అనిపించిందతనికి. రహీమ్, సంఘాన్నీ ప్రతి మనిషినీ ద్వేషిస్తున్నాడు. అతని హృదయాంతర్భాగంలో అనుక్షణం అగ్ని కణకణ మండుతూండేది. ఆ వేడినంతా భార్యమీద చూపి తన తాపాన్ని చల్లార్చుకునేవాడు. మరీనాడు భార్య యింట్లో లేదుగా!...

రహీమ్‌ఖాన్‌కి ఇరవైఅయిదు సంవత్సరాల క్రితం [illegible]న జీవితం కళ్లకు కట్టిన[illegible]రికంతకూ తనొక గొప్ప వస్తాదని పేరు పొందేడు. తన నందరూ పహిల్వాన్ అంటూండేవారు. ముష్టియుద్ధంలో, కుస్తీపట్లలో తనను మించినవాడు లేడనిపించుకున్నాడు. అప్పుడప్పుడు ఆ గ్రామంలో ప్రదర్శనలు ఏర్పాటు చేయించేవాడు. అందులో తను చేసిన పనులకి అందరూ మెచ్చుకుని చప్పట్లు చరుస్తూంటే ఏదో నూతనోత్సాహంతో పొంగిపోయేవాడు. ఆరోజుల్లో తనావూరి 'పటేల్' కూతురు రాధని ప్రేమించాడు. రాధకూడా తన కుస్తీపట్లు, ముష్టియుద్ధాలూ చూడ్డానికి వచ్చేది. తనది పైచేయిగా కనపడితే రాధకళ్ళల్లో మెరిసే ఆనందం తన నింకా శక్తివంతుణ్ణి

ద్రవించిన శిల

చేసేది. తప్పకుండా తనే గెల్చే వాడు.

ఇలా వుండగా ఓసారి ఆవూరికి ఒక సర్కసు కంపెనీ వచ్చింది. తన గొప్పదనాన్ని విని వాళ్లు తమ కంపెనీలో చేరమని, అందులో తనకు గొప్ప భవిష్యత్తు వుంటుందనీ చెప్పేరు. తనకు మొదటినుంచీ వంశపారంపర్యంగా వస్తూన్న పొలంపని కిట్టేదిగాదు. తండ్రి నడిగేడు, తనను పంపించవలసిందని. కాని అతను 'ససేమిరా' వల్లకాదన్నాడు. అది తమకు అగౌరవమైన పనిట! తమ పూర్వు లెవరూ అటువంటిపని చెయ్యలేదట!! తనెంత బ్రతిమాలినా వినలేదు. ఆ రోజుల్లో తండ్రి నెదిరించి పోయే శక్తికూడా అతనికిలేదు. సర్కసువాళ్ళు వూరినుంచి వెళ్లిపోయారు. రహీమ్‌ఖాన్ హృదయం భగ్గుమని మండింది. తను రాధను ప్రేమిస్తున్నట్టు తెలిసి తండ్రి తనను చెడామడా తిట్టాడు. పిల్లతండ్రిదగ్గర కెళ్ళి "పిల్లకు పదిహేనేళ్లొచ్చాయి. ఇంకమీద మనమాట వినరు. తొందరగా పెళ్లిచెయ్యి" అని సలహా యిచ్చివచ్చాడు. ఆతర్వాత రాధకి పెళ్ళయి వెళ్ళిపోయింది.

కొన్నిరోజులకి తనకు పెళ్లి చేసేరు. తనకోసం ఏవో కొన్ని కొత్తబట్టలు కొనడం, పెళ్ళికూతురు కోసం ఏవో వొడిసస్త్రాలు చేయించడం తర్వాత తను గుర్రంమీద వెళ్ళడం, ఖాజీ చెప్పిన మాటల్ని తను తిరిగి అనడం పెళ్లవడం అన్నీ తన యిష్టాయిష్టాలతో నిమిత్తం లేకుండానే జరిగిపోయాయి. అన్నింటికీ తలాడించటమే తప్ప యింకేమీ చెయ్యలేకపోయాడు.

ఇటువంటివే యింకా ఎన్నో సంఘటనల స్మృతులు రహీమ్‌ఖాన్ హృదయంలో బలమైన గాయాన్ని లేపేయి. తన జీవితంలో అనుక్షణం అడ్డువచ్చిన, తన తలిదండ్రులు, కుటుంబం, సంఘంమీద ప్రతీకారం తీర్చుకునేందుకు అతని మనస్సు తొందరచేసింది. కాని నిస్సహాయుడు - సంఘంమీద పగ తీర్చుకునే శక్తి తనకు లేదు. తనేమన్నా లోకంలో ఎవ్వరూ పడరు. వ్యక్తి జీవితాలు మార్చేసేందుకు అధికారం సంఘాని కుంది. కాని ఒక వ్యక్తి తానై సంఘంయొక్క సిగపూవైనా వాడేట్టు చెయ్యలేడు. కాని ఒక్క వుపకారం చేసింది సంఘం - ఒక్క వ్యక్తిపై మాత్రం తనకు సంపూర్ణాధికారం యిచ్చి యిష్టంవచ్చినట్టు చేసుకోమంది. ఆమె కసాయివాడిదగ్గర తలవంచి నిలబడ్డ మేకపిల్లలా ఖాన్ కళ్ళకు కనపడింది. తన విచారాని కంతకూ చిహ్నంగా నిలబడివున్న భార్యమీదే తన పగ సాధించాలనుకున్నాడు. రహీమ్‌ఖాన్ యువక హృదయం అదిమొదలు పాషాణమైపోయింది. యుక్తాయుక్త విచక్షణాజ్ఞానం నశించింది.

ఖాన్ ఆలోచిస్తున్నాడు. తన ప్రతీకారాన్నింకా పూర్తిగా తీర్చుకోలేదా? లేకేం? ప్రతీవారూ తన్ను ద్వేషించి అసహ్యించుకుంటున్నారు. ప్రజలకి తెలియదు, తనెందు కింతగా మారిపోయాడో! ఎవ రేమనుకున్నా ఎంత అసహ్యించుకున్నా తన అధికారానికి లొంగివుండే భార్య అనే ఒకానొక వస్తువును తల్చుకుంటే అతని హృదయంలో శాంతి కలిగింది. కారణమున్నా లేకపోయినా భార్యను కసితీరా కొట్టడం ఖాన్‌కి దినచర్య అయిపోయింది. భార్యకి కూడా యిది అలవాటైపోయింది. ఏ రోజైనా ఆపని జరగకపోతే భార్యాభర్త లిద్దరికీ ఏదో లోటుగానే వుండేది. ఖాన్‌కి నిద్రవస్తోంది. జీవితంలో మొట్టమొదటిసారిగా భార్యలేని ఒంటరితనం అనుభవించాడు. తను పూర్తిగా ద్వేషించినట్టి ఒక వ్యక్తి తన వ్యక్తిగత జీవితంలో ఎంత ప్రముఖపాత్ర వహించిందో మొట్టమొదటిసారిగా ఖాన్‌కి అర్థమైంది.

మర్నాడు ఖాన్‌కు మెళుకువ వచ్చేసరికి పదిగంటలైంది. నెమ్మదిగా లేచి కాలకృత్యాలు తీర్చుకుని మేకలపాలు పితికి క్రిందటిరోజు రొట్టెలూ పాలతో ఫలహారం

"ఏరా గోపీ! ఆకడపటి లెక్కకు ఆన్సరెంత వచ్చింది చెప్పరా"

"యిరవై వచ్చిందిరా."

"అరెరే! రెండుపేళ్ల సున్న పెట్టడానికి మర్చిపోయారా"

"ఓహో! అలాగా! ఆపని పంతులే చేసేస్తాడు లేరా"

—గోపిశ్రీ, సామిరెడ్డి పల్లె

చేశాడు. గదిలో సాలెగూళ్ళు అవీ పట్టివుండడంచేత ఆవేళకి పొలంపని మానేసి యింటిని శుభ్రం చేయా లనుకున్నాడు. ఒక కర్రకి గుడ్డ కట్టి దానితో సాలెగూళ్లన్నీ తుడిచేశాడు. గదిలో దూలంమీద పిచ్చుకలు ఒక గూడు పెట్టేయి. మొదట్లో దాన్నికూడా కింద పడేద్దామని కర్ర తీశాడు. కాని ఎందుకో అతని మనసొప్పలేదు. రెండు పిచికలు ఆ గూడుచుట్టూ తిరుగుతూ గోల చేస్తున్నాయి.

కర్ర ఓమూల పెట్టి ఒక చిన్న బల్లతెచ్చి దానిమీద నుంచుని గూడులోకి ఓమారు చూశాడు. గూట్లో రెక్కలు రాని, రెండు ఎఱ్ఱటి మాంసపు ముద్దల్లా వున్న పిచిక పిల్లలు అందులో వున్నాయి. రహీమ్‌ని రెండు పెద్ద పిచికలూ చుట్టేశాయ్. అందులో ఆడపిట్ట రహీమ్ కళ్లను పొడవబోయింది. "నా కన్ను పోగొట్టద్దామనుకున్నావే" అంటూ పెద్దనవ్వు నవ్వుతూ దిగాడు రహీమ్‌ఖాన్. ఆ గూడునూ అందులో పిల్లల్నీ కాపాడడానికి ఆ పక్షులుపడే ఆరాటమూ శ్రమా చూస్తుంటే రహీమ్‌ఖాను హృదయంలో జాలి తొణికిసలాడింది.

మర్నాడు యథాప్రకారం పనికి వెళ్లేడు ఖాన్. ఊళ్ళో అతనితో కులాసాగా మాట్లాడేవారే లేరు. పొలం పనంతా చేసి సాయంకాలం యింటికివచ్చి కులాసాగా మంచంమీద కూర్చుని హుక్కా తాగుతూ ఆ పక్షుల్ని చూస్తూ కాలం గడిపేవాడు. ఆ పక్షులకి రొట్టెముక్కలిచ్చి, అవి తింటూంటే ఏదో అపరిమితానందం అనుభవించేవాడు. ఎప్పుడో పోయిన తన కొడుకుల పేర్లుపెట్టి పిచిక పిల్లల్ని ముద్దుగా పిల్చుకునేవాడు. రాను రాను రోజులు గడుస్తున్నకొద్దీ ఖాను హృదయానికా పక్షులు అత్యంత సన్నిహిత మయ్యాయి. స్నేహితుల్లా భావించాడు రహీమ్‌ఖాన్ వాటిని. ఇదివరకు దేనికోసం ఆరాటపడ్డాడో, ఆ శాంతి యిప్పుడు లభించింద అతనికి. రహీమ్‌ఖాన్ ఈ తాత్కాలిక శాంతప్రవర్తన అక్కడివారికి అనుమానం కలిగించింది.

ఒకనాడు సాయంత్రం బాగా మబ్బుపట్టివుండడంవల్ల పొలం

(43-వ పేజీ చూడండి)

అద్దెబోటులో-

ముచ్చటగా ముగ్గురు

(కుక్క సంగతి సరే సరి!)

కెంప్టన్ పార్కుదగ్గిర ఒడ్డున దిగి మకాం వేశాం. ఫలహారం కానిచ్చాం. చుట్టూ పచ్చికా, ప్రవాహపు అంచూ అవీ చూడ్డానికి చక్కగా ఉన్నాయి. ఫలహారం మూడో వాయిలో ఉండగా ఒక పెద్దమనిషి పైపు కాల్చుకుంటూ మేం కూచున్నచోటికి వచ్చి "ఇంకొకళ్ళ జాగా ఆక్రమించుకుని కూచున్నారు మీరు. ఈ సంగతేమైనా గ్రహించారా?" అన్నాడు. ఇంకా ఆ సంగతి ఆలోచించనేలేదని చెప్పాం. ఇంకా కదల్లేదు అతడు. "ఇంకేమైనా పనుందా మీకు మాతో?" అని అడిగాం. హారిస్ లేచివెళ్ళి అతని చేతిలో చిన్న రొట్టిముక్క పెట్టాడు—భారీగా. తిరిగి అది హారిస్ కిచ్చేసి "ఇక్కడనించి మిమ్మల్ని తరిమెయ్యడం నా డ్యూటీ తెలుసా?" అన్నాడు.

"అయితే నీ డ్యూటీ చెయ్యవోయ్" అన్నాడు హారిస్. హారిస్ కొంచెం ఒడ్డూ పొడుగూ ఉన్న మనిషి. ఎముకపుష్టి బాగా వున్నవాడు. వచ్చిన పెద్ద మనిషి హారిస్ని నిలువెల్లా ఒకసారి చూసి, ఏమనుకున్నాడో ఏమో 'యజమానితో చెప్పివస్తాను' అంటూ వెళ్ళిపోయాడు. కాని మళ్ళీ అతడు రానే లేదు. అసలెందుకొచ్చాడో మాకు తెలుసు. చేతిలో ఓ కాసు వేసుకోడంకోసం వచ్చాడు. ఈ నది వొడ్డుని ఈ రకం మనుషులు చాలామంది బెదిరించి సొమ్ము చేసుకునేవాళ్లు వున్నారు. యజమానులెవళ్లో పంపించారని చెప్తారు. ఇలాంటి వాళ్లని 'మీ యజమానితో చెప్పుకో పో' అంటే ఏమీ చెయ్యలేరు. మనం కొంచెం నిబ్బరంగా ఉండాలంతే.

ఈ యజమానులనే వాళ్లనిగురించి తలుచుకుంటే ఒళ్లు మండుకొస్తుంది. వీళ్ళ దురాశకి అంతుండదు. వీళ్లమాటే చెల్లడంఅంటూవస్తే థేమ్స్నది వొడ్డంతా కంచెవేసి ఎవ్వళ్లనీ రానివ్వరు. పిల్ల కాలువలదగ్గిర అంత పనీ చేస్తున్నారు కూడా. గుంజలు పాతి ముళ్ల కంచెలువేసి వొడ్డునున్న ప్రతిచెట్టుకీ తమ పేర్లున్న పెద్దపెద్ద బోర్డులు తగిలించారు. అవి చూస్తే కోపం తలకెక్కిపోతుంది. ఒక్కొక్క బోర్డే తీసి వాళ్ల నెత్తిన మేకుల్తో దిగెయ్యాలనిపిస్తుంది. తరవాత వాళ్లని పాతేసి పైన బోర్డులు కప్పెట్టాలి.

హారిస్తో ఇలాగని చెప్పాను. వాడికి నాకంటే తిక్క కోపం. ఈ బోర్డులు తగిలించినవాళ్లనీ వాళ్ళ పిల్లపాపల్ని అందర్నీ ఏకంగా మట్టుబెట్టి వాళ్ల ఇళ్లు తగులబెట్టి అక్కడ సంతోషంతో గంతులేస్తూ పాటలు పాడుకోవాలనిపిస్తుందిట వాడికి. ఇది మరీ అన్యాయం అనిపించింది నాకు. ఇంత రాక్షసం పనికిరాదన్నాను. ఊహు వీల్లేదన్నాడు. వాడితో వాదించి, క్రీస్తుదేవుణ్ని జ్ఞాపకం చేసి చివరకు ఏలాగైతేనేం వాడిచేత ఒప్పిం

మూలం:
జెరోమ్ కె. జెరోమ్

★

అనువాదం:
విశ్వాత్ముల నరసింహమూర్తి

చాను - వాళ్ళ సంసారాల్ని విడిచిపెట్టడానికీ, పాటలు పాడకుండా ఉండడానికీ.

హారిస్ పాటలు పాడ్డం అంటే తెలీదేమో! చెప్తాను. పాడనని వాడిచేత ఒప్పించడం లోకానికి ఎంత మేలయిందో మీ కప్పుడు తెలుస్తుంది.

తను పాడగలనని హారిస్‌కి ఘట్టి నమ్మకం. ప్రతీ వాడూ జన్మలో ఒక్కసారి తన పాట విని మరీ చచ్చి పోవాలంటాడు. ఏ అమాయకురాలో పదిమందిని విందుకి పిల్చి కూచోబెట్టిందనుకోండి. కర్మం కాలి మనవాడిని పాడమన్నదే అనుకోండి. ఇంక వీడుచేసే ఆర్భాటం ఇంతా అంతా కాదు. వీడు పాడ్డానికి ఒప్పుకున్నాడనే సరికి ఏదో విందామని నలుగురూ గుంపు చేరతారు. "నేనో కామిక్ పాడుతున్నా నిప్పుడు" అంటాడు హారిస్ పియానోదగ్గిర నుంచుని, చేతు తెగ దీసుకుంటూ.

కామిక్ అంటే అట్టే ఫరవాలేనిదే అనుకోండి. షడ్జమానికి గొంతెత్తలేనివాడయినా పాడవచ్చు. మాటలూ, హ్రస్వాలూ, దీర్ఘాలూ కాస్త అటూయిటూ అయినా ఏదో భరించవచ్చు. మధ్యలో మరీ ఆరోహణం హెచ్చయిపోయిందనుకుని హఠాత్తుగా ఒక్క కుదుపు కుదిపి అవరోహణంలోకి దూకెయ్యొచ్చు. పియానోదారి పియానోదీ పాడే పాటదారి పాటదీ అయినా తలపట్టుకునేనా కూచోవచ్చు. కాని ఏవో మాటలూ శృతీ స్థాయీ అనేవి అసలు మచ్చుకేనా ఉండాలిగా. అబ్బే! హారిస్‌కి అవేమీ పట్టవు. మధ్యలో ఇంకో పాటలు అనుపల్లవి అందుకుంటాడు. ఇలాగే పియానో వాయించే వాడి కింక తిక్కెత్తి చేతులు కడుక్కొని లేచిపోతాడు. పోనీ తన్ని గాడిదకింద కట్టి ఆడిస్తున్నారనేనా గ్రహించడు హారిస్. అందరూ తన్ని మెచ్చుకుని ఆనందిస్తున్నారనుకుంటాడు.

కామిక్‌లు అంటే ఇదివరకు ఒక సంఘటన జ్ఞాపకం వస్తోంది. దీనివల్ల మనుష్యుల తరహాలు కొంత బోధపడతాయి కనక చెప్తున్నాను.

అప్పుడు అక్కడ పార్టీకిచేరినవాళ్లు అందరం చదువూ సంస్కారం ఉన్న వాళ్ళం. అందరం మంచి హుషారుగా కబుర్లు చెప్పుకొంటున్నాం. కాని ఇద్దరు యువకులుమాత్రం మూతి ముడుచుకుని కూచున్నారు - వాళ్ళకి ఈ పార్టీలో అట్టే హుషారు కలగ లేదు కాబోలు. ఈమధ్యనే వాళ్ళు జర్మనీలో చదువుకుని వచ్చారు. అసలు సంగతేమిటంటే మా పరిహాసాలూ, నవ్వులూ, ప్రసంగాలూ వాళ్ళకేం అర్థం కావడంలేదు. కొన్ని జర్మన్ గీతాలు పాడ్డం అయింది. ఒకరు ఒక ఫ్రెంచిగీతం పాడారు. అందరూ బాగుందంటే బాగుందన్నారు. మరొకరు స్పానిష్ జానపద గీతం పాడారు. అదేమిటో విషాదాన్ని సూచించింది. ఒకరిద్దరు కళ్ళు ఒత్తుకున్నారు కూడా. ఇహ ఆ తరవాత జర్మనీనించి వచ్చిన యువకు లిద్దరూ లేచి నిలబడ్డారు. గొప్ప సంగీత విద్వాంసుణ్ణి ఒకణ్ణి తీసుకొస్తామన్నారు. చాలా గొప్పవాడుట. జర్మన్ చక్రవర్తి సముఖంలో అతడు ఒకసారి పాడేసరికి చక్రవర్తి గారు మూర్ఛపోయారట. ఆయన్ని మోసుకుపోవలసి వచ్చిందిట. అంత అద్భుతంగా మరెవ్వరూ పాడలేరన్నారు. గంభీరంగా ముఖంపెట్టి విషాదభావాన్ని వెదజల్లుతున్నట్టు పాడతాట్ట—అందులోనే అతని హాస్యం అంతా ఇమిడివుందిట. ఎవ్వరూ నవ్వలేక పొట్టలు పట్టుకుని పరుగులెత్తాలిసిందేట. కాబోలుననుకుని అతణ్ణి తీసుకురమ్మన్నాం—యువకు లిద్దరూ మిద్దె దిగివెళ్ళి ఒక పెద్దమనిషిని తీసుకొచ్చారు. ఆయన వచ్చీ రావడంతో పియానోదగ్గిర కెళ్ళి కూచున్నాడు. మమ్మల్నెవరినీ చూడలేదు పలకరించనూ లేదు.

యువకు లిద్దరూ మా దగ్గిర చేరి మా చెవుల్లో గుసగుసలాడుతూ "బలేగా వుంటుంది, పొట్ట చెక్కలయ్యేట్టు నవ్వొస్తుంది" అంటున్నారు.

పియానోదగ్గిర కూచోగానే మొదలుపెట్టాడో పాట. అదేమిటో మాకు అర్థంకాలేదు. కాని గంభీరంగా ఏదో విషాదంగామాత్రం ఉంది. ఒళ్లంతా గగుర్పొడిచింది. ఇదేదో జర్మన్లకి అలవాటైన హాస్యం కాబోలునని అదేదో ఆనందించాలని నడుము కట్టుకు కూచున్నాం. నాకు జర్మన్ భాష తెలియదు. చిన్నప్పుడేదో కొద్దిగా చదువుకున్నాను కాని అప్పుడే మర్చిపోయాను. అయినా నాకు తెలియదన్న సంగతి అక్కడ బయటపడనివ్వకూడదనుకొన్నాను. అంచేత ఒక ఉపాయం ఆలోచించాను. జర్మనీ నుంచి వచ్చిన యువకులిద్దరినీ చూస్తూ కూచున్నాను. వాళ్లునవ్వినపుడు నేనూ నవ్వడం, కిచకిచ మన్నప్పుడు నేనూ కిచకిచ

★ ముచ్చటగా ముగ్గురు ★

మానడం, పొట్టలు పట్టుకొని పోలో మున్నప్పుడు నేనూ పోలోమని నవ్వడం మొదలెట్టాను. అప్పుడప్పుడు నాకూ స్వయంగా తెలుసులే అన్నట్టు వాళ్ళు నవ్వ నప్పుడు కూడా నవ్వడం మొదలెట్టాను.

కొంతసేపైనాక అందరివంకా చూశాను. ఆశ్చర్యం! అందరూ అదేపని చేస్తున్నారు. యువకు లిద్దర్నీ గమనించి వాళ్లు నవ్వినప్పుడు అందరూ నవ్వు తున్నారు.

అంతా బాగానే వుంది. కాని సంగీతవిద్వాం సుడు మాత్రం ఎందుకో చికాకుపడుతున్నాడు. మధ్యమధ్య తెల్లబోతున్నారు. ఒక తడవ అందరం నవ్వడంచూసి విద్వాంసుని ముఖం పాలిపోయింది. అత నెంత గంభీరంగా ఉంటే మేం అంత ఎక్కువగా నవ్వాలి కాబోలు అనుకుని అలా నవ్వుతున్నాం. అన లిక్కడ సొగసంతా ఇందులోనే వుంది. అత నేపాటి నవ్వినా రసాభాసై పోయేది. కాని అతడి ముఖంలో ఈమారు కోపం కనపడింది. యువకు లిద్దరూ ఆయన వెనకవైపున నుంచున్నారు. ఎదురుగా మేమున్నాం. ఆయనకి మామీద పట్టరాని కోపం వచ్చింది. ఇంక మాకు నవ్వు ఆగలేదు. పొట్ట బద్దలైపోతోంది. విద్వాంసుడు ఒక్కసారిగా పాట ఆపేశాడు. అందరం ఉలిక్కిపడ్డాం. ఇంతలోకే తట్టు కుని, ఇంత అద్భుతమైన హాస్యం ఎక్కడా వినలే దన్నాం. ఈపాటని ఇంగ్లీషులోకి తర్జుమా చేసి తీరా లని ఆయన్ని ప్రార్థించాం.

విద్వాంసుడు పళ్లు, పిడికిళ్లు బిగించి లేచి నించు న్నాడు. జర్మన్‌భాషలో తిట్ట సారంభించాడు. (జర్మన్ భాష తిట్టడానికి బలే జోరుగా ఉంటుందని తేలి పోయిం దీ దెబ్బతో) మనిషి కోపంతో ఊగిపో తున్నాడు. వచ్చీరాని కాస్త ఇంగ్లీషులోనే "ఇంత అవ మానం ఎన్నడూ జరగలేదు" అన్నాడు.

ఆరా తీస్తే ఈపాట కామిక్ కానేకాదుట— ఒక విషాద ప్రణయగాధకి సంబంధించిందిట. ఈ పాటని జర్మన్ చక్రవర్తిగారి సమక్షంలో పాడేసరికి విషాదం భరించలేక చక్రవర్తిగారు మూర్ఛపోయారని చెప్పాడు విద్వాంసుడు.

పరిస్థితి క్లిష్టంగానే ఉంది. ఏం చెయ్యడం? యువకు లిద్దరికోసం చుట్టూ చూశాం. జాడ తెలియ కుండా ఎప్పుడో ఇద్దరూ చల్లగా జారుకున్నారు.

అంతలో ఆ విందు ఆఖరైంది. అంత గుట్టు చప్పుడుకాకుండా ఆఖరైన పార్టీ మరెప్పుడూ చూడ లేదు. ఒకళ్ళ కొకళ్లు వీడ్కోలు చెప్పుకోలేదు. మాటామంతీ లేకుండా ఒక్కొక్కళ్ళం మెట్లుదిగి వెళ్లి పోయాం. అప్పట్నించీ జర్మన్‌గీతాలంటే అనలే గిట్టదు నాకు.

లాకులూ, బ్రిడ్జీలూ అవీ దాటి సాయంకాలా నికి వేబ్రిడ్జి చేరుకున్నాం. అక్కడ మూడు కాలవలు వచ్చి థేమ్స్ నదిలో కలుస్తాయి. అక్కడ లాకుల్లో ఒక గేటుమీద బ్లేజర్ కోటు కనపడింది. మాంట్ మొరన్సీ మొరుగు వినపడింది. జార్జి టోపీతీసి ఆడిం చాడు. హారిస్ గర్జించాడు. నేను మొరిగాను. మాంట్ మొరన్సీ అల్లరి ఆరంభించింది. కాలవలో ఎవరో పడిపోయారు కాబో లనుకుని లాకు కీపరు పరు గెత్తుకొచ్చాడు. ఎవ్వరూ పడకపోడం చూసేసరికి వాడికి రోషం వచ్చింది.

జార్జి చేతిలో ఏమిటో చిత్రమైన పార్సెల్ కన పడింది.

"అదేమిట్రా? పెనమా?" అని అడిగాడు హారిస్, కాసచూసి.

"కాదు" అన్నాడు జార్జి ఏమిటో కళ్లు పెద్దవి చేసి ఆశ్చర్యంతో. కళ్లు మిలమిల మంటున్నాయి కూడా. "ఇవి ఈరోజుల్లో సరికొత్త ఫేషన్‌రా, అందరిచేతుల్లోనూ ఇవ్వే. ఇది బాంజో" (వాద్య విశేషం.)

"అరె! నువ్వు బాంజో వాయించగలవా? ఎన్నడూ ఎరగనే ఈ సంగతి" అన్నాడు హారిస్ ఊపిరి బిగబట్టి.

"అహహా! అది కాదురా" అని తడబడ్డాడు జార్జి. "ఇదేమంత కష్టంకాదు. సులువేనని చెప్పారు. ఇదిగో, ఎలా వాయించాలో పాఠాలో అన్నీ తెలుసు కోడానికి పుస్తకంకూడా వుంది."

(ఇంకా వుంది)

ద్రవించిన శిల

(39-వ పేజీ తరువాయి)

నుంచి పెందరాళే యింటికి బయలేరాడు ఖాన్. చినుకులుకూడా ప్రారంభమైనాయి. దానికి తోడు గాలికూడా పట్టుకుంది. రహీమ్ త్వరత్వరగా యింటికి వస్తున్నాడు. అతణ్ని చూసి పొరుగింటి పిల్లలిద్దరు ఆడుకుంటూన్నవాళ్ళల్లా చెప్పులు గూడా అక్కడ విడిచిపెట్టి పరిగెత్తటం చూశాడు. మనస్సు కించపడింది. వాళ్ళని పేర్లుపెట్టి పిలిచాడు. "ఎందు కలా పరిగెత్తుతారు? నేనంటే ఎందు కంత భయం!" అని అతడు సౌమ్యంగా అంటూంటే వాళ్లు ఆశ్చర్యపోయారు. ఎడ్లని వాన పడకుండా వున్నచోట కట్టేసి తలుపులుతీసి యింట్లో కెళ్లేడు. ఇంతట్లో బయట వాన జోరయింది - గాలికి తలుపులు టపటపా కొట్టుగున్నాయి. తలుపులు వేసేసి దీపం వెలిగించి ప్రొద్దున్న చేసివుంచిన రొట్టెలు పెట్టుగున్నాడు. ఒకరొట్టె ముక్కలు చేసి ఓపళ్లెంలో పెట్టి కింద వుంచాడు. రోజూ ఖాన్ తలుపులు తియ్యడం రెక్కలు టపటప లాడిస్తూ వచ్చే పక్షిపిల్లలు ఆరోజు రాకపోతే ఆశ్చర్యపడ్డాడు. రొట్టెను తుంపులు చేసి పక్షుల్ని పేర్లుపెట్టి పిలిచాడు. అప్పటికీ అవి రాలేదు. రహీమ్ కంగారుపడి బల్ల వేసుగుని గూడులోకి చూశాడు. రెక్కలు శరీరాని కంటుకునిపోయి తడిసి ముద్దలై వణుకుతూ కూర్చుని వున్నాయి నాలుగూ. ఇంటికప్పులోంచి గూడులోకి నీరు కారుతోంది. రహీమ్ ఖాన్ త్వరత్వరగా నిచ్చెన తీసుగుని బయటికివచ్చి యింటి పైకెక్కి ఎండుగడ్డీ, పెంకులూ అన్నీ సరిచేసి నీరు కారకుండా బాగుచేశాడు. అప్పటికే ఖాను బట్టలన్నీ తడిసి ముద్దైపోయాయి. చలికూడా వేసింది. దిగివచ్చి వేరేబట్టలు కట్టుగుని ఆరాత్రికి రొట్టెముక్కలు గూట్లోనే వేసేసి వచ్చి పడుకున్నాడు.

మర్నాడు ఖాన్ లేచేసరికి జ్వరం బాగా తగిలింది. చలితో వణికిపోతున్నాడు. ఆతర్వాత కొన్ని రోజులు అతడు పనికి పోలేదు. ఊళ్లోవాళ్లకి ఆశ్చర్యం కలిగింది. ఆఖరికి ఒకనాడు సంగతేమిటో తెలుసుగోవాలనే ఆతృతతో కొందరు తలుపునందుగుండా చూచారు. ఖాన్ మంచంమీద పడుకుని వున్నాడు. పిచిక పిల్లలు అతని చేతిమీద వ్రాలివున్నాయి. "నేను పోయాక మీకు తిండెవరు పెడ్తారు?" అంటూ అతడు నిట్టూర్పులు విడుస్తూ అనడం విన్నారు. వెంటనే వాళ్లు ఖాన్ భార్యాపిల్లల కీవార్త చెప్పి తీసుగొచ్చారు; తలుపులు కొట్టారు. కాని తలుపులు తియ్యబడలేదు. ఆఖరికి తలుపులు బ్రద్దలుకొట్టి లోపలికొచ్చారు. భార్య ఏడుస్తూ పిల్లలతో లోపలికెళ్లి మంచం మీద చలనం లేకుండా పడివున్న ఖానును చూసింది. నాలుగు పిచికలూ చేసే సందడితప్ప మరేశబ్దమూ లేదా గదిలో...

['*Sparrows*' అన్న ఆంగ్ల కథానికి ఆధారం] ★

గవర్నమెంటును గూర్చి విపులంగా వ్రాయాలని ఒక పరీక్షాపత్రంలో యిచ్చిన ప్రశ్న;

దానికి ఒక విద్యార్థి సావధానంగా వ్రాసిన జవాబిది:

ఇది యొక వింత జంతువు. చెవులున్నవి కాని కళ్ళులేవు. దీని కెందరో పిల్లలున్నారు. వాళ్ళందర్నీ పోషించటంకోసం-కన్పించిన ప్రతీ ప్రాణినీ యేదో విధంగా భక్షిస్తూనే వుంటుంది.

— శ్రీ ఓగేటి శివరామకృష్ణ.

* * *

ప్రెస్ మేనేజర్ :- పనిచేసేటప్పుడు తాంబూలం వేసుకోకూడదని నీకెన్నిసార్లు చెప్పాలయ్యా?

వర్కర్ :- అసలు నేను వక్కాకు నములుతూన్నప్పుడు ఏపనీ చేయనండీ.

"మహేశ"



వై. వి. రావుగారి చిత్రం "మంజరి" లో రుక్మిణి

★ ఫిలిం ఫెడరేషన్ : నిర్మాతల సమస్యలు ★

భారత ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు శ్రీ బి. ఎన్. సర్కార్, కార్యవర్గ సభ్యులు ఈ నెల 10,11 తేదీలలో వాహినీ స్టూడియోలో సమావేశమై తమ సమస్యలకు సంబంధించిన కొన్ని తీర్మానాలు చేశారు. బొంబాయి, బెంగాల్, ఢిల్లీ, మద్రాసు ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. 11 వ తేదీ సాయంత్రం దక్షిణ భారతఫిలిం వాణిజ్య మండలివారు వాహినీ ఆవరణలో సర్కార్ గారికి గొప్ప స్వాగతం ఏర్పాటు చేశారు. మద్రాసు నిర్మాతలు, డైరెక్టర్లు, టెక్నీషియన్లు అనేకులు సభకు హాజరయ్యారు.

ఇంతవరకూ ఫెడరేషన్ కు దూరంగా ఉంటూవచ్చిన జెమినీ అధిపతి ఎస్. ఎస్. వాసన్ ఫెడరేషన్ లోనూ, ద. భా. ఫిలిం వాణిజ్య మండలిలోనూ సభ్యులుగా చేరారని మండలి అధ్యక్షుడు ఎ. రామయ్యగారు సభలో ప్రకటించారు.

అఖిలభారత ఫిలిం ఫెడరేషన్ దినోత్సవాన్ని ఆగస్టు 5 వ తేదీన అన్ని సినిమాహాలలోనూ జరపడానికి ఫెడరేషన్ నిశ్చయించింది. ఇండియాలోని ప్రతిసినిమాహాలు యజమానీ ఆరోజు సాయంత్రం ఆటకు వచ్చిన ధనాన్ని తమకు సమర్పించాలని ఫెడరేషన్ వారు ఆదేశించారు. సినిమా పరిశ్రమ యావత్తూ ఐకమత్యంతో మెలగుతున్నదని ప్రభుత్వానికి తెలియపర్చడమే ఈ ఉత్సవ ఆశయమని తెలుస్తున్నది.

సినిమా ప్రకటనల్లో అసభ్యతను అరికట్టే కొన్ని నిబంధనలు తయారు చెయ్యడానికి ఫెడరేషన్ నిశ్చయించింది. సెల్ఫ్ రెగ్యులేషన్ (తమ్ముతాము అదుపులో పెట్టుకోవడం) విషయంలో ఫెడరేషన్ నిర్మాతలకు ఎట్టి ఆదేశాలూ ఇవ్వరాదని తీర్మానించబడింది.

11 సాయంత్రం వాహినిలో బి. ఎన్. సర్కార్ పత్రికా ప్రతినిధుల సమావేశంలో మాట్లాడుతూ భారతీయ చిత్రాలు టెక్నికల్ గా ఇదివరకటికంటె చాల అభివృద్ధి చెందాయన్నారు. ఎంత అభివృద్ధి



వరుణావారి "మంజరి" లో జి. వరలక్ష్మి, మాధవపెద్ది సత్యం.



భారత ఫిల్ము ఫెడరేషన్ అధ్యక్షులు బి. ఎన్. సర్కార్ ఈనెల 11 న వాహిని స్టూడియోలో పత్రికా ప్రతినిధులను కలుసుకొన్నప్పటి ఫోటో.

★ ఫిలిం ఫెడరేషన్; నిర్మాతల సమస్యలు ★

చెందినా ప్రజల విమర్శన ధాటికి నిర్మాతలు తట్టుకోలేకపోతున్నారనీ, నిర్మాతల అభిరుచులకంటె ప్రజల అభిరుచులే త్వరితంగా అభివృద్ధి అవుతున్నాయనీ అన్నారు.

తరవాత జరిగినసభలో శ్రీ ఎ. రామయ్య అతిథులను సభికుల కెరుకపరచారు. సినిమా పరిశ్రమను కష్ట పరిస్థితు లెదుర్కొన్నాయనీ, ఈ పరిస్థితుల్లో ప్రజలు, ప్రభుత్వం, పత్రికలు తమ పరిశ్రమతో సహకరించాలనీ విన్నవించారు.

బి. ఎన్. సర్కార్ మాట్లాడుతూ ఈమధ్య పత్రికల్లో సినిమా సమస్యలపై వాదోపవాదాలకు, చర్చలకు ప్రాముఖ్యం హెచ్చిందనీ, పార్లమెంటులోను, బయటా కొందరు అధికార వర్గాలవారు, బాధ్యతాయుత వ్యక్తులు చేసే తీవ్ర ప్రసంగాలవల్ల సినిమా పరిశ్రమపై ప్రజల్లో అనేక అపోహలు బయలుదేరాయనీ అన్నారు. "సినిమాలకు ప్రపంచమంతటా ప్రాధాన్యం పెరుగుతున్నది. [illegible] ప్రభావం అందరూ గుర్తించారు. ప్రపంచ సినీ [illegible] ఒకే యూనియన్‌గా ఏకం కావాలని ప్రయత్నిస్తున్నారు. విద్యా, వైజ్ఞానిక ప్రచార చిత్రాల విషయంలో యునెస్కోవారు చేస్తున్న కృషి కూడా ప్రశంసార్హమైనది.

సినిమాలు కేవలం వ్యాపార వస్తువులా? లేక ప్రజా జీవితాలపై అత్యంత ప్రభావం కలిగి, వారి సంస్కృతిని పెంపొందించే కళావస్తువులా? ఈ ప్రశ్నకిచ్చే సమాధానంపైనే భారత సినిమా పరిశ్రమ భవిష్యత్తు ఆధారపడివుంటుంది," అనికూడా సర్కార్ అన్నారు.

తరవాత ఎస్. ఎస్. వాసన్ ఉపన్యసిస్తూ సినిమాలపట్ల ప్రభుత్వ వైఖరిని అతి తీవ్రంగా ఖండించారు. "మేము ప్రజలను వినోదపరచడమే వృత్తిగా గలవాళ్ళం. మాకు ప్రజల నైతికస్థాయిని పెంపొందించాలనే అభిలాష లేదు. అలా చేసేందుకు తగిన అర్హతలు కూడా మాకు లేవు. మా వృత్తి ప్రజల్ని వినోదింపజెయ్యడమే. మా వృత్తికి ప్రభుత్వానుమతి ఉన్నది. మేము తయారుచేసే చిత్రాలకు ప్రభుత్వపు సెన్సార్‌షిప్ ఉన్నది. మా థియేటర్లకు ప్రభుత్వపు లైసెన్సు ఉన్నది. మేము చట్టవిరుద్ధమైన పనేమీ చెయ్యడం లేదు. అయినా ప్రభుత్వం మాపై కత్తి వహించినట్లు విపరీతమైన పన్ను వేస్తోంది. మంత్రులు, ఇతర అధికారులు మా పరిశ్రమను గూర్చి ఏమీ తెలుసుకోకుండా ఇష్టం వచ్చినట్లు విమర్శిస్తున్నారు. ఇటీవల కేంద్ర మంత్రి డా॥ బి. వి. కేస్కార్ అంతర్జాతీయ ప్రదర్శనకు తగిన మంచిచిత్రం ఒకటీ ఇండియాలో తయారు కాలేదన్నారు. ఒక సంగతి ఆయనకి తెలియదు. సినిమా నిర్మాణానికి ప్రాథమిక అర్హతలేమీ లేవు. ఎవరైనా సినిమా తీయవచ్చు. రాజకీయ నాయకులకు అర్హతలు అక్కర్లేనట్లే సినిమా నిర్మాతలకు కూడా అక్కర్లేదు. అందుచేత రాజకీయ నాయకుల్లో మంచివారు, చెడ్డవారు ఉన్నట్లే సినిమాల్లో కూడా మంచివి, చెడ్డవి ఉంటాయి. అంతమాత్రాన సినిమా పరిశ్రమనంతటినీ నిందించరాదు.

ఇండియాలో ఇప్పటికి తయారైన అయిదువేలచిత్రాల్లో ఒక్కటైనా మంచిది లేదా? అన్నీ చెడ్డవే అయితే ప్రజలు వాటిని ఇన్నేళ్ళు ఎలా చూశారు? వారి

ఆదరంమీద నే గదా ఫిలిం పరిశ్రమ బ్రతికేది? విజయవంతమైన చిత్రాల్లో దేన్నయినా తీసుకోండి. వాటిల్లో అవినీతి, అసభ్యత ఎక్కడైనా ఉన్నదేమో చూపండి. ప్రజలు అవినీతినెప్పుడూ సహించరు. వారికి అవసరమైన చిత్రాలే మేము తయారుచేస్తాము. ప్రజలకిష్టముంటే మాచిత్రాలు చూస్తారు, లేకపోతే మానేస్తారు. అంతేగాని ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి అయిన వ్యక్తి పనిగట్టుకుని సభల్లో 'సినిమాలు చూడవ"ద్దని చెప్పడం అన్యాయం. సినిమాలు చూడాలో అక్కర్లేదో ప్రజలే నిర్ణయించుకుంటారు.

ప్రభుత్వం మానుండి అనేక కోట్లరూపాయలు పన్నులరూపంలో వసూలు చేస్తోంది. ప్రతిఫలంగా మాకు ప్రోత్సాహం ఇవ్వవలసిందిపోయితీవ్రవిమర్శలు చేస్తున్నారు."


తరవాత వాసన్ తను "చంద్రలేఖ" చిత్రం తాలూకు వివరాలు కొన్ని తెలిపారు. ఈ చిత్రానికి నాలుగుకోట్ల రూపాయలు వసూలైంది. ఇందులో $1\frac{1}{2}$ కోట్లు వినోదపు పన్ను కింద ప్రభుత్వానికి పోయింది. $1\frac{1}{4}$ కోట్లు సినిమా ఎగ్జిబిటర్లకు పోయింది. 25 లక్షలు డిస్ట్రిబ్యూటర్లకు పోయింది. 28 లక్షలు ఇన్కమ్‌టాక్సుకింద తీరిపోయింది. 67 లక్షలు నిర్మాణానికి, పబ్లిసిటీకి ఖర్చయింది. పోతే వాసన్ గారికి 5 లక్షలు మాత్రమే లాభం మిగిలింది.

"చంద్రలేఖవంటి గొప్ప విజయవంతమైన చిత్రం గతే ఇలావుంటే ఇక మిగతా చిత్రాల సంగతి చెప్పేదేముంది? సినిమా రంగంలోనివారు ఏదో బావుకుంటున్నారని ప్రజ లనుకుంటారు. కాని నూటికి 90 మంది నష్టపోతున్నారు," అని వాసన్ చెప్పారు. ★

రష్యన్ దర్శకుడు పుడోవ్కిన్

ప్రసిద్ధ రష్యన్ సినిమా దర్శకుడు వ్సెవలోడ్ పుడోవ్కిన్ ఇటీవల చనిపోయినట్లు బొంబాయి "స్క్రీన్" పత్రిక ఒకవార్త ప్రకటించింది. పుడోవ్కిన్ మరణం చలనచిత్ర కళాభిమానులందరికీ విచార కారణం.

రష్యన్ చలనచిత్ర కళకు ప్రపంచ ఖ్యాతి సంపాదించి పెట్టిన పలువురు దర్శకులలో ఐజెన్‌స్టీన్, పుడోవ్కిన్ ముఖ్యులు. ఐజెన్‌స్టీన్ చిత్రం "యుద్ధనౌక పోటెమ్కిన్" పుడోవ్కిన్ చిత్రం "మదర్" ఈరెండూ పాశ్చాత్య దేశాల్లో ప్రేక్షకులకు విభ్రాంతి కలిగించాయి. ఐజెన్‌స్టీన్ లాగానే పుడోవ్కిన్ కూడా



అఖిల భారత సినీ టెక్నీషియన్స్ ద్వితీయ సమావేశం కిందటినెల కలకత్తాలో జరిగినప్పుడు తీసిన ఫొటో: ప్రధాన కార్యదర్శి ఎన్. కృష్ణస్వామి, సుధీన్ ఘటక్, నిర్మల భట్టాచార్య, దేవకీబోస్, పశుపతి ఛటర్జీ, మైక్రోఫోను వద్ద కె. రామనాథ్.

దర్శకుడుగాను, ఫిలిం సిద్ధాంతకారుడుగాను ప్రసిద్ధి చెందాడు.


పుడోవ్కిన్ 1893 లో జన్మించాడు. 1920 లో సినిమాల్లోకి అడుగుపెట్టి 1925 వరకూ అనేక చిత్రాల్లో నటించాడు. తరవాత స్వయంగా చిత్ర నిర్మాణం ప్రారంభించాడు. *Chess fever* (చదరంగపు పిచ్చి) అనే హాస్య చిత్రం మొదటిది. తరవాత చిత్రం *Mechanics of the brain* (మెదడు ఎలా పనిచేస్తుంది?) అనే వైజ్ఞానిక చిత్రం. ఇవాన్ పావ్లావ్ అనే రష్యన్ శాస్త్రజ్ఞుని సిద్ధాంతాలను ప్రజాసామాన్యంలో ప్రచారం చెయ్యడానికి పుడోవ్కిన్ ఈచిత్రం తీశాడు. తరవాత *Mother* (అమ్మ) *End of St. Petersburg* (సెంట్ పీటర్స్‌బర్గ్ నగర పతనం), *Storm over Asia* (మంగోలియన్ చరిత్రకు సంబంధించిన కథ) మొదలైన చిత్రాలు తీశాడు. ఇవన్నీ సైలెంటు చిత్రాలే. అతని టాకీ చిత్రాల్లో గొప్పపేరు పొందినది "జనరల్ సువరోవ్" అనే చారిత్రక చిత్రం. రెండవ ప్రపంచ యుద్ధ సమయంలో "ఎడ్మిరల్ నఖిమోవ్" అనే మరొక గొప్పచిత్రం తీశాడు.

పుడోవ్కిన్ చిత్రాలన్నిటిలోకీ చిరస్మరణీయమైనది "మదర్". మాక్సింగోర్కీ వ్రాసిన అదేపేరుగల నవల ఈచిత్రానికి ఆధారం.

పుడోవ్కిన్ సినిమాకళపై "ఫిలిం టెక్నిక్" అనే గ్రంథమొకటి రచించాడు. ఇది వ్రాయబడి 20 ఏళ్లకు పైగా అయినా ఈనాటికీ ప్రమాణ గ్రంథంగా గౌరవించబడుతున్నది. ఇదికాక "ఫిలిం ఆక్టింగ్" అనే మరొక వ్యాస సంపుటికూడా ప్రచురించాడు. సినిమాకళను గూర్చి సిద్ధాంతీకరించడానికి ప్రయత్నించిన మొదటి వ్యక్తుల్లో పుడోవ్కిన్ ఒకడు. అతని సిద్ధాంతాలు కొన్ని ఏనాటికైనా ప్రమాణంగా అంగీకరించవగినవి: (1)



మాంటేజ్ సిద్ధాంతకారుడు శ్రీ వి. ఐ. పుడోవ్కిన్



విజయవాడ, ఆంధ్ర సాంస్కృతిక మహాసభల (1953) సందర్భంలో జరిగిన నాటకపోటీల్లో శ్రీ డి. వి. నరసరాజుగారి "నాటకం" అనునాటకం ప్రదర్శించి ప్రథమ బహుమతి పొందిన నవ్యకళా మండలి (విజయవాడ) సభ్యులు, తదితరులు:—(కూర్చున్నవారు) పి. వెంకటేశ్వరరావు. కె. వెంకటేశ్వరరావు, డా॥ రాజారావు. ఎ. పి రావు, ప్రఖ్య శ్రీరామమూర్తి (నిలబడినవారు) ఎమ్. వి చలపతిరావు, ఎమ్. చంద్రశేఖరరావు, పి. సుబ్రహ్మణ్యం, కె. కె. నాయుడు. డి. జగన్నాథరావు, వి. సూర్యనారాయణ, సి. ఎస్. కృష్ణమూర్తి

సినిమాకళ ఎడిటింగ్‌తో ప్రారంభమౌతుంది. ఎడిటింగ్ పని చిత్రమంతా షూట్ చెయ్యబడిన తరవాత జరిగేదికాదు. సినేరియో రచన దగ్గర్నించీ ఎడిటింగ్ జరుగుతుంది. (2) సినిమాల్లో నటీనటులు ముఖ్యులు కాదు; ఎందుకంటే నటీనటులకు సంబంధించినంత వరకూ సినిమాలకూ నాటకాలకూ పెద్ద భేదం లేదు. సినిమా అనే ప్రత్యేక కళ ఎడిటింగ్‌తో ప్రారంభమవుతుంది కనుక సినిమాల్లో డైరెక్టరే ప్రధానవ్యక్తి.

ఇవీ పుడోవ్కిన్ ప్రధాన సిద్ధాంతాలు.

పుడోవ్కిన్ సుమారు రెండున్నరవిళ్ల క్రితం రష్యన్ ఫిలిం ప్రతినిధి వర్గంతో కలిసి ఇండియా వచ్చాడు. ఆసందర్భంలో ఆయన మద్రాసు కూడా వచ్చి కొన్ని సభల్లో ఉపన్యసించాడు. ఆఉపన్యాసాలు విన్నవారికి ఆయన సౌజన్యం, నిరాడంబరత, వాగ్ధాటి ఎప్పటికీ జ్ఞాపకం ఉంటాయి. ★

"దేవదాసు" జంటతో ఇంటర్‌వ్యూ

శ్రీ కొడవటిగంటి కుటుంబరావు

వినోదావారి "దేవదాసు" జూన్ 26 న విడుదలయి మొదటివారం పూర్తి కాకుండానే అంతులేని కీర్తి గడించింది. ప్రేక్షకులనోట "అద్భుతమైన చిత్రం" "అసమానమైన చిత్రం," "ఇంతవరకు వెలువడ్డ చిత్రాలలో ఇటువంటిది లేదు" మొదలైన ప్రశంసలు ఎడతెరిపి లేకుండా వినవస్తున్నాయి. ఇందులోని నటులందరూ - అందులోనూ ప్రత్యేకించి నాయికా నాయక పాత్రధారులు సావిత్రీ, నాగేశ్వరరావులు విశేషంగా ప్రశంసలందుకుంటున్నారు. డైరెక్టర్ వేదాంతం రాఘవయ్యగారికీ, సంగీత దర్శకుడు సి. ఆర్. సుబ్బరామన్‌గారికీ, కామెరామాన్ రంగాగారికీ "దేవదాసు" మరింత ఖ్యాతి తెస్తున్నది.

ఈచిత్రానికి వస్తున్న డబ్బు చూసి కొందరు "డిప్రెషన్" ఎక్కడ అని అడుగుతున్నారు. ఈ చిత్రం శత దినోత్సవాలు చేసుకుంటుందో, రజతోత్సవాలు చేసుకుంటుందో, నిర్మాతల కెంత లాభాలు తెచ్చి పెడుతుందో అది ఈనాడు మన కనవసరం. దీనిని ప్రజలు ఇంతగా మెచ్చుకోవటంలో మనం గమనించదగిన విషయాలు ఇతరమైనవి చాలా ఉన్నాయి. "దేవదాసు" విజయం శరత్ బాబు విజయం; పరోక్షంగా ఇది సాహిత్యానికి విజయం; ఈకాలపు చిత్రనిర్మాతలు కొందరు తృణీకరించే కళాసిద్ధాంతాలకు విజయం; నిర్మాతలచేత అభిరుచి లేనట్లు భావించబడే ప్రజలకుకూడా ఇది విజయమే.

"దేవదాసు" నవల చక్రపాణిగారిచేత అనువదించబడిన తరువాత రెండుసార్లు పత్రికలలో సీరియల్‌గా ప్రచురించబడి పుస్తకరూపంలో నాలుగుసార్లు ముద్రించబడింది. 1935 లో న్యూథియేటర్స్‌వారు బెంగాలీ, హిందీ భాషలలో దీనిని విజయవంతంగా "ఫిల్మ్" చేశారు; హిందీ "దేవదాసు" భారతదేశమంతటా విజయయాత్ర జరిపింది. ఈనాడు మళ్ళీ వినోదావారు తెలుగు తమిళ భాషలలో దీన్ని చిత్రంగా తీశారు. తెలుగులో చిత్రం విడుదల అయింది, తమిళచిత్రం విడుదల కానున్నది.

ఈ చిత్రంలో ప్రధానపాత్రలు నిర్వహించిన నాగేశ్వరరావు, సావిత్రిగార్లకు ఈ పాత్రలు నిర్వహించటం ఒక కొత్త అనుభవం అయిఉండాలని ఊహించి వారి అభిప్రాయాలు సేకరించటానికి పూనుకున్నాను. ఇరువురూ నా ఊహను బలపరిచారు. ఇద్దరికి ఇది కొత్తఅనుభవమే.

"నిజంగా నేనే నిటువంటి పాత్రను ఎన్నడూ ధరించలేదు," అన్నాడు నాగేశ్వరరావు. "'లైలామజ్ను'లో ఖయాస్ పాత్ర ఉన్నదంటే అది ఒకవిధంగా బండ పాత్ర. ఆ పాత్రలోపల అలలూ, తుఫానులూ లేవు. ఈ దేవదాసు పై స్వరూపానికీ, లోపలి స్వరూపానికీ తేడా ఉంది.

"దురదృష్టవశాత్తూ హిందీ 'దేవదాసు' నేను చూడలేదు. మా నిర్మాతలు చాలా శ్రమపడి కూడా కాపీ తెప్పించలేకపోయారు. నాకీ నవలతో గల పరిచయమల్లా చక్రపాణిగారి నవలే. నేను 'బాలరాజు'లో నటించే రోజుల్లో చాలా తెలుగు పుస్తకాలు తెప్పించుకున్నాను. యువ ప్రచురణలు బోలెడు కొన్నాను. 'దేవదాసు' చదివాను. కాని ఆ దేవదాసు పాత్ర నేనే వెయ్యవలసివస్తుందని ఊహించనైనా లేదు. తీరా ఈ భారం మీదపడ్డాక



"[illegible] అయినా [illegible], [illegible] [illegible]" అని ఆయాసపడుతున్న [illegible].

నేషనల్ ఆర్టువారి "పిచ్చిపుల్లయ్య" లో ఎన్. టి. రామారావు

మళ్ళీ చదివాను. ఆమాట కొస్తే 'దేవదాసు' షూటింగుకు బయల్దేరినప్పుడల్లా ఆరోజు షూటింగ్ చెయ్యవలసిన భాగం చదువుకుని మరీ వెళ్ళేవాణ్ణి. నేనే గాదు మాతోటి - అంటే డైరెక్టరు వేదాంతం రాఘవయ్యగారు - ఆయనా ఇద్దరికీ 'మాయాలోకం' నాటి సంగతిత్వం - ఆయనకు నేనూ తోటినే - ఆయనా రోజూ పుస్తకం చదివే షూటింగుకు వచ్చేవాడు.

"మొట్టమొదటనే ఒక్క విషయం రూఢిచేసుకున్నాను. ఈ దేవదాసుకథ ఒక జీవితకథ - 'బయోగ్రఫీ'. ఇటువంటి చిత్రాలలో - 'పాతాళ' 'త్యాగయ్య' వంటి చిత్రాలలో - ఒక చిక్కున్నది: ప్రధానపాత్ర ధరించేవాడు ఒక మాదిరిగా నటించాడన్న పేరురావటం అసంభవం. నేను దేవదాసు బాగా చేశానన్నా అనిపించు

కోగలను లేదా ఆ పాత్రకు పనికిరానని పేరు అనిపించుకోగలను. మధ్యమార్గం లేదు. అందుచేత నా దృష్టి కేవలం పాత్ర మీద కేంద్రీకరించాను. రాఘవయ్యగారుకూడా అంతే. ఎందుకూ! నేను 'దేవదాసు' షూటింగున్న రోజు మరొకచోట షూటింగుకు పొయ్యేవాణ్ణికాను."

"దేవదాసు" నవల చదివినప్పుడు - ముఖ్యంగా దేవదాసు పాత్ర ధరించే వుద్దేశంతో చదివినప్పుడు నాగేశ్వరరావుకు ఆపాత్రనుగురించి కొన్ని స్పష్టమైన అభిప్రాయాలేర్పడి ఉండాలి. చివరకు తెరమీద కెక్కిన పాత్ర నటుడికి సంతృప్తి కలిగించేదిగా ఉందా?

"ఆమాట చెప్పలేను. నా అభిప్రాయాలను డైరెక్టరుతో చర్చించటానికి మటుకు నాకు పూర్తి అవకాశం చిక్కింది. నేను

"దేవదాసు" జంటతో ఇంటర్‌వ్యూ

ఉచ్చించేవాళ్ళే. మా డైరెక్టరుగారు వినేవారు. చక్రపాణిగారి అనువాదం తప్ప నాకింకో ఆధారంగాని ప్రమాణం గాని లేదనేది జ్ఞాపకం ఉంచుకోండి. ఆ ప్రమాణం ప్రకారం దేవదాసు పాత్రలో కొన్ని మార్పులు జరిగాయి. చాలావరకు స్వల్పమార్పులు. రెండు మాత్రం ముఖ్యమైన మార్పులు. నా ఉద్దేశంలో ఈ మార్పులు దేవదాసు పాత్రను మార్చివేస్తున్నాయి. అసలు దేవదాసు కొంచెం చపలచిత్తుడల్లే కనిపిస్తాడు. అతను పార్వతి కొక లేఖ రాస్తాడు. అందులో తనకు పార్వతిమీద ప్రేమ ఎన్నడూ లేదంటాడు, స్నేహం మాత్రమే ఉందంటాడు. అదేకాక దేవదాసు పార్వతినే పెళ్ళాడాలని ఎటువంటి యత్నమూ చెయ్యలేదు. కాని మా కథలో దేవదాసు తండ్రితో పార్వతిని పెళ్ళాడతానంటాడు. దేవదాసు లేఖ కూడా మారింది. ఈ మార్పులు మన ప్రేక్షకుల దృష్ట్యా అవసరమన్నారు. నేను బుద్ధిపూర్వకంగా ఈ రెండు మార్పులకూ ఒప్పుకున్నాను. ఒకటి రెండు పొరపాట్లు జరిగాయి. అవి పొరపాట్లని తెలిసి కూడా నివారించలేకపోయినాను. ఉదాహరణకి దేవదాసు తప్పతాగి పాడే పాటలో లోతైనంత సంగీతం ఉంది. దాన్ని గురించి మరి ప్రజలేమనుకుంటున్నారో నాకు తెలీదు."

ప్రేక్షకులు ఇంతకన్నా పెద్దపొరపాట్లను కూడా తమ కిష్టమైతే సహించగలరని నా నమ్మకం.

"ఏమైనా మొత్తంమీద నా తాతగారు నా ఒప్పుదల లేకుండా ఏమీ చేయలేదు. నాకిష్టం లేకుండా ఒప్పుకుంటే మటుకేం గాక. అన్నట్టు నాకిష్టం లేకుండా ఒప్పుకున్నందుకు ఒకసారి బయటపడిపోయాను. డైరెక్టరుగారు నన్ను పట్టుకున్నాడు. నాకిష్టంలేదని ఎట్లా తెలిసిందన్నాను. నా ముఖం బుర్రబుంజల్లే ఉందన్నాడు. ఉండే ఉండాలి. నాకైతే తెలీదు...ఆర్టిస్టుగా నేను నాకు సమ్మతం కాకుండా డైరక్టరు చెప్పినట్టు చెయ్యటం జరుగుతుంది. కాని అట్లా చేసిన నటన నాకూ బాగుండదు, ఇతరులకూ బాగుండదు. ఎందుకూ? 'సంసారం'లో బాగా చేశానని అన్నారే గాని నాకింతవరకూ చిత్రంలో నాపాత్ర ఏమిటో తెలీదు. అందులో నా నటన బాగుండటానికి వీల్లేదు. దేవదాసు పాత్ర నలుగురికీ బాగుండటమే గుర్తు నేను పాత్రను ఇష్టపడి చేశాననటానికి."



ముత్తైదకొట్టు విచారిస్తున్న మంగమ్మను ఓదారుస్తున్న ముసలిరైతు

ప్రసాద్ ఆర్టువారి "పెంపుడు కొడుకు"లో పుష్పవల్లి, అచ్చయ్యాచౌదరి.

దేవదాసుపాత్రను నిర్వహించటంలో పక్కపాత్రల సహకారం ఏపాటి లభించి ఉంటుంది?

"నాకు పక్కవాళ్ల సహకారం ఎప్పుడూ ఉంటుంది. ఎందుకంటే నేనెప్పుడూ సెట్టుమీద వారికంటె చాలా తక్కువ స్థాయిలో ఉంటాను. నేను బిర్రబిగిస్తే కద, వారు నాతో తమ కెందుకనుకునేది? నాకు పక్కనటుల సహకారం పూర్తిగా ఉంది. ముఖ్యంగా సావిత్రి, లలిత కూడా నాతో చాలాబాగా కలిసివచ్చారు.

"ఈచిత్రం బాగా ఉందని నలుగురూ అంటున్నారని కాదు. నేనీపాత్రకోసం చాలా శ్రమపడ్డాను. ఈ పాత్రకు న్యాయం చెయ్యలేకపోతే నటుడుగా నేను దెబ్బ తింటానని పించింది. ముప్ఫై అయిదు చిత్రాల అనుభవం ఇందులో పెట్టాను. వేదాంతం రాఘవయ్యగారు కూడా తన భావనాశక్తి యావత్తూ వినియోగించి ఈ చిత్రంతీశారు. ఆయన పూర్వానుభవం కూడా ఈచిత్రానికి బాగా ఉపకరించింది. వనకటి చిత్రాలలో కన్న ఇందులో ఆయన శక్తి చాలా హెచ్చుస్థాయికి వచ్చింది," అన్నాడు నాగేశ్వరరావు.

"నేను పార్వతిలాంటి కష్టమైన పాత్రను ఎన్నడూ చెయ్యలేదు," అన్నది సావిత్రి. "ఈపాత్రను ధరించవలసి ఉందని తెలియగానే చక్రపాణిగారి పుస్తకం వరసగా అయిదుసార్లు చదివాను. ప్రతిసారీ పార్వతి పాత్రలో లీనమైపోయేదాన్ని. ఆపాత్రను గురించి తెలుసుకుంటే నే ఏడుపొచ్చేది. నేను చాలా వేషాలు వేస్తున్నాను గాని ముందుగా క్షుణ్ణంగా పాత్రను అర్థం చేసుకునే అవకాశాలు చాలా తక్కువ. ప్రతి వేషంగురించీ ఇల్లా ముందు తెలుసుకునే అవకాశం ఉంటే ఇంకెంత బాగా నటించగలనో అనిపిస్తుంది. పుస్తకం చదివినప్పుడు కూడా ఈ పాత్రను విజయవంతంగా నటించగలుగుతానని నేను అనుకోలేదు."

పూర్వం ఎన్నడూ ఇలాటి పాత్ర ధరించకపోవటంవల్ల సావిత్రి తన శక్తిని తానే తెలుసుకోలేకపోయి ఉండవచ్చు. కాని ఈ శక్తిని పైకి తేవటానికి విశేషంగా ఎవరు తోడ్పడ్డారు?

"నాకు డైరెక్టరుగారి సహాయం చాలా ఉంది. సెట్టుమీద అందరమూ కథలో లీనమైపోయేవాళ్లం. నా పాత్రను బాగా నిర్వహించటానికి ఆయన పూర్తి అవకాశాలిచ్చారు. నాకు తృప్తిలేక మళ్ళీ షాట్ తీయమంటే ఎటువంటి అభ్యంతరమూ చెప్పకుండా తీసేవారు. అనేకమార్లు నాకు ఆ సంభాషణలు చెబుతుంటేనే పార్వతి జీవితమంతా జ్ఞాపకం వచ్చి దుఃఖం పొంగి



విజయవంతంగా వారాల తరబడి నడుస్తున్న ఫిల్మిస్తాన వారి "అనార్కలీ" లో బీనారాయ్.

వచ్చేది. అందుకే ఎక్కడో గ్లిసరిన్ వాడితే అవసరమే కలగలేదు. షాట్ అయిపోయినాక కూడా ఏడిచేదాన్ని. ఒకవంక డైరెక్టరుగారు కూడా ఏడుస్తుండేవారు. నాకే విచిత్రంగా ఉండేది.

"పార్వతి పాత్రలో ఒక చిత్రం ఉంది. ఒకొక్కప్పుడు ఆమె ఏడవకుండానే ఇతరులకు ఏడుపు తెప్పిస్తుంది. మనం ఏడిచి ఇతరులను ఏడిపించేకన్న మనం ఏడవకుండానే ఇతరులను ఏడిపించటంలో ఎక్కువ తెలివి లేదూ?

'దేవదాసు'లో కొన్ని ఘట్టాలు నాకు చాలా బాగున్నాయి. పార్వతి దేవదాసును తానుకూ మానమని అడిగే ఘట్టం ఒకటి. దేవదాసు పార్వతిని కొట్టే ఘట్టం ఒకటి. మొదట తన తల్లిదండ్రుల కిష్టంలేని కారణంచేత పెళ్ళాడలేనన్న దేవదాసు, పార్వతి పెళ్ళి నిశ్చయమైనాక తననే పెళ్ళాడమంటే పార్వతి 'నాకుమాత్రం తల్లిదండ్రులు లేరా?' అని అడిగే ఘట్టం ఒకటి. భర్తతోనూ, సవతికొడుకుతోనూ, సవతికూతురుతోనూ మాట్లాడే ఘట్టాలూ—

(56-వ పేజీ చూడండి)



ఆంధ్ర మహిళాసభ విద్యార్థిని శ్రీమతి డి. రాధ
"మార్వాడీ నృత్యం."

"ప్రపంచం"

[illegible] "ప్రపంచం" చిత్రానికి [illegible] ప్రత్యేకించి [illegible] ఒకే [illegible] జరగలేదు. [illegible] కాలమూ, [illegible] ఘట్టం [illegible], 2½ [illegible] (సుమారు 48 [illegible]) ఇవి అనేక [illegible], అనేక వ్యక్తులకు చెందిన [illegible] కథ అనీ, ఇది ప్రపంచం కథ అనీ నిర్మాతలు ప్రకటించారు. ప్రపంచంలో కనిపించే అనేక తరహాల వ్యక్తులను, జరిగే అనేక సంఘటనలను సాధ్యమైనంత ఎక్కువగా చూపించడానికి ప్రయత్నించారు. అందులో చాలా [illegible] కత్తిరించి మూడు గంటలకాలానికి కుదించినా, ఇంకా అనేక పాత్రలు, ఎన్నో వేషాలు మనకి కనిపిస్తాయి. వీటన్నిటిని ఒకే కథగా గుచ్చెత్తడానికి కూడా నిర్మాతలు ప్రయత్నించారు.

కుమారి కమల, లలిత, పద్మినుల నృత్యాలు, వి. నాగయ్యపాట, మైక్రోఫోనులో శ్రీ శ్రీ ప్రకటనలు, దారాసింగ్ అలీ రజా బేలకుస్తీ, చిరతపులి, మనిషిపోరాటం, బోలెడుపాటలు, ఒక కారు ప్రమాదం. మూడు పెళ్ళిళ్లు - "ప్రపంచం"లోని అసంఖ్యాక విషయాల్లో ఇవి కొన్ని.

ఈచిత్రం నిర్మాత, సంభాషణా రచయిత శ్రీ ఎమ్. హెచ్. ఎమ్. మూనాస్; కథ సినేరియో శ్రీమతి మూనాస్; తెలుగులోకి తర్జుమా, పాటల రచయిత శ్రీ శ్రీ; నటీనటులు జి. వరలక్ష్మి, లక్ష్మికాంత, జానకి, కనకం, ఛాయాదేవి, రామశర్మ, రఘురామయ్య, నల్ల రామమూర్తి, వల్లం నరసింహారావు తదితరులు. ★

గ్రిఫిత్ చిత్రం

విశాల ప్రపంచాన్ని, అందులో జరిగే అనేక సంఘటనలను, కనిపించే అనేక వ్యక్తుల జీవితాలను ఒకే చిత్రంలోకి తీసుకురా ప్రయత్నించడం సాహసమైనా, ప్రయత్నించి నెగ్గినవారు సినిమా చరిత్రలో లేకపోలేదు. అమెరికన్ చలనచిత్ర పితామహుడని పిలువబడే డి. డబ్ల్యు. గ్రిఫిత్ అట్టివారిలో ఒకడు. అయన *Intolerance* (అసహనం) అనే చిత్రం ముప్ఫయ్యేళ్లకు పూర్వం తీశాడు. ఆ చిత్రంలో ప్రపంచ చరిత్ర యావత్తూ సమీక్షించబడింది. నాలుగు కాలాలకు చెందిన నాలుగు కథలు ఆ చిత్రంలో ఒకేసారి నడుస్తాయి. బాబిలోనియన్ నాగరికత పతనం, ఏసుక్రీస్తు జీవితం, 1572 లో పారిస్‌లో సెంట్ బార్తొలోమ్యూ పండుగనాడు జరిగిన [illegible] హత్య, ఆధునిక కాలంలోని ఒక నిరుపేద కార్మికునిజీవితం - ఈ నాలుగు కథలు సమ్మేళనం చేయబడ్డాయి. అయితే గ్రిఫిత్ గొప్ప మేధావి గనుక ఈ నాలుగు కథలకూ ఒకే ప్రాతిపదిక ఉండేట్లు, ఒకే సారాంశం ఉండేట్లు జాగ్రత్త పడ్డాడు. అసహనం అనే దుర్గుణం మానవజాతిని ఆదిమ కాలం నుంచీ విడువకుండా ఎలా అనుసరిస్తూ వస్తోందో, దానివల్ల ఎటువంటి దుష్ఫలితాలు కలిగాయో చూపించడం ప్రయోజనంగా పెట్టుకుని గ్రిఫిత్ 'ఇన్‌టాలరెన్స్'' తీశాడు. ఈ చిత్రం సినిమాచరిత్రలో ఒక మైలురాయిలాంటిది. అందులో గ్రిఫిత్ కథ చెప్పడానికి అవలంబించిన టెక్నిక్ ఈనాటికీ అనేకమంది దర్శకులకు మార్గదర్శకంగా వుంది.

ఈ చిత్రంకోసం గ్రిఫిత్ 80 రీళ్ళ నెగటివ్ ఫిల్ము తీసి చివరకు 12 రీళ్ళకు కుదించాడట. అంత విశాలమైన ప్రాతిపదిక గల కథ చిత్రించడానికి మళ్ళీ గ్రిఫిత్ దిగి రావాలి. ★

★ ప్రశ్నలు - సమాధానాలు ★

శ్రీ వి. యల్. బుద్ధి—అవనిగడ్డ.

త్రీ-డీ చిత్రాలవల్ల ప్రేక్షకులయొక్క మానసిక్రోధ కాలతోబాటు చిత్తచాంచల్యము, మనోదౌర్బల్యము తద్వారా దేహసంబంధవ్యాధులుకూడా ఇతోధికంగా ప్రబలుతాయని నా నమ్మకము. మీరేమంటారు?

—త్రీ-డీ చిత్రాలుచూడ్డానికి పోలరైజ్డ్ గ్లాసెస్ ధరించాలి కనుక కళ్లు కొంచెం దెబ్బతింటాయని అభిజ్ఞులంటున్నారు. మీరుచెప్పిన ఫలితాలన్నీ కలుగుతాయో లేదో ఇంకా ఎవరూ రీసెర్చి చెయ్యలేదు.

*　　*　　*

శ్రీ బి. సత్యనారాయణ—విజయనగరం.

'దేవదాసు' చిత్రంలో సెన్సారు చేయబడిన భాగము లేవి?

—శరత్ చిత్రించిన దేవదాసు, పార్వతి, చంద్రముఖి పాత్రలను వినోదావారే కొంతవరకు సెన్సార్ చేశారు. ఈ సెన్సారింగ్ తరవాత ప్రభుత్వ సెన్సార్ అధికారులు ఏమి సెన్సార్ చేసినా ఇబ్బంది లేదు.

*　　*　　*

శ్రీ కూరపనేని పాండురంగారావు—గుడివాడ.

మన చిత్రనిర్మాతలు 'కొంగలమ్మాయి' కథకూడా చిత్రముగ నిర్మిస్తే బాగుండునని నా యభిప్రాయము. మీ వుద్దేశ్యమేమిటి?

—ఆ బాపతు చిత్రాలు మనవారు తీయలేదని మీ అనుమానమా?

*　　*　　*

శ్రీ పోలవరపు మాధవరావు—ప్రనాదిపాడు.

వినోదావారి 'దేవదాసు'లో చివరకు పార్వతి చనిపోయింది, లేనిదీ, సరిగా చూపించలేదు ఏమైనట్టు?

—ఆమె ఏమైనదో శరత్ బాబుకూడా స్పష్టం చెయ్యలేదు. బ్రతికివున్నా, చనిపోయినా ఆమెకథ విషాదాంతమేననే ఉద్దేశ్యంతో అలా వదిలివేశాడు. 'దేవదాసు చనిపోయినతరవాత పార్వతిమాత్రం బ్రతకగలదా' అని కొందరనుకోవచ్చు. 'ఎందుకు బ్రతకలేదు? ఎంతమంది బ్రతికి వుండడంలేదు?' అని కొందరనుకోవచ్చు. ఎవరి మనస్తత్వం ప్రకారం వారు ఊహించుకుంటారు. అందుచేతే వినోదా వారు కూడా అవిషయం అస్పష్టంగా వుంచివేశారు.

*　　*　　*

శ్రీ ఎమ్. శ్రీనివాసరావు—పొడలకూరు.

15-7-53 తేదీ వారపత్రికలో 'రష్యాలో భిక్ష మెత్తెడి బిక్క బైరాగులు కనిపించర'ని డాక్టరు వామనరావుగారు వ్రాశారు. రష్యాను స్వయంగా చూచిన కుమరప్పగారు బిచ్చగాళ్ళను చూచానన్నారు. యీ రెంటిలో ఏది నిజం, ఏది అబద్ధం మహాశయా?

*　　*　　*

—దెయ్యాలు లేవని కొందరంటారు. దెయ్యాలను స్వయంగా చూశామని కొందరంటారు. ఇందులో 'ఏది సత్యం ఏదసత్యం?' రష్యాలో బిచ్చగాళ్ళ సంగతి కూడా అంతే.

శ్రీ పెద్దాడ జానకిరామమూర్తి—శిరవాసరం.

ఇప్పటి మన దేశపరిస్థితినిబట్టి మనకు జానపద పౌరాణిక చిత్రాలకంటె, సాంఘిక చిత్రాలు ఎక్కువ తీయాలంటాను. దానికి మీరేమంటారు?

—మీ రన్నట్టే ఇప్పుడు సాంఘిక చిత్రాలే ఎక్కువ తీస్తున్నారుగా? ఇది మంచిదే.

*　　*　　*

శ్రీ శ్రీపతి మాధవరావు—తెనాలి.

'సింక్రొనైజేషన్' అంటే ఏమిటి? దీని, నిర్వహణ బాధ్యత ఎవరిమీద వుంటుంది?

—బొమ్మ, మాట ఒకదానితో ఒకటి సరిగా అతికేటట్లు చెయ్యడం సింక్రొనైజేషన్. ఒక్కొకసారి తెరమీద మనిషి నోరు తెరిచి కొంతసేపు పెదవులు కదిపిన తరవాత మాట వినిపిస్తుంది. అటువంటిచోట సరిగా సింక్రొనైజ్ కాలేదన్నమాట. దీని బాధ్యత ఫిలిం ఎడిటర్‌ది.

*　　*　　*

కుమారి కమలాదేవి—హైదరాబాద్

నా నమ్మకంప్రకారంగా సుఖసంపదలు పొందే ఆశతో మహాలక్ష్మినిన్నీ, విద్యాజ్ఞానములు లభించుననే అభిలాషతో సరస్వతీ దేవినిన్నీ పూజించెదను. శివుని భార్యలు పార్వతి గంగా కూడా నాయిష్ట దేవతలే. మరి వారిని ఏమని కోరవచ్చును?

—రుక్మిణీదేవి తాను కోరిన భర్తను తనకు లభించేటట్లు చేయుమని పార్వతీదేవిని ప్రార్థించింది. ఆమెయొక్క కోరిక పార్వతీదేవి నెరవేర్చింది. కనుక వివాహం కాని బాలికలు గౌరీపూజచేసి కల్యాణ సంకల్పసిద్ధిని పొందవచ్చు; గంగాదేవిని స్తోత్రంచేసి ఆరోగ్యమును పొందవచ్చు. గంగానమ్మను పూజచేస్తే మనం త్రాగే గంగను పవిత్రంగా ఉంచి గంగయెడ భక్తితో ప్రవర్తిస్తే అనేక వ్యాధులు మనకు రావు - అనేక వ్యాధులు పోతాయి.

రానురాను విద్యార్థులకు విద్యకన్న వేషమే ప్రధానాంగం అయిపోతున్న దేమి?

—మన దేశంలో ఇంగ్లీషు చదువు బాగా వ్యాపించింది. ఇంగ్లీషువారి స్వదేశం చాలా చలిదేశం. అందువల్ల ఇంగ్లీవారికి దుస్తులెక్కువ అలవాటు. వారికి దుస్తుల ముస్తాబు అనేది వారి నాగరికతలో అంతర్భాగం అయింది. ఇంగ్లీషువారి అలవాట్లు వారి సంప్రదాయాలు వారి వేషభాషా మర్యాదలు, ఆ యింగ్లీషు చదువుతోబాటు మనకు దిగుమతి అయినాయి. ఇంగ్లీషు చదువులో ఉన్న ఉచ్చస్థాయి మన దేశానికి అబ్బలేదు గాని వారి వేషభేషజం మన విద్యార్థులకు సులభంగా, అభ్యాసవశమై అంతకంతకు వృద్ధిఅవుతోంది.

*　　*　　*

శ్రీమతి జి. కమల—రాజమండ్రి.

24-6-53 సచిత్ర వారపత్రికలో కాలక్షేపంలో "ఉద్యోగం పురుష లక్షణం" అని ఉన్నది. వామనరావుగారు ఇంకా పూర్వకాలంలో ఉండి అల్లాగ వ్రాసినారని నా అభిప్రాయం. కాని, యీ కాలంలో నా ఉద్దేశం "ఉద్యోగం మానవ లక్షణం" అని. మీరు నాతో ఏకీభవిస్తారా?

—"పురుష ప్రయత్నమునకు దైవము తోడైనప్పుడే కోరికలు ఫలించును" అనే వాక్యం చూడండి. ఆ వాక్యంలో "పురుష ప్రయత్నం" అంటె అర్థంఏమనగా, మనుష్య ప్రయత్నం అని అర్థం. కాళిదాసుగారి రఘువంశం ఆరంభశ్లోకంలో "జగతః పితరౌ వందే" అన్నారు. జగత్తునకు తల్లిదండ్రులైన పార్వతీ పరమేశ్వరులకు నమస్కరించుచున్నాను అన్నారు. "పితరౌ" అంటే "ఇద్దరు తండ్రులు" అని చెప్పవచ్చు— కాని, "తల్లిదండ్రులు" అనే మాటకు బదులు "పితరౌ" అని వాడినవచ్చు. కనుక "పురుష ప్రయోగం స్త్రీకి కూడా వర్తిస్తుంది. కాబట్టి ఉద్యోగం పురుషలక్షణం అనే వాక్యాన్ని దిద్దవలసిన పని లేదు. ★

★ పెన్షన్ ★

(11-వ పేజీ తరువాయి)

కాలం యింకా సమీపించలేదు. ఏదో పొరబాటున దూతలు తీసుకువచ్చి వుంటారు. అంచేత యింటికివెళ్లి సంసారం దొర్లించు! పో.

రామయ్య: మానవుల ప్రభుత్వాల్లో వున్నట్టు, మీ ప్రభుత్వంలోగూడా ఒకరికి బదులు యింకొకరిని విడిపించడము కూడా వుందన్నమాట! సరే! అది నాకెందుకు గాని, ఆ సంసారభారం నాకు వద్దు ప్రభూ! ఓడీలు లేకపోతే మానె, నే నిక్కడే వుండిపోతాను. ఇంటికి వెళ్లితే రేపటినుంచి గడవటమూ కష్టమే. పైగా పెండ్లి కెదిగిన ఆడపిల్లలు యిద్దరూ, చదువుకునే ఇద్దరు మగకుంకలూ వున్నారు. నా ప్రాణాలు పిండుకొంటుంది, సంసారం. నేను మళ్లీ వెళ్లకున్నాను. నేను ఇక్కడే వుండిపోతాను.

యముడు: మా పనులు మాకు చాలు. నీ గొడవ ఎందుకు వెళ్లు. ఆఫీసు పని చూచుకోవాలి పో.

రామయ్య: నేను వెడితే డబ్బులేకండా ఆ సంసార రథచక్రాలు తిరగవు స్వామీ! ఏదో వుపాయం చెప్పండి.

యముడు: దేవుడే యిస్తాడు పో.

రామయ్య: ఈ మాటతోనే, పెద్దలు ప్రపంచాన్ని మోసగిస్తున్నారు. ఈమాటల మీద నమ్మకంతోనే నేను యింతవరకు నెట్టుకొచ్చాను. యిక నాకు దుస్సాధ్యము.

యముడు: పోతావా, బయటికి గెంటించమంటావా.

రామయ్య: ఈలోకంలోనూ ఈ దౌర్జన్యము వుందన్నమాట! దూరపు కొండలు నునుపు! అన్ని ప్రభుత్వాలు కొంచెము యించుమించుగా ఒకటే నన్నమాట! సరే మా లోకమే వెళ్లి, కలో, గంజో తాగి వుంటాను.

ఇంతలో రామయ్య భార్యవచ్చి "ఇంత పొద్దెక్కినా యింకా పడుకొంటే కాపరం బాగా గడిచినట్లే", అని నాల్గు పెట్టేసరికి, నిద్రమత్తుపోయి నిటారుగా లేచి నుంచున్నాడు రామయ్య. సరే తప్పేదిలేదుగా! ఆ సంసార సాగరంలో తెంపులేని కష్ట తరంగాల్లో తేలుతూ, మునుగుతూ, ఈదుతున్నాడు వుద్యోగం వూడిన పోష్టుమాన్ రామయ్య. ★

★ పుణ్యానికిపోతే ★

(35-వ పేజీ తరువాయి)

చేస్తున్నావురా. యీ పాడు బ్రతుకు బ్రతికే కంటే చావరాదూ" అని మరొకాయన అన్నాడు.

"మొన్న మాముసిల్లి యిలాగే బియ్యం తెస్తుంటే, నేను తీసుకొస్తానంటూ యెవడో అంటే, మాముసిల్లి వాడికామాట యిచ్చిందట. వెంటనే ఆదొంగ పరారైనాడు. అటువంటి వాడే వీడూను" అన్నాడొకతను.

"ఈ రేషను రోజుల్లో బియ్యం దొరక్క మాడుతూంటే, నువ్వేవడ్డురా! పోతులాగున్నావు ఏదన్నా కూలిపని చేసుకోకూడదూ" అన్నాడు ఎత్తిపొడుస్తూ మరొకాయన.

యివన్నీ వింటూంటే కోదండపాణికి కళ్లంట నీళ్లు గిరగిరా తిరిగాయి. "తండ్రి చెప్పినట్లు యితరులకు సాయం చేద్దామనుకొని చివాట్లకు, దెబ్బలకు గురి అయ్యాడు.

విచారంతో తనవూరు వచ్చాడు; జరిగిందంతా తల్లితో చెప్పాడు.

"అవును నాయనా, యీ కాలంలో మంచికిపోతే చెడు వస్తుంది. మీనాన్న చెప్పినట్లు యితరులకు సహాయం చేయడం మంచిదే. కాని అలాచేస్తే యీపాడు ప్రపంచంలో విలువలేదు. పుణ్యానికి పోతే పాపం యెదురౌతుంది. ఎవరి మానానవారు పోతే మంచిది" అని తల్లి ఓదార్చింది.

"అవును, నిజమే. యీకాలంలో మంచికి, న్యాయానికి తావులేదు. అమ్మ చెప్పినట్లు పుణ్యానికిపోతే పాపమే యెదురౌతుంది" అని అనుకొని వూరుకున్నాడు కోదండపాణి. ★

★ కాలక్షేపం ★

(4-వ పేజీ తరువాయి)

ఎండవానల కోర్చుకోలేని సుందేజబ్బులతో తయారైన అల్పాయుష్కులే అధిక సంఖ్యాకు లవుతున్నారు. మనదేశంలోని ప్రజాయుఃప్రమాణం సగటున లెక్క చూస్తే 30 ఏండ్ల ఆయుఃప్రమాణంకూడా ఉన్నదో లేదో. బస్తీలో చేరిన కొద్దీ సుస్తీ ఎక్కువవుతోంది. చేతిపనులు చేజారినవి. ఢక్కా మజ్లీనులు మక్కిలం కేయబోయినవి. పల్లెకీవంటి మహోకల్పులు పల్లకముల పాలైరి. కొండపల్లిబొమ్మలు, కొండపలకుట్టల చెట్టుల పాలైనవి. చేతిపనులకు సైతస్యం పోయినప్పుడు యిక ప్రజలకు ఉపాధులు ఉద్యోగాలే.

ఉద్యోగాలు చేయటంలో ఉత్సాహం ప్రబలింది. మరలకు పనికలిగి మనుష్యులకు పనిపోయింది. స్వతంత్రకుల వృత్తిలో సారస్యం పోయింది. ఉద్యోగం అంటే రూపాయలపంట - ఉద్యోగం దొరకడం మహారాజయోగం. నిరుద్యోగసమస్యను పరిష్కరించడం ప్రభుత్వరాజనీయ యోగం. ప్రపంచరాజ్యాలకు అన్నింటికీ ప్రస్తుతం ప్రత్యక్షమైయున్న సమస్య నిరుద్యోగ సమస్య - నిరుద్యోగులకు ఉద్యోగాలు చూపించాలి. ప్రజలకు ఉద్యోగాలు చూపించడమే ప్రభుత్వ ప్రముఖ కర్తవ్యం. ప్రభుత్వం చూపించేవి స్వతంత్రవృత్తులు కావు - ప్రభుత్వం చూపించేవి ఉద్యోగాలు - కాగితముల నోట్లతో జీతాలు యిచ్చి యీ ప్రజ లనెడి దూడలను ప్రభుత్వం మేపుతూ ఉంటే, ఆ దూడలకు ఇదంతా కృత్రిమమైన మేత. కాని, యీ విధంగా ప్రజలను పోషించడం, యీ విధంగా నిరుద్యోగ సమస్యను పరిష్కరించడం, ప్రజలకు ప్రకృతిసిద్ధమైన గ్రాసమును కల్పించడం కాదు. ఈ కాగితాలనోట్లు పంటకలకాలం ఉండే కలిమి కాదు. కాగితాల మేతవల్ల కామధేనువు కాదు దేశం.

సుదర్శనం అనే ఆయన కష్టపడి కాలేజీలో చదువుకున్నాడు. స్వగ్రామానికి స్వస్తిచెప్పి, చదువుకోసం బస్తీచేరి ఇరవై ఏళ్ళయింది. అందువల్ల అతనికి బస్తీ అంటే పవిత్ర పుణ్యక్షేత్రం అయిపోయింది. తన కళ్ళముందర కలెక్టరాఫీసులో చేరినవాళ్లు, కంట్రోలు ఆఫీసరులై, కామధేనువువంటి ఉద్యోగాలు చేసి, కాలుమీద కాలు వేసికొని కాలక్షేపం చేస్తున్నారు. ఇదంతా సుదర్శనం చూచి, తన భవిష్యత్తంతా బస్తీలో ఉన్నదన్నాడు. కలెక్టరాఫీసులో ఉద్యోగం సంపాదించి, బస్తీలో కాపురం పెట్టాడు. కాని, కమ్మని పెరుగూ, పాలూ త్రాగవలెననే అభిలాషతో, డాల్డా కల్తీలేని కమ్మని నెయ్యి వేసికోవాలనే కోరికతో, ఆ బస్తీలోనే ఒక ఆవును సంపాదించి ఆ అద్దెయింటి పెరటిలోనే దానికి కూడా కాపురం ఏర్పాటుచేశాడు. కాని, అక్కడ దాని మేతకు చిక్కు వచ్చింది. ఎండలు మండిపోతున్నాయి. పచ్చ గడ్డి అనేది పచ్చకర్పూరంలాగున హరించిపోయింది. గడ్డివాము పెట్టుకొనుటకు దొడ్డి చాలదు. ఈ గడ్డు పరిస్థితిలో సులభోపాయంకోసం సుదర్శనం ఆలోచించాడు. ఆవుకు మేత చాలక ఆకలిమంటతో "అంబా!" అని అరుస్తోంది. వార్తాపత్రిక చదువుకుంటూ ఉన్న సుదర్శనం ఆ పత్రిక చదువుకుంటూ తన ఆవువద్దకు వెళ్ళి దాని గంగడోలు దువ్వుతూ కూర్చున్నాడు. ఆకలితో అగుస్తున్న ఆవు వెంటనే ఆ వార్తాపత్రికను హాయిగా ఆరగించడం ప్రారంభించింది అంతర్జాతీయ వార్తలతో సహా - ఏమీ అనకుండా ఇదంతా సుదర్శనం చూచాడు. "కాగితాలు కూడా మేస్తుంది గనుక, కడుపు నింపవచ్చును గదా ఆవిధంగానైనా" అని ఊహించాడు.

మరునాడు తాను కలెక్టరాఫీసుకు వెళ్లేటప్పుడు తన వెంట ఆవునుకూడా ఆఫీసుకు తీసికొనిపోయినాడు. అక్కడ ఆవరణలో ఒక చెట్టుకు కట్టివేశాడు. ఆఫీసులో ఉన్న డఫేదారును బయటికి పిలిచి మెల్లగా చెవిలో చెప్పాడు. ఆఫీసులో చిత్తుకాగితాల బుట్టలను ఖాళీ చేసేటప్పుడు, ఆ చిత్తుకాగితాలను తన ఆవుముందర వేస్తూ ఉండవలసినదని విన్నవించాడు. ఆ డఫేదారు చేసిన మేలు సుదర్శనం మరచిపోనన్నాడు. ఆఫీసులో ఉద్యోగస్థుల మేతకాకుండా, వారి ఆవులకు కూడా పైమేత మేపడం యీ డఫేదారు యిదివరకు ఎరుగడు. అతనికిది కొత్తగా ఉంది-కాని, సరేనని అంగీకరించాడు. ప్రతిదినం బల్లల క్రింద బుట్టలలో నిండిన చిత్తుకాగితాల ముక్కలన్నింటిని తీసికొనిపోయి ఆవరణలో కట్టిన ఆవుముందర ఆ డఫేదారు వేసి వెళ్ళిపోయేవాడు. ఆ మేతకరవుకాలంలో ఆ చిత్తుకాగితాలన్నింటినీ ఆవు మేస్తూ ఉండేది. కలెక్టరుగారి సొంత ఆఫీసుగదిలోకి టపా రాగానే, కవర్లన్నీ హుజూరు ఆఫీసరు చించి, ఆ కవర్లను బల్లక్రింద బుట్టలో పారవేసి ఉత్తరాలన్నీ టపా పుస్తకంలో నమోదు చేసికొని ఆఫీసు దస్త్రాలలోకి చేర్చేవాడు. ఒకరోజున ఒక పెద్దమనిషి కవరులో బ్యాంకు చెక్కును పెట్టి ఒక ఉత్తరం విడిగా వ్రాసి ఆకవరులోనే పెట్టి పంపించాడు. హుజూరు ఆఫీసరుగారు ఆరోజున చీకాకుగా పరాకుగా హడావిడిగా టపా ఉత్తరాలన్నీ చూచుకొని ఆ కవరులో ఉన్న ఉత్తరం తీసి ఆఫీసు దస్త్రంలో దాఖలు చేయించి, కవరును ఖాళీచేశానని తలచి చిత్తుకాగితాల బుట్టలో దానిని పారవేశారు. సాయంత్రం అయ్యేసరికి ఆ చిత్తుకాగితాల బుట్ట చెట్టుకుకట్టిన ఆవుకు నివేదన చేయబడింది. అది ఆనాటికి ఆకలితీరేటట్లు ఆరగించింది. కవరులన్నీ దాని కడుపులోకి వెళ్లిపోయినాయి. మరునాడు హుజూరు గుమాస్తాగారువచ్చి నిదానంగా ఉత్తరాలు చదివి చూచుకున్నారు.

ఒక ఉత్తరంతో ఒక పెద్దమనిషి పంపిన రూ 50/లు బ్యాంకు చెక్కు ఏమైనదో కన్పించలేదు. బల్లక్రింది బుట్టలన్నీ చూచాడు. "దానిలోని కాగితాలన్నీ ఎక్కడ పారవేశావు" అని డఫేదారును అడిగాడు. చిత్తుకాగితాలన్నీ ఒక మూల వేస్తే ఎవరికి చూడవచ్చుననే ఆశతో అదివరకే చిత్తుకాగితాలు వేసేటందుకు కొక రేకు డబ్బాను ఏర్పాటుచేశాడు. కాని, ఆ డబ్బాలో చిత్తుకాగితాలు నమూనాకైనా లేవు. డఫేదారును పిలిచి, అతనిమీద హుజూరు గుమాస్తా ఆగ్రహావేశపరవశుడైనాడు. ఆ చిత్తుకాగితాల చిద్విలాసాంతర్గాన పర్యవసానం అంతా ఆద్యాంతం తెలిసికొన్నాడు. సుదర్శనం అనే కలెక్టరాఫీసు గుమాస్తా, తన ఆవుకు ఆఫీసులో యీ పైమేత అలవాటు చేశాడనిన్నీ, యాభై రూపాయల బ్యాంకు చెక్కు దానికి ఆనాడు గ్రాసమై, దాని కడుపు నింపుకొన్నదనిన్నీ గ్రహించాడు. ఒక్కరోజులో సుదర్శనంగారి ఆవుకు యాభై రూపాయల మేత పెట్టినాడనే కితాబు

★ కాలక్షేపం ★

ఆయనకు వచ్చింది. ఈ సందర్భంలో సుదర్శనంగారు తినినటువంటి పాపిష్టి సొమ్ము ఏదీ లేకపోయినప్పటికీ, కామధేనువువంటి కలెక్టరాఫీసునవుకరీలో ఆయన కామధేనువుకు కాగితాలమేత పోయింది. పశువులకే మేత లేని బస్తీ జీవితంలో గుమాస్తాలు గడ్డి తిన్నా, పశువులు కాగితాలు తిన్నా, వింత లేదనీ, తప్పు లేదనీ, సుదర్శనం యీరోజువరకూ వాదిస్తూనే ఉంటాడు. బస్తీలో రోజుకు యాభైరూపాయల మేత మేపినా, పూటకు అర్ధసేరు పాలైనా యివ్వదు ఆయన ఆవు.

"జనుల పోషింపు మధిప! వత్సముల మాడ్కి" అని ప్రభువులను హెచ్చరించడం ఎందుకంటే, ప్రజలకు సహజసిద్ధమైన స్వతంత్రమైన ఉపాధులను వృత్తివ్యాపారములను, గ్రాసవాసములను ప్రభుత్వం చూపించాలి. ప్రజల లనబడే దూడలు బాగా పాలు తాగాలి. అప్పుడు ప్రభువుల క్షేమం కామధేనువులాగున పాలిస్తుంది. ఆయుఃక్షీణం లేని ఆహారవిహారాలవల్ల ఆత్మవికాసం ప్రజలు పొందాలి. దేశాని కది అంగరక్ష - ప్రభువుల కది కొంగుబంగారం. అప్పుడు,

"జగతి కల్పలత తెఱంగున సకల ఫలంబు లొసగు."

★

★ "దేవదాసు" జంటతో ఇంటర్‌వ్యూ ★

(5వ పేజీ తరువాయి)

కొన్ని ఘట్టాలు నాకు చాలా బాగా నచ్చాయి.

"నాతోబాటు నటించినవాళ్ళు కూడా నాకు చాలా సాయపడ్డారు. నాగేశ్వరరావు గారు తన పాత్రవిషయమేగాక అన్ని పాత్రలవిషయమూ ఎంతో శ్రద్ధగా చర్చించేవారు. ఆయనతో నటించిన దృశ్యాలలో ఆయన సహకారమూ, సి. యస్. ఆర్. గారితో నటించిన దృశ్యాలలో సి. యస్. ఆర్. గారి సహకారమూ నాకు పూర్తిగా ఉండేది.

"పార్వతి పాత్రను తృప్తికరంగా చేశానంటే ఎన్నో సౌకర్యాలు - కథను అనేక పర్యాయాలు ముందుగా చదువుకోవటంతో సహా - లభించబట్టే అది సాధ్యమయింది. లేకపోతే నాకున్న అనుభవంతోనే నాపాత్రను నటించటం సులభం కాదు."

మనం సావిత్రితో ఏకీభవించవచ్చు. మనం తెరమీద చూసే పాత్రలలో ఎక్కువభాగం నటీనటుల సామర్థ్యాన్ని కొంతభాగం అరువుపుచ్చుకునే వేగాని నటులకు ఒక కొత్త అనుభవాన్ని చేకూర్చి వారి శక్తులను పెంపొందించే విబహు తక్కువ. వినోదా వారి "దేవదాసు" ఈ కష్టమైన పనిని సాధించినట్టు కనబడుతుంది. నేను "దేవదాసు" జంటను విడివిడిగా "ఇంటర్‌వ్యూ" చేసినప్పటికీ వారు చెప్పిన విషయాలు అనేకం ఒకదానికొకటి సరిపోతున్నాయి.

గొప్ప కథను తీసుకుని దాన్ని సాధ్యమైనంత విజయవంతం చెయ్యాలని నిర్మాతలకు పట్టుదల ఉండి, దర్శకుడు దీనికొరకు తన అనుభవాన్నంతా ధారపోసి, నటీనటులు కూడా అదే ఆశయంతో పరస్పరం సహకరించినట్లయితే వినోదావారి "దేవదాసు"కు లభిస్తున్న విజయం ఏ నిర్మాతకైనా లభించి తీరుతుంది.

★

కామెరామాన్ శ్రీ కె. రామనాథ్, ఫిల్మ్ సెంటర్ స్టూడియోవారూ కలిసి 'న్యూ ఈరా ప్రొడక్షన్స్' అనే పేరుతో ఒక సంస్థ స్థాపించారు. ఈ నెల 12వ తేదీ ఉదయం కోడంబాకం ఫిల్మ్ సెంటర్‌లో ప్రారంభోత్సవం జరిగింది.

* * *

"గుమాస్తా" చిత్రం తెలుగు తమిళ భాషల్లో తీసిన అరుణా ఫిలిమ్స్‌వారు తమిళంలో కొత్తచిత్రం నిర్మాణానికి సన్నాహాలు చేస్తున్నారు. ఈ నెల 15వ దానికి ప్రారంభోత్సవం జరిగింది.

* * *

ప్రతిభా పిక్చర్సువారు తాము నిర్మించబోయే జానపద చిత్రంలోకి కథానాయక పాత్రకోసం శ్రీ ఎన్. టి. రామారావును బుక్ చేసుకున్నారు. నాయిక పాత్రకు తగిన తారకోసం ఇంకా ఆలోచిస్తున్నారు.

* * *

మద్రాసు ఆర్ట్ ప్రొడక్షన్సువారి 'రోహిణి' ద్విభాషా చిత్రానికి షూటింగ్ చకచకా జరుగుతున్నది. సెప్టెంబరుకు సిద్ధం కావచ్చునట. ఈ చిత్రానికి మాటలు, పాటలు వ్రాసినవారు శ్రీ యండమూరి సత్యనారాయణ, కె. కె. బలిజేపల్లి లక్ష్మీకాంతం గార్లు. దర్శకుడు కమల్ ఘోష్; డైరెక్టర్ ఆఫ్ ఫొటోగ్రఫి పి. ఎల్. రాయ్; సూపర్ వైజింగ్ డైరెక్టరు లంకా సత్యం; సంగీతం జి. రామనాథన్, మహాదేవన్. ఈ చిత్రంలో మాధురీదేవి, జి. వరలక్ష్మి, నటరాజన్, రంగారావు, సహస్రనామం, కె. ఆర్. రామస్వామి మున్నగువారు నటిస్తున్నారు. చాలాకాలం తర్వాత హాస్యనటుడు శ్రీలంకా సత్యం ఈచిత్రంలో ఒకపాత్ర ధరిస్తున్నారు.

* * *

"బంధన్" "కంగన్" మొదలైన చిత్రాల్లో నటించి పేరుపొందిన తార లీలా చిట్నిస్ తన పేరిటనే ఒక సంస్థ నెలకొల్పి "ఆజ్ కీ బాత్" అనే చిత్రం నిర్మిస్తోంది. లీలా చిట్నిస్ ఒక తల్లి పాత్ర ధరిస్తుందట. ఆమె ఇద్దరు పుత్రులు అజిత్, ఉదయ్ ఇందులో నటిస్తారట. నూతన్, బిపిన్ గుప్త, కుమార్, మనమోహన్ కృష్ణ తదితర నటీనటులు.

* * *

"షహెన్‌షా" అనే చిత్రం నిర్మించిన బొంబాయి నటుడు ప్రేమ్‌నాథ్ "ప్రిజనర్ ఆఫ్ గోల్కొండా" (గోల్కొండ ఖయిదీ) అనే మరొక చిత్రం ప్రారంభించాడు. భారతదేశంలో బ్రిటిష్ ప్రభుత్వపు ఆఖరి దినాల్లోని రాజకీయ ఖయిదీల జీవితం ఈ చిత్రానికి ఆధారమట.


* * *

రాజ్‌కపూర్ "శ్రీ 420" అనే సంపూర్ణ హాస్యచిత్రం నిర్మాణం ప్రారంభించాడు. నర్గిస్, రాజ్‌కపూర్ ప్రధాన తారలు. నగర జీవితంమీద ఈ చిత్రం వ్యంగ్య విమర్శ చేస్తుందట.

రాజ్‌కపూర్ తీసిన మరొక చిత్రం "బూట్ పాలిష్" ఆగస్టులో విడుదల కావచ్చునట. ఈచిత్రం పూర్తిగా వాస్తవిక చిత్రమనీ, బొంబాయిలోని నిరుపేదల జీవితాన్ని చూపిస్తుందనీ, ఎక్కడా గ్లామరైజ్ చెయ్యడానికి ప్రయత్నించలేదనీ తెలుస్తున్నది. పైగా ఒక్క పాటకూడా ఉండదట.


★

Edited, Printed & Published by S. Sambhu Prasad at the Andhra Patrika Press, 7, Thambu ChettySt, Madras




మద్రాసు పురపాలక భవనం

ఫొటో: శ్రీ యస్. ఆర్. నంది.



మద్రాసులో వోటులేని పేవ్‌మెంట్ పౌరులు



డిస్ట్రిబ్యూటర్సు:
ఆంధ్ర - వినోదా పిక్చర్స్ సర్క్యూట్, విజయవాడ ★ సీడెడ్ నవయుగ-ఫిలిమ్సు, గుంతకల్లు ★ నైజామ్ - ప్రీమియర్ పిక్చర్సు, సికింద్రాబాదు
★ మైసూరు - తల్లం పిక్చర్సు సర్క్యూట్, బెంగుళూరు